teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151
# తీన్మార్
నేటి వాస్తవాలు... తెలుగు దిన పత్రిక
ములుగు | సంపుటి : 03 | సంచిక : 382 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | ఆదివారం | 26 మే 2024 | పేజీలు : 08 | వెల ₹5
Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నేడే జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్ష

### ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా నో ఎంట్రీ

న్యూ ఢిల్లీ, మే 25 (తీన్మార్ న్యూస్): ఐఐటీల్లో ప్రవేశానికి సంబంధించిన జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) అడ్వాన్స్‌డ్- 2024 నేడే ఆదివారం జరగనుంది. ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 1.91 లక్షల మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఈ పరీక్షలకు ఎక్కువ సంఖ్యలో తెలంగాణ, ఏపీ నుంచి హాజరుకానున్నారు. ఈ రెండు రాష్ట్రాల నుంచి దాదాపుగా 46 వేల అభ్యర్థులు ఎగ్జామ్

మిగతా 2 లో





## మూసీ సుందరీకరణ పనులపై సీఎం ఆరా

**మూసీ చుట్టూ 12 వేల అక్రమ కట్టడాలుగా గుర్తించిన అధికారులు**

**అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీ**


**ఎలక్షన్ కోడ్ అయిపోగానే గ్లోబల్ టెండర్ల ఖరారు**

హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): మూసీ సుందరీకరణ పనులు ఇక వేగవంతం కానున్నాయి. ఎలక్షన్ కోడ్ ముగిసిన వెంటనే పనులు పట్టాలెక్కనున్నాయి. ఈ మేరకు మూసీ సుందరీకరణపై అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. నానక్‌రామ్‌గూడలోని హెచ్‌జీసీ కార్యాలయంలో జరిగిన

మిగతా 2 లో




# టీకాంగ్రెస్‌కు కొత్త పీసీసీ బాస్..?



### మళ్ళీ రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం ఉండగా బీసీ,ఎస్సీ,ఎస్టీకి ఛాన్స్

### క్యాండిడేట్ సెలక్షన్‌కు కసరత్తు ప్రారంభించిన హైకమాండ్

**హైకమాండ్ తో సీనియర్ నేతల సంప్రదింపులు**

**తమకే ఇవ్వాలంటూ విజ్ఞప్తులు**

**ఆచితూచీ నిర్ణయం తీసుకోనున్న అధిష్టానం**

తెలంగాణ కాంగ్రెస్‌కు సంబంధించిన నిర్ణయాల కోసం హైకమాండ్ ఎంతగా మల్లగుల్లాలు పడుతోంది, గత కొన్ని నెలలుగా చూస్తున్నాం. ఈ క్రమంలో లోక్‌సభ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ హైకమాండ్‌కు కొత్త తలనొప్పి తప్పదనిపిస్తోంది. తెలంగాణ పీసీసీ చీఫ్‌గా ఎవరిని ఎంపిక చేయబోతోంది. గాంధీభవన్‌కు కొత్త బాస్ ఎవరు కానున్నారు. సీనియర్ల అభ్యంతరాలు, గ్రూప్ రాజకీయాలకు చెక్ పెట్టి ఆ నియామకాన్ని కాంగ్రెస్ ఎలా పూర్తి చేయబోతోంది.

తెలంగాణ బ్యూరో, మే 25 (తీన్మార్ న్యూస్): లోక్‌సభ ఎన్నికల తర్వాత కొత్త పీసీసీ చీఫ్ కసరత్తులు ప్రారంభించిన హైకమాండ్ కు ఆశలు పెట్టుకున్న సీనియర్లు తమకే ఇవ్వాలంటూ హైకమాండ్‌కు ఇప్పటికే విజ్ఞప్తులు చేసుకుంటున్నారు సీనియర్ నేతలు. అసంతృప్తులు బయటకు

మిగతా 2 లో



## 2024-25 విద్యా సంవత్సర క్యాలెండర్ విడుదల

**జూన్ 12 నుండి ప్రారంభంకానున్న పాఠశాలలు**

**అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు**

హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ప్రభుత్వం 2024-25 విద్యా సంవత్సర క్యాలెండర్‌ను విడుదల చేసింది. జూన్ 12, 2024 నుంచి రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. 2025, ఏప్రిల్ 23 వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. అక్టోబర్ 2 నుంచి 14 వరకు పాఠశాలలకు దసరా సెలవులు ప్రకటించారు. డిసెంబర్ 23 నుంచి 27 వరకు 5 రోజుల పాటు

మిగతా 2 లో

## ఇష్టానుసారంగా ఇంటర్ ఆన్సర్ షీట్ వాల్యువేషన్

**ఇంటర్మీడియేట్ వాల్యువేషన్ ప్రక్రియలోని లోపాలు**

**ఓ స్టూడెంట్‌కు 97 మార్కులు రాగా 77 మార్కులు నమోదు**

**రీవెరిఫికేషన్‌లో బయటపడ్డ బాగోతం**



.. వివరాలు 2లో




## రైలు ప్రయాణం చేసేవారికి "టికెట్" అప్డేట్

**ప్రయాణానికి 5ని. ముందు టికెట్‌ను బుక్ చేసుకోనుటకు సదుపాయం**

న్యూ ఢిల్లీ, మే 25 (తీన్మార్ న్యూస్): దేశంలో అతిపెద్ద రవాణా వ్యవస్థ అంటే భారతీయ రైల్వే అని చెప్పక తప్పదు. ఎందుకంటే ప్రతి రోజు లక్షలాది మంది ప్రయాణికులు


మిగతా 2 లో

## కవిత అరెస్ట్‌లో చట్టపరమైన ఉల్లంఘనలు

**కవిత తరఫున న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు**

**దర్యాప్తుపై ఈడీ డైరెక్టరేట్ కౌంటర్ దాఖలు**

**రెండు కేసుల్లో వాదనలు పూర్తి చేయాలని హైకోర్టు సూచనలు**



న్యూ ఢిల్లీ, మే 25 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బెయిల్ పిటిషన్లపై ఢిల్లీ హైకోర్టులో విచారణ జరిగింది. ఈడీ కౌంటర్ దాఖలు చేయగా కౌంటర్‌కు సీబీఐ గడువు కోరింది. కవిత తరఫున లాయర్ వాదనలు వినిపించగా సోమవారం కూడా ఆ వాదనలు కొనసాగనున్నాయి. మరోవైపు కవిత బెయిల్‌పై కేంద్ర దర్యాప్తుపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కౌంటర్

మిగతా 2 లో

## జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ మోసం

### 2 లక్షల ఉద్యోగాల ఊసే లేదు

### కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన కేటీఆర్

హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. ఏడాదికి 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు అని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక మోసాలు జరుగుతున్నాయి. 2 లక్షలు ఉద్యోగాలు ఏడాదిలో ఇస్తామన్నారు. ఒక్క నోటిఫికేషన్ కూడా రాలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రూప్-1 కింద 503 పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తే దాన్ని రద్దు చేసి కొత్తగా 60 పోస్టులు కలిపి మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చారు. దాన్ని కొత్త నోటిఫికేషన్ అంటున్నారు. 50 వేల పోస్టులతో



మిగతా 2 లో



## తెలంగాణ ఆర్టీలో గందరగోళం సృష్టిస్తున్న "మహాలక్ష్మి" పథకం

### మా ఫ్రీ బస్సు.. మా ఇష్టం

**ఆగకపోతే మా వాళ్లతో కొట్టించి సస్పెండ్ చేయిస్తాం**


**మహిళలపై ఫిర్యాదుకు పోలీస్ స్టేషన్ వద్ద బస్సు ఆపిన డ్రైవర్**

హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించింది. ఫ్రీగా ప్రయాణించే అవకాశం అయితే కల్పించారు. కానీ, బస్సుల సంఖ్య మాత్రం పెంచలేదు. దీంతో బస్సులో రద్దీ పెరిగిపోయి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అయితే, సీట్ల కోసం జుట్లు పట్టుకొని కొట్టుకుంటే మరికొన్ని ప్రాంతాల్లో ఏకంగా చెప్పులతో కొట్టుకున్నారు. అది వేరే విషయం అనుకొండీ! ఇక మొన్నటికి మొన్న బస్సు ఓవర్ లోడ్ అయిందని డ్రైవర్

మిగతా 2 లో

## ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా 48గం. మద్యం దుకాణాల బంద్

### మే 25 6సా. నుంచి 27 సా.6 వరకు మూతపడనున్న వైన్స్




తెలంగాణ బ్యూరో, మే 25 (తీన్మార్ న్యూస్): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సందర్భంగా 48 గంటలపాటు మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. పోలింగ్ జరగనున్న ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లో బంద్ కానున్నాయి. 2024 మే 25 సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి అంటే మే 27 సాయంత్రం 6 గంటల వరకు వైన్స్ మూసివేయనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలు జరగని ప్రాంతంలో మాత్రం మద్యం దుకాణాలు తీసి ఉంటాయి. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. కాగా మే 27న ఎమ్మెల్సీ ఎన్నికలు

మిగతా 2 లో



## మేడిగడ్డపై ఎల్అండ్ టీ సంస్థ నిషేధాజ్ఞలు

**ప్రాజెక్టు పైకి అనుమతించకుండా నిషేధం**

**మేడిగడ్డపై మొదలైన అనుమానాలు**

భూపాలపల్లి, మే 25 (తీన్మార్ న్యూస్): మేడిగడ్డపై ఎల్అండ్ టీ సంస్థ నిషేధాజ్ఞలు విధించింది. గేట్లు బంద్ చేసి ప్రాజెక్టు పైకి ఎవరినీ వెళ్లనీయడంలేదు. ముఖ్యంగా మీడియాను కూడా అనుమతించడం లేదు. రిపేర్లు చేస్తుండగా బ్యారేజీ 20, 21వ పియర్ల పక్కన భారీ బొయ్యారం బయటపడటం మీడియాలో రావడంతో అప్రమత్తమైన ఎల్అండ్ టీ సంస్థ గేట్లు

మిగతా 2 లో

## బిగ్ బాస్కెట్ గోడౌన్స్‌పై జీహెచ్ఎంసీ అధికారులు దాడులు

### ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించలేదని లైసెన్స్ సస్పెండ్




హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): ఆన్ లైన్ సెల్లింగ్ స్టోర్ బిగ్ బాస్కెట్ గోడౌన్స్ పై జీహెచ్ ఎంసీ అధికారులు దాడులు నిర్వంచారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని లైసెన్స్ సస్పెండ్ చేశారు. కొండాపూర్‌లోని మసీదు బండలోని బిగ్ బాస్కెట్ గోదాంలో జీహెచ్ ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు జరిపిన తనిఖీల్లో గడువు ముగిసిన పలు రకాల పదార్థాలను గుర్తించారు. ఫుడ్ సేఫ్టీ

మిగతా 2 లో



## ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుకు ఎన్ఎంసీ ఆదేశాల అమలు

**ప్రభుత్వ కాలేజీల్లోని సీట్లలో 10% కేటాయింపు**

**ప్రైవేట్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లలో 10% ఈడబ్ల్యూఎస్‌కు**

**ప్రతిపాదన అమలైతే కేటగిరీలో అదనంగా 350 సీట్లకు అవకాశం**

తెలంగాణ బ్యూరో, మే 25 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఆర్థికంగా బలహీనమైన వర్గాలకు (ఈడబ్ల్యూఎస్) రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. నేషనల్

మిగతా 2 లో

# టీకాంగ్రెస్ కు కొత్త "పీసీసీ" బాస్..?

**మొదటి పేజీ తరువాయి**

రాకుండా.. ఆచితూచి నిర్ణయం తీసుకోనున్న అధిష్టానం, సీఎం రేవంత్‌తో కలుపుగోలుగా ఉండేవాళ్లకే అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో అందరూ కూడా వాటి రిజల్ట్స్ కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్పార్టీ కొత్త పిసిసి అధ్యక్షున్ని నియమించే పనిలో పడిందని సమాచారం. ఇప్పటివరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిసిసి బాధ్యతలను చేపడుతున్నారు. ఇక ఆయన ముఖ్యమంత్రి హోదాలో ఉన్న నేపథ్యంలో పిసిసి అధ్యక్ష పదవిని మరొకరికి అప్పగించాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తుందట. మరో వారం లేదా పది రోజుల్లో లేకపోతే పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కొత్త పిసిసి అధ్యక్షులు రాబోతున్నారట. అయితే ఈ పదవి కోసం ఇప్పటికే చాలామంది కాంగ్రెస్ పెద్దలు, యంగ్ లీడర్లు, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వారు, టికెట్ రాని వారు దరఖాస్తు ప్రయత్నింస్తున్నారని సమాచారం. ఢిల్లీకి వెళ్లి మరి కాంగ్రెస్ అగ్ర నేతల వద్ద తమ వినతులు ఇస్తున్నారట తెలంగాణ కాంగ్రెస్ లీడర్లు.

లోక్ సభ ఫలితాలు రాగానే కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్త నేత వస్తారంటున్నారు. రేవంత్‌రెడ్డి కూడా పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని పూర్తిగా పాలనపైనే దృష్టి పెట్టాలనుకుంటున్నారు. ఇక హైకమాండ్ కూడా గాంధీభవన్‌కు కొత్త బాస్‌గా ఎవరిని నియమించాలనే విషయంపై కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తోంది. పీసీసీ చీఫ్ గా ఎవరు వస్తారనే విషయాన్ని సీఎం రేవంత్ దగ్గర ప్రస్తావిస్తే ఆ విషయం తన పరిధిలో లేని అంశమని, హై కమాండ్ ఎవరిని నియమించినా తనకు సమ్మతమేనని రేవంత్ రెడ్డి చెప్తున్నారట. పార్టీని ప్రతిపక్షం నుంచి అధికారంలోకి తీసుకొచ్చిన రేవంత్ రెడ్డి స్థాయిలో పనిచేయగలిగే వ్యక్తి ఎవరున్నారనే అంశంపై పార్టీ అధిష్ఠానం ఫోకస్ చేసినట్టు తెలుస్తోంది. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరైతే బాగుంటుంది? ఎవరైతే నేతలందరినీ కలుపుకొని వెళ్ళగలరు అనే దానిపై హై కమాండ్ సమాచారం సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సీనియర్ నేతలు ఆశలు పెట్టుకున్నట్లు బహిరంగంగానే ప్రకటించుకున్నంత పనులు చేస్తున్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఇప్పుడు కూడా తాను పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు చెబుతున్నారు. ఇక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సైతం తనకు పీసీసీ చీఫ్ పదవి కావాలని హై కమాండ్ కి రిక్వెస్ట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ముఖ్యమంత్రి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి పీసీసీ చీఫ్ పదవి రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వరనే వాదన బలంగా వినిపిస్తోంది. దీంతో బీసీ, ఎస్సీ సామాజిక వర్గాల నేతలు పీసీసీ చీఫ్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీసీసీ చీఫ్ తనకి ఇవ్వాలని చాలా రోజుల నుండి అడుగుతున్నారట. కర్ణాటకలో డీకే శివకుమార్ డిప్యూటీ సీఎంతో పాటు పీసీసీ చీఫ్ గా ఉన్నారని తెలంగాణలో సైతం అలాంటి నిర్ణయాన్నే తీసుకోవాలని భట్టి పట్టుపడుతున్నట్లు సమాచారం. మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం పీసీసీ చీఫ్ రేసులో ఉన్నారు. తాను విద్యార్థి దశ నుండి కాంగ్రెస్ పార్టీలో పనిచేస్తున్నానని తనకి అధ్యక్షుడిగా అవకాశం ఇస్తే బాగుంటుందని కాంగ్రెస్ పెద్దల దగ్గర చెబుతున్నట్లు సమాచారం.

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ సైతం పీసీసీ రేసులో తాను ఉన్నట్లు ప్రకటించారు. మరో బీసీ నేత మధుయాష్కీ గౌడ్ కూడా పీసీసీ చీఫ్ రేసులో ఉన్నట్లు ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఏఐసీసీ సెక్రటరీ సంపత్‌కుమార్ సైతం పీసీసీ పదవి తనకి వస్తుందనే ధీమాలో ఉన్నారు. మొన్న నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆశించారు. మాదిగలకు కాంగ్రెస్ సరైన గౌరవం ఇవ్వడం లేదనే చర్చ నేపథ్యంలో పార్టీ అధ్యక్ష పదవి మాదిగ సామాజికవర్గానికి చెందిన సంపత్ కి ఇస్తే బాగుంటుందనే వాదన నడుస్తోంది. ఇక మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అద్దంకి దయాకర్ లాంటి వాళ్ళ పేర్లు కూడా పీసీసీ చీఫ్ పదవి కోసం పరిశీలనలో ఉన్నట్లు వినిపిస్తోంది. అయితే ప్రధానంగా జగ్గారెడ్డి, మహేష్ కుమార్ గౌడ్, సంపత్ కుమార్ ల మధ్యే ప్రధాన పోటీ ఉన్నట్లు సమాచారం. అధికార పార్టీ అధ్యక్ష పదవి కోసం పదికి పైగా మంది నేతలు సీరియస్ గా ప్రయత్నిస్తున్నారు. రెడ్డి సామాజికవర్గం నుంచి సీఎం ఉ ఒడడంతో బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాల నేతలనుంచి ఒకరికి పీసీసీ పదవి దక్కనుందని గాంధీభవన్‌లో జోరుగా చర్చ జరుగుతోంది. కాగా హైకమాండ్ నిర్ణయం ఏంటి.. కొత్త పీసీసీ ఎవరూ అనేది తెలవాలంటే కొద్ది రోజులు వేచి చూడాల్సిందే.

## 2024-25 విద్యా సంవత్సర క్యాలెండర్ విడుదల

**మొదటి పేజీ తరువాయి**

క్రిస్మస్ సెలవులు కాగా, వచ్చే ఏడాది జనవరి 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. 2025, ఫిబ్రవరి 28లోపు పదో తరగతి ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలోని హైస్కూల్స్ ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.45 గంటల వరకు, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ ఉదయం 9 నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు కొనసాగనున్నాయని పేర్కొన్నారు.

**229 పనిదినాలు**

తెలంగాణలో ఒకటి నుంచి 10వ తరగతుల వరకు అకడమిక్ క్యాలెండర్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ విద్యాసంవత్సరంలో మొత్తం 229 రోజులు స్కూల్స్ పనిచేయనున్నాయి. జూన్ 12, 2024న ప్రారంభమై ఏప్రిల్ 23, 2025తో ముగుస్తాయి. ఏప్రిల్ 24, 2025 నుంచి జూన్ 11, 2025 మొత్తం 49 రోజులు ఈ విద్యాసంవత్సరంలో వేసవి సెలవులు ఉంటాయి. అలాగే అక్టోబర్ 13 నుంచి 25 వరకు మొత్తం 13 రోజుల దసరా సెలవులు ప్రకటించారు. వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 17వ తేదీ వరకు మొత్తం 6 రోజులు సంక్రాంతి సెలవులు ప్రకటించారు. దీంతో పాటు ప్రతి రోజు ప్రభుత్వ పాఠశాలల్లో 5 నిమిషాల యోగా, మెడిటేషన్ క్లాసులు ఉండాయని ప్రకటించింది.

**పరీక్షల షెడ్యూల్**

అలాగే పరీక్షల షెడ్యూల్ ను విద్యాశాఖ ప్రకటించింది. జులై 31, 2024లోగా ఫార్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు, సెప్టెంబర్ 30, 2024 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను నిర్వహించాలని ఆదేశించారు. అదే విధంగా ఈ ఏడాది అక్టోబర్ 21 నుంచి 28 వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షలు, డిసెంబర్ 12 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్-3 పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. జనవరి 29, 2025 లోపు ఫార్మేటివ్ అసెస్మెంట్-4 పరీక్షలను, వచ్చే ఏడాది ఏప్రిల్ 9 నుంచి 29 వరకు సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను (1 నుంచి 9 క్లాస్ లకు) నిర్వహించనున్నారు. పదో తరగతి విద్యార్థులు 2025 ఫిబ్రవరి 28లోపు ప్రీ ఫైనల్ నిర్వహించున్నారు. మార్చి, 2025లో పదో తరగతి ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నట్లు విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ లో పేర్కొంది.

## రైలు ప్రయాణం చేసేవారికి "టికెట్" అప్డేట్

**మొదటి పేజీ తరువాయి**

రైలు ద్వారా తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు. రవాణా ఛార్జీలు తక్కువగా ఉన్న కారణంగా ప్రతి ఒక్కరు రైలు ప్రయాణాన్ని ఎంచుకుంటారు. సామాన్యులు సైతం ఎక్కువ ఈ రైలు ప్రయాణమే చేస్తుంటారు. అయితే ఎక్కడికైనా రైలు ప్రయాణం చేయాలంటే ముందుగా టికెట్స్ బుక్ చేసుకుంటాము. టికెట్స్ కోసం కొన్ని నెలల ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. కొన్ని సమయాల్లో నెల ముందు బుక్ చేసుకుంటాము. ఈ బుకింగ్‌లో తత్కాల్ సదుపాయం కూడా ఉంటుంది. ఒక రోజు ముందు ప్రయాణం చేయాలంటే బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉండదు. అలాంటి సమయంలో తత్కాల్ టికెట్‌ను బుక్ చేసుకోవాలి. అదే కొన్ని గంటల ముందు రైలు ప్రయాణం చేయాల్సి వస్తే టికెట్ బుకింగ్ చేసుకునేందుకు అవకాశం ఉండదు. అలాంటి సమయంలో రైలు బయలుదేరడానికి ఓ 5 నిమిషాల ముందు కూడా టికెట్‌ను బుక్ చేసుకోవచ్చు. అదేలాగో చూద్దాం. చాలా మంది రైలు ప్రయాణం కోసం ముందుగానే టికెట్స్ బుక్ చేసుకుని టికెట్ క్యాన్సిల్ చేసుకునేవారు కూడా ఉంటారు. అలాంటి సందర్భంలో ఖాళీగా ఉన్న టికెట్లను విక్రయించేందుకు రైల్వే శాఖ ఈ సదుపాయాన్ని తీసుకొచ్చింది. ప్రతి ట్రైన్ టికెట్ బుకింగ్ కన్ఫర్మేషన్ కోసం రైల్వే రెండు ఛార్ట్‌లను రెడీ చేస్తుంటుంది. ఫస్ట్ ఛార్ట్ అనేది రైలు బయల్దేరడానికి 4 గంటల ముందు రెడీ చేస్తుంది. ఇక రెండో ఛార్ట్ రైలు స్టార్ట్ అవ్వడానికి ముందు తయారు చేస్తుంది. గతంలో అరగంట ముందు వరకు మాత్రమే టికెట్ బుకింగ్‌కు అనుమతించేవారు. ఇప్పుడు రైలు బయల్దేరడానికి 5 నిమిషాల ముందు వరకు ఆ వెసులుబాటు కల్పిస్తున్నారు రైల్వే అధికారులు. రైలు బయలుదేరే ఐదు నిమిషాల ముందు కూడా టికెట్లు అందుబాటులో ఉంటే ఆన్‌లైన్/ ఆఫ్‌లైన్‌లో కూడా బుక్ చేసుకునే సదుపాయం తీసుకువచ్చింది రైల్వే. అయితే బోర్డింగ్ స్టేషన్ నుంచి మాత్రమే బుక్ చేసుకోవచ్చు. మధ్య స్టేషన్ నుంచి కావాలంటే అనుమతి ఉండదు. ఇక వేళ మధ్య స్టేషన్ నుంచి టికెట్ కావాలంటే టీటీఈని సంప్రదించాల్సి ఉంటుంది.

## ఇష్టానుసారంగా ఇంటర్ ఆన్సర్ షీట్ వాల్యువేషన్

హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): ఇంటర్మీడియేట్ వాల్యువేషన్ ప్రక్రియలోని లోపాలు బయటపడుతున్నాయి. ఓ మెరిట్ స్టూడెంట్‌కు వందకు 97 మార్కులు రాగా 77 మార్కులు మాత్రమే వేశారు. ఈ బాగోతం రీవెరిఫికేషన్‌లో బహిర్గతమైంది. ఎగ్జామినర్ చేసిన తప్పును సరిదిద్దుకోకపోగా తప్పును కప్పిపుచ్చుకునేందుకు ఇంకో తప్పు చేశారు. హైదరాబాద్ జిల్లాలోని ఓ ప్రైవేటు కాలేజీలో సంహిత ఎంఈసీ సెకండియర్ చదువుతున్నది. ఇటీవల రిలీజ్ అయిన ఇంటర్ పరీక్షల్లో ఆమెకు 926 మార్కులు వచ్చాయి. అయితే అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించిన ఆమెకు కామర్స్ లో మాత్రం 77 మార్కులే వచ్చాయి. మంచి మార్కులు వస్తాయని భావించిన ఆమె తక్కువ మార్కులు రావడంతో రూ.వెయ్యి ఫీజు కట్టి రీవెరిఫికేషన్ కు అప్లై చేసింది. ఆన్సర్ షీటు చూశాక మార్కుల్లో తేడా కనిపించింది. ముందుగా 97 వేసి ఆ తర్వాత 77కు కుదించినట్టు ఆమె నిర్ధారించుకున్నది. ఈ విషయాన్ని కాలేజీ లెక్చరర్లతో పాటు ఈ నెల 20న ఇంటర్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకుపోయింది. అయినా, ఇప్పటికీ దానిపై ఎలాంటి చర్యలు కనిపించలేదు. ఆన్సర్ షీట్ వాల్యువేషన్ ఇష్టానుసారంగా చేసినట్టు స్పష్టమవుతున్నది. ఎగ్జామినర్ ముందుగా 77 మార్కులు వేశారు. అయితే, కౌంటింగ్ లో 97 వచ్చినట్టుగా తప్పు గుర్తించిన స్క్రూటినైజర్ ఎగ్జామినర్ దృష్టికి తీసుకుపోయినట్టు తెలుస్తున్నది. దీంతో ఆ తప్పును కప్పిపుచ్చుకునేందుకు మొత్తం పేపర్ లో వేసిన మార్కులను తగ్గిస్తూ చివరికి 77కు తగ్గించినట్టు తెలుస్తున్నది. రీవెరిఫికేషన్ చేసిన ఎగ్జామినర్ కూడా ఈ తప్పును గుర్తించకపోవడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఈసారి రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోసం 48వేల మంది దరఖాస్తు చేసుకోగా, సుమారు 70 మందికి 2 నుంచి 10 మార్కుల వరకూ పెరిగినట్టు అధికారిక వర్గాలు చెప్తున్నాయి. కాగా, సంహితకు సంబంధించిన పేపర్ వాల్యువేషన్ నల్లగొండలో జరిగినట్టు తెలుస్తున్నది. తనకు న్యాయం చేయాలని ఆమె కోరుతున్నది.

**న్యాయం చేస్తం**

సంహిత పేపర్ వాల్యువేషన్ అంశం మా దృష్టికి వచ్చింది. దీనిపై ఇంటర్నల్ ఎంక్వైరీ చేస్తున్నాం. స్టూడెంట్ కు నిజంగా అన్యాయం జరిగితే తప్పకుండా న్యాయం చేస్తం. తప్పుచేసిన వారిపైనా చర్యలు తీసుకుంటం.

## జాబ్ క్యాలెండర్ పేరిట కాంగ్రెస్ పార్టీ మోసం

**మొదటి పేజీ తరువాయి**

మెగా డీఎస్సీ వేస్తమన్నాడు. తాము 5,089 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే దాన్ని కూడా రద్దు చేశారు. అయితే 50 వేల ఉద్యోగాలతో డీఎస్సీ నోటిఫికేషన్ వస్తదని అనుకుంటే.. 5,089 పోస్టులకు అదనంగా మరో 5913 కలిపి 11 వేల ఉద్యోగాలతో కొత్త నోటిఫికేషన్ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు ఇచ్చిందేమీ లేదు. ఇవ్వకపోగా 2 లక్షల ఉద్యోగాల మాట తుంగలో తొక్కారు. జాబ్ క్యాలెండర్ అతిగతి లేదు. 4 వేల నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని భట్టి విక్రమార్క పచ్చి అబద్దం చెప్పారు అని కేటీఆర్ మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నిర్వహించే రాత పరీక్షలకు రూపాయి కూడా ఫీజు తీసుకోనని రేవంత్ అన్నాడు. టెట్ ఫీజును 400 నుంచి 2 వేలు చేశాడు. ఇది వాస్తవం. ఇంకో దారుణం ఏంటంటే మేం కష్టపడి పరిశ్రమలు తెస్తే వాటిని రేవంత్ పాతరేస్తున్నాడు. ఫార్మా సిటీ పేరిట 12 వేల ఎకరాల్లో ప్రపంచంలోనే అతిపెద్ద ఫార్మా క్లస్టర్ పెట్టి, ప్రత్యక్షంగా, పరోక్షంగా 5 లక్షల ఉద్యోగాల సృష్టికి రంగంమంతా సిద్ధం చేస్తే దానిని కూడా రేవంత్ రద్దు చేశారు. ఫార్మా సిటీని పక్కనపెట్టి రియల్ ఎస్టేట్ చేస్తానని రేవంత్ రెడ్డి అంటున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు.

## చనిపోయిన వ్యక్తికి ట్రీట్మెంట్ చేశారంటూ ఆరోపనలు

**రాత్రే చనిపోయాడని సిబ్బంది ద్వారా సమాచారం : బంధువులు**

**డాక్టర్ల నిర్లక్ష్యంతో చనిపోయాడంటూ బంధువులు ఆందోళన**



హైదరాబాద్, మే 25 (తీన్మార్ న్యూస్): చనిపోయిన వ్యక్తికి డాక్టర్లు ట్రీట్మెంట్ చేశారని మృతుడి బంధువులు ఆరోపించారు. సూర్యాపేట జిల్లా సోలిపేటకి చెందిన సమ్మయ్యకు గుండెనొప్పి రావడంతో శుక్రవారం ఉదయం 10 గంటలకు హైదరాబాద్ ఎల్బీనగర్ లోని ఓ కార్పొరేట్ హాస్పిటల్ కు తీసుకొచ్చారు. సమ్మయ్యకు ఈసీజీ చేసిన డాక్టర్లు గుండె సమస్య ఉందని చెప్పి జాయిన్ చేసుకున్నారు. అయితే రాత్రి సమ్మయ్య చనిపోయాడని కుటుంబసభ్యలకు హాస్పిటల్ సిబ్బంది చెప్పారని సమాచారం. డాక్టర్ల నిర్లక్ష్యంతో సమ్మయ్య చనిపోయాడంటూ అతని బంధువులు ఆందోళన చేశారు. దీంతో హాస్పిటల్ ముందు ఉద్రిక్తత చోటు చేసుకుంది. నడుచుకుంటూ హాస్పిటల్ కు వచ్చిన వ్యక్తిని చంపేశారని ఆరోపించారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రూ. 60 వేలు కడితేనే డెడ్ బాడీ ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చనిపోయిన వ్యక్తికి ట్రీట్మెంట్ చేశారని ఆరోపించారు.

## మూసీ సుందరీకరణ పనులపై సీఎం ఆరా

**మొదటి పేజీ తరువాయి**

సమావేశంలో మున్సిపల్ శాఖ కార్యదర్శి దాన కిశోర్, మూసీ రివర్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఆమ్రపాలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూసీ ప్రాజెక్టు పురోగతి పై అధికారులను సీఎం అడిగి తెలుసుకున్నారు. అత్యంత భారీ ప్రాజెక్టుగా రూపుదిద్దుకుంటున్న మూసీ సుందరీకరణకు అవసరమైన నిధులను సేకరించే విషయంలోనూ అధికారులతో చర్చించినట్టు సమాచారం. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కోసం పీపీపీ పద్ధతిలో టెండర్లు పిలిచారు. దాదాపు 58 వేల కోట్లు ఖర్చయ్యే మూసీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి. ఈ మెగా ప్రాజెక్టును చేపట్టేందుకు ప్రముఖ కంపెనీలు ముందుకు వస్తున్నట్టు సమాచారం. ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటికే సర్వే పనులు పూర్తి చేసిన అధికారులు నదీ ప్రవాహ తీరుపై కూడా స్టడీ చేశారు. ముఖ్యంగా మూసీ చుట్టూ 55 కిలోమీటర్ల పరిధిలో దాదాపు 12 వేల అక్రమ కట్టడాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. డ్రోన్ సర్వే ద్వారా మూసీలో అక్రమ కట్టడాలపై అధికారులు ఒక నివేదికను సిద్ధం చేసి, దీనిపై సీఎం రేవంత్‌కు వివరించినట్టు సమాచారం. ఇప్పటికే గ్లోబల్ టెండర్లు పిలిచామని, ఎలక్షన్ కోడ్ అయిపోగానే టెండర్లను ఫైనల్ చేయనున్నట్టు వివరించారు. ఈ మొత్తం వివరాలు తెలుసుకున్న సీఎం రేవంత్. ఆయా పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం.

**మౌలిక సదుపాయాలపై స్పెషల్ ఫోకస్**

మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు సంబంధించి అధికారులు పూర్తిస్థాయిలో సర్వే పూర్తి చేశారు. మూసీనదికి ఇరువైపులా అందుబాటులో ఉన్న భూమిని పూర్తిగా వినియోగంలోకి తీసుకొచ్చి మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఉపయోగించుకోవాలని భావిస్తున్నారు. ఇదే విషయాన్ని సీఎం రేవంత్‌కు వివరించినట్టు సమాచారం. మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టడంతోపాటు మురుగును పూర్తిగా మళ్లించడం, రిపేర్లు చేయడంపై దృష్టి పెట్టారు. మూసీ వెంట వివిధ ప్రైవేట్ సంస్థల సహకారంతో రెస్టారెంట్లు, వాటర్ అమ్యూజ్‌మెంట్స్, ఎంటర్‌టైన్‌మెంట్స్ వంటి వాటి కోసం మౌలిక సదుపాయాలను కల్పించాలని సర్కారు నిర్ణయించింది. మురికికూపంగా మారిపోయిన మూసీనదిని ఉపాధి కల్పన జోన్‌గా మార్చాలని డిసైడ్ అయింది. ఈ మేరకు మధ్యంతర బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించింది. ఈ మేరకు మూసీ సుందరీకరణ ప్రాజెక్టుపై ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది.

**మూసీ అభివృద్ధి ఇలా**

తూర్పున ఔటర్ రింగ్ రోడ్డు గౌరెల్లి నుంచి పశ్చిమాన ఔటర్ రింగ్ రోడ్డు నార్సింగి వరకు 55 కిలోమీటర్ల మేర మూసీని అభివృద్ధి చేయడానికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) ఆధ్వర్యంలో ఇప్పటికే ప్రణాళికలు రూపొందిస్తున్నా రు. మూడేండ్లలో మూసీ అభివృద్ధి పనులు పీపీపీ పద్ధతిలో పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో ఆ దిశగా అధికారులు కార్యాచరణ రూపొందిస్తు న్నారు. విదేశాల్లో పలు రివర్ ఫ్రంట్ ప్రాజె క్టులను పరిశీలించిన అధికారుల బృందం మూసీ అభివృద్ధికి రూ.58 వేల కోట్లకు పైగా ఖర్చవుతుందని అంచనా వేసింది. మూసీనది అభివృద్ధిలో భాగంగా పీపుల్స్ ప్లాజాలు, సైకిల్ ట్రాక్‌లు, గ్రీన్‌వేలు, హాకర్ జోన్లు, వంతెనలు, వినోద, పర్యాటక ప్రాంతాలు, క్రీడా సౌకర్యాలు, పార్కింగ్ ప్రాంతాలు, వాణిజ్య, రిటైల్ స్థలాలు, ఆతిథ్య మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ విశ్వనగరంగా మరింత అభివృద్ధి సాధిస్తుందని భావిస్తున్నారు.

## కవిత అరెస్ట్‌లో చట్టపరమైన ఉల్లంఘనలు

**మొదటి పేజీ తరువాయి**

దాఖలు చేసింది. ఈ కేసులో తాము వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఇక విచారణ సందర్భంగా ఈడీ అరెస్ట్ చేసిన విధానం కేసులో కవిత పాత్ర గురించి దర్యాప్తు సంస్థ చెప్పిన విషయాలపై కవిత తరఫున న్యాయవాది కోర్టుకు వివరించారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాది విక్రమ్ చౌదరి వాదనలు వినిపిస్తూ కవిత అరెస్ట్‌లో అనేక చట్టపరమైన ఉల్లంఘనలు జరిగాయి. దానిపై సుప్రీంకోర్టులో ఆర్టికల్ 32 కింద పిటిషన్ చేశాం. సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది. ఆ కేసు జూలైకి వాయిదా పడింది. ఈలోగా బెయిల్ కోసం దరఖాస్తు చేశాం. మహిళకు ప్రత్యేక రక్షణలు ఉన్నాయి. ఈ రక్షణ కింద కవితకు బెయిల్ ఇవ్వాలని కోరుతున్నాం. 2022 ఆగస్టు 7న సీబీఐ కేసు నమోదు చేసింది. సీబీఐ, ఈడీ కేసులు నమోదు చేసినప్పుడు కవిత పేరు రాలేదు. శ్రీనివాస్ రావు అనే వ్యక్తి కోటి రూపాయలు ఇచ్చారని అరుణ్ పిళ్లై స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇండో స్పిరిట్‌లో వాటా కోసం ఇచ్చారని చెప్పారు. అప్పుడు తొలి సారిగా కవిత పేరు తెరపైకి వచ్చింది. అరుణ్ పిళ్లై ఆ తర్వాత తన వాంగ్మూలం వెనక్కి తీసుకున్నారు. అభిషేక్ బోయినపల్లి ఈ కేసులో మధ్యంతర బెయిల్‌పై ఉన్నారు. కవిత మొబైల్ ఫోన్లు ధ్వంసం చేశారని సీబీఐ చెప్పింది. విచారణ జరపకుండా ఈ విషయం రిమాండ్ రిపోర్టులో పెట్టారు. ముందుగా సీబీఐ సీఆర్‌పీసీ160 నోటీసు ఇచ్చి నవంబర్ 2022 ఆమె ఇంట్లో 7 గంటలు విచారణ జరిపారు. ఈడీ మార్చి 2023లో విచారణ జరిపింది. మహిళను కార్యాలయంలోకి పిలవద్దని, సీఆర్‌పీసీ160 ప్రకారం నడుచుకోవాలని చెప్పినా ఈడీ వినకుండా కార్యాలయానికి పిలిచింది. అరెస్టు చేసిన వ్యక్తితో కలిపి విచారణ జరపాలని ఢిల్లీకి పిలిచారు. కవిత ఫోన్లు సీజ్ చేశారు. అని కవిత లాయర్ విక్రమ్ చౌదరి వాదనలు వినిపించారు. స్పందించిన న్యాయస్థానం దీనికి సంబంధించి ఆదివారం సాయంత్రంలోపు కౌంటర్ కాపీని కవిత న్యాయవాదికి మెయిల్ ద్వారా ఇవ్వాలని ఈడీ, సీబీఐని ఆదేశించింది. ఈడీ, సీబీఐ కేసులో కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ సోమవారానికి వాయిదా పడింది. బెయిల్ పిటిషన్లపై సోమవారం, మంగళవారం రెండు రోజుల్లో ఢిల్లీ హైకోర్టు విచారణ జరపనుంది. అంతకు ముందు మే 27న కౌంటర్ దాఖలు చేస్తామని సీబీఐ తెలిపింది. అదే విధంగా జూన్ 7న ఛార్జిషీట్ దాఖలు చేస్తామని కోర్టుకు వెల్లడించింది. సోమవారం నాడు రెండు కేసుల్లో కవిత తరఫున వాదనలు పూర్తి చేయాలని హైకోర్టు సూచించింది. మంగళవారం నాడు ఈడీ, సీబీఐ వాదనలు వింటామని తెలిపింది.

## ఎంబీబీఎస్ సీట్ల కేటాయింపుకు ఎన్ఎంసీ ఆదేశాల అమలు

మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఆదేశాల మేరకు ఈ ఏడాది నుంచే రిజర్వేషన్లు అమలు చేయనుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని అన్ని సీట్లలో 10 శాతం, ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లోని (మైనారిటీ కాలేజీలు మినహా) సగం కన్వీనర్ కోటా సీట్లలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కోసం కేటాయించనున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఈ మేరకు అందిన ప్రతిపాదనకు ప్రభుత్వం సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్లు అధికారులు చెబుతున్నారు.

**ఇప్పటివరకు 7 కాలేజీల్లోనే**

రాష్ట్రంలో ప్రస్తుతం కేవలం 7 ప్రభుత్వ వైద్య కళాశాలలు హైదరాబాద్‌లోని గాంధీ, ఈఎస్ఐ మెడికల్ కాలేజీలు, మహబూబ్‌నగర్, నిజామాబాద్, సిద్ధిపేట మెడికల్ కాలేజీలు, వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ, ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ మెడికల్ కాలేజీల్లోనే ఎన్ఎంసీ అనుమతి మేరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలవుతున్నాయి. గతేడాది వరకు ఆయా కాలేజీల్లో 103 ఎంబీబీఎస్ సీట్లు ఈ కోటా కింద అగ్రవర్ణాల్లోని పేదలకు ఇచ్చారు. కాగా ఈ ఏడాది నుంచి అన్ని మెడికల్ కాలేజీల్లోని కన్వీనర్ కోటా సీట్లకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌ను అమలు చేస్తే మరో 350 వరకు ఎంబీబీఎస్ సీట్లు అగ్రవర్ణ పేదలకు దక్కే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే దీనిపై పూర్తిస్థాయిలో స్పష్టత రావాల్సి ఉంది. నీట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెలువడిన తర్వాత, అడ్మిషన్ నోటిఫికేషన్ కంటే ముందే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు సంబంధించిన ఉత్తర్వులు వెలువడుతాయని వైద్యశాఖ వర్గాలు వెల్లడించాయి.

**జనరల్ కోటా సీట్లకు గండి**

రాష్ట్రంలో గతేడాది వరకు 56 మెడికల్ కాలేజీల్లో 8,490 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో 27 ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో 3,790 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అలాగే 29 ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో 4,700 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. అయితే ఇప్పటివరకు 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలుకు గాను అంతే మొత్తంలో సీట్లను ఆయా మెడికల్ కాలేజీలకు ఎన్ఎంసీ మంజూరు చేసింది. దీనివల్ల ఇతర రిజర్వేషన్ కేటగిరీ విద్యార్థులకు కానీ, జనరల్ కేటగిరీ కోటా సీట్లకు కానీ కోత పడేది కాదు. కానీ తాజాగా ఎన్ఎంసీ అదనపు సీట్లు మంజూరు చేయడం కుదరదని, ఉన్న సీట్లలోనే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలు చేయాలని ఆదేశించింది. అయితే బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి కోత ఉండదని అంటున్నారు. అంటే జనరల్ కేటగిరీ సీట్లకు కోత పెట్టి వాటిని ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు కేటాయిస్తారు. అలాగైనా తమకు నష్టం జరుగుతుందని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అంటున్నారు. జనరల్ కేటగిరీలోనూ తమకు ప్రతిభ ప్రకారం రావాల్సిన సీట్లకు గండి పడుతుందని, దీనివల్ల తమకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**రూ.8 లక్షల ఆదాయ పరిమితి**

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వర్తించాలంటే ఆదాయం రూ.8 లక్షల లోపు ఉండాలి. ఈ మేరకు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా రెవెన్యూ శాఖకు ఆదేశాలున్నాయి. అన్ని మెడికల్ కాలేజీల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ అమలయ్యే పక్షంలో ఈ మేరకు విద్యార్థులు ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తీసుకోవాల్సి ఉంటుంది.

## నేడే జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 పరీక్ష

**మొదటి పేజీ తరువాయి**

రాయనున్నారు. ఐఐటీ మద్రాస్ నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి అభ్యర్థులకు ఇప్పటికే అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. ఈ పరీక్ష ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్ల కింద పేపర్-1, పేపర్-2 పరీక్షలు జరగనున్నాయి. ఆన్‌లైన్లో నిర్వహించే ఈ ఎగ్జామ్‌లో అభ్యర్థులు రెండు పేపర్లను తప్పనిసరిగా రాయాల్సి ఉంటుంది. మొదటి సెషన్ మార్నింగ్ 9 గంటల నుంచి 12 గంటల వరకు ఉంటుంది. రెండో సెషన్ పరీక్ష మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 వరకు జరగనుంది. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ఒక్క నిమిషం ఆలస్యం వచ్చినా లోపలికి అనుమతించరు. పరీక్షకు రెండు గంటల ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.

## తెలంగాణ ఆర్టీలో గందరగోళం సృష్టిస్తున్న "మహాలక్ష్మి" పథకం

**మొదటి పేజీ తరువాయి**

ఎక్కించుకోకపోవడంతో ఓ మహిళ నానా హంగామా చేసింది. అయితే, ఇలాంటి ఘటనే నకిరేకల్ బస్టాండులో చోటుచేసుకుంది. మా ఫ్రీ బస్సు మా ఇష్టం వచ్చినంత సేపు ఆగాల్సిందే లేదంటే మా వాళ్లతో కొట్టించి సస్పెండ్ చేయిస్తాం అంటూ ఆర్టీసీ బస్ డ్రైవర్ మహిళలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నార్కెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుండి సూర్యాపేటకు వస్తుండగా నకిరేకల్ బస్టాండులో ముగ్గురు మహిళలు బస్సుని కదలనివ్వలేదు. తమకు సంబంధించిన వ్యక్తి ఒకరు వస్తున్నారంటూ బస్సు ఆపాలని కోరారు. అప్పటికే ఐదు నిమిషాలు వేచిఉండడంతో తోటి ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో డ్రైవర్ బస్సును కాస్త ముందుకు తీసుకెళ్లడంతో ఆ మహిళలు కోపంతో ఊగిపోయారు. డ్రైవర్‌ని తిడుతూ సూర్యాపేట బస్టాండుకు వెళ్లిన తర్వాత మా వాళ్లతో కొట్టిస్తామని హెచ్చరించారు. దీంతో డ్రైవర్ పోలీస్ స్టేషన్ వద్ద బస్సు ఆపి తమ విధులకు ఆటంకం కల్పించారని ఆ మహిళలపై ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. కానీ, ఆ మహిళలు బస్సులోని కిందకు దిగకపోవడంతో చేసేదేమీ లేక డ్రైవర్ బస్సు తీసుకొని వెళ్లిపోయారు.

## బిగ్ బాస్కెట్ గోడౌన్స్ పై జీహెచ్ ఎంసీ అధికారులు దాడులు

**మొదటి పేజీ తరువాయి**

నిబంధనలు ఉల్లంఘించినందుకు జీహెచ్ఎంసీ నోటీసు జారీ చేసింది, తదుపరి నోటీసు వచ్చేవరకు బిగ్ బాస్కెట్ వేర్‌హౌస్ లైసెన్స్‌ను సస్పెండ్ చేసింది. తనిఖీలో చికెన్ మసాలా, చికెన్ సాసేజ్ లు, పిజ్జా చీజ్, పనీర్, ఐస్ క్రీం, బాదం ఫడ్జ్ తో సహా గడువు ముగిసిన పలు రకాల ఆహార పదార్థాలను గుర్తించారు. నూనె లీకేజీతో దిగువ రాక్‌లలోని ఇతర ఆహార వస్తువులను కలుషితం చేస్తున్నట్లు గుర్తించారు. పాల సీసాలు, మందపాటి షేక్ సీసాలు, స్టింగ్ టిన్ సీసాలు ఔట్ డేటెడ్ గా ఉన్నట్టు గుర్తించారు. కాగా గత కొన్ని రోజులుగా నగరంలోని పలు హోటళ్లపై జీహెచ్ ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఫుడ్ సేఫ్టీ రూల్స్ పాటించని హోటళ్లను చర్యలు తీసుకున్నారు. ఇప్పటివరకు ఆహారం విషయంలో సరైన ప్రమాణాలు పాటించని 55 హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. ప్రజారోగ్యం లక్ష్యంగా హైదరాబాద్ నగరంలో మరిన్నిదాడులు నిర్వహిస్తామని జీహెచ్ ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు తెలిపారు.

## ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా 48గం. మద్యం దుకాణాల బంద్

**మొదటి పేజీ తరువాయి**

జరగనున్నాయి. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి రాకేశ్ రెడ్డి, బీజేపీ నుంచి ప్రేమేందర్ రెడ్డి బరిలో ఉన్నారు. మరోవైపు జూన్ 4వ తేదీన కూడా తెలంగాణలో మద్యం దుకాణాలు బంద్ కానున్నాయి. ఇదే రోజు ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి. మే 27వ తేదీ సోమవారం రోజున జరిగే పోలింగ్ కోసం అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 8గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానుంది. సాయంత్రం 4గంటల వరకు కొనసాగనుంది. పోలింగ్ రోజు ఉదయం6 నుండి సాయంత్రం 8 వరకు144 సెక్షన్ అమలు ఉంటుంది. ఇక మూడు జిల్లాల్లో మొత్తం 605 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు ఎన్నికల అధికారులు. మూడు ఉమ్మడి జిల్లాల పరిధిలోని 34 అసెంబ్లీ నియోజకవర్గాలల్లో మొత్తం 4 లక్షల 61 వేల 806 గ్రాడ్యుయేట్లు ఓటు వేయనున్నారు. అత్యధికంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్షా 73వేల 406 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు. ఇక, ఉమ్మడి ఖమ్మం జిల్లాలో లక్షా 23వేల 985 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా.. ఉమ్మడి నల్గొండ జిల్లాలో లక్షా 66వేల 448 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉన్నారు.

## మేడిగడ్డపై ఎల్అండ్ టీ సంస్థ నిషేధాజ్ఞలు

**మొదటి పేజీ తరువాయి**

క్లోజ్ చేసింది. అనుమతి ఉన్న వ్యక్తులకు తప్ప మిగతా వారెవరికీ ప్రవేశం లేదంటూ బోర్డు ఏర్పాటు చేసింది. 20, 21వ పియర్ల మధ్య బయటపడిన పిల్లర్లకు అతిదగ్గరగా బొయ్యారం ఏర్పడింది. గోదావరిలో ఇప్పుడు వస్తున్న రెండు వేల క్యూసెక్కుల వరద తాకిడికే ఇసుక కొట్టుకుపోవడం గమనార్హం. భారీగా వరద వస్తే ఏమిటి.. ఇంతకూ ప్రాజెక్టు ఉంటుందా.. పేక మేడలా పడిపోతుందా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దానిని కప్పి పుచ్చుకొనేందుకు ఇంజినీర్లు బొయ్యారంలో నల్లమట్టిని నింపారు. అయితే ఇవాళ ఉదయం గేట్లు మూసేయడంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇంకా ఏమైనా భారీ లోపాలు బయటపడ్డాయా.. మీడియా కంట పడకుండా రిపేర్లు చేసేందుకే నిషేధాజ్ఞలు విధించారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గేట్లు మూసేయడంతోపాటు అక్కడ ప్రైవేటు సెక్యూరిటీని ఏర్పాటు చేశారు. మేడిగడ్డ(లక్ష్మీ) బ్యారేజీ మరమ్మతులకు ఎల్అండ్ టీ సంస్థ ఉపక్రమించింది. గతంలో పగుళ్లు ఏర్పడ్డ ప్రదేశంలో మరమ్మతులు చేస్తున్న క్రమంలో కొత్త లోపాలు బయటపడుతుండటంతో ఆ సంస్థ ఇంజినీర్లు తలలు పట్టుకుంటున్నారు. చిన్నపాటి వరద వస్తేనే బొయ్యారాలు బయపడుతుండటం, అవి మీడియాలో రావడంతో టెన్షన్ పడ్డ అధికారులు బొరియల ప్రదేశాన్ని రిస్ట్రిక్టెడ్ ఏరియాగా పేర్కొంటూ కొద్ది దూరం వెడల్పు నుంచి ఎర్ర రిబ్బన్స్ కట్టారు. ఇవాళ ఉదయం ఏకంగా గేట్లు మూసేయడం, అనుమతి లేని వ్యక్తులకు ఎంట్రీ లేదంటూ బోర్డు వేయడం గమనార్హం. దీంతో ఇంకా ఏమైనా భారీ లోపాలు బయటపడ్డాయా.. అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఇదిలా ఉండగా ఈ ప్రాజెక్టు ఇంతకూ పనికొస్తుందా.. వరద వస్తే పేకమేడలా కూలిపోతుందా.. అన్న చర్చకూడా మొదలైంది.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# సామాన్యుడికి ఎన్నికల కష్టాలు

దేశంలో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనలనే మనం ఎన్నికల నియమావళి అంటున్నాం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన మొదలు కౌంటింగ్ ముందు వరకు ఈ నియమావళి అమల్లో ఉంటుంది. కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో జరిగే పనులను ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వాలకు కేవలం నామమాత్రపు అధికారాలే ఉంటాయి. ఎన్నికల నిర్వహణ సాఫీగా, పారదర్శకంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు జరగాల్సిందే గానీ, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సుదీర్ఘకాలం పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల అటు ప్రభుత్వాలకు, ఇటు సామాన్యులకు ఇబ్బంది ఎదురవుతోంది. ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు పంపిణీ, ఆస్తుల విధ్వంసం, ఫేక్ న్యూస్ ప్రచారం చేయటం, ఓటర్లను భయపెట్టటం, రెచ్చగొట్టే ప్రసంగాలు, అనుచిత వ్యాఖ్యలు , నేతల అన్ పార్లమెంటరీ భాష, కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడగడం, ఆయుధాల ప్రదర్శన, భయపెట్టడం, నిరాధార ఆరోపణలు చేయడం, అధికార పార్టీలో ఉన్నవారు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయటం కుదరదు. అయితే, ఈ నిషేధాలు వాస్తవంగా అమలవుతున్నాయా? అంటే లేదనే జవాబే వస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధాని మతం పేరుతో ఓటర్ల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేసినా, ఎన్నికల సంఘం మందలిస్తూ, నోటీసులకే పరిమితం అయింది. ప్రస్తుతం మన దేశంలో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగో దశలో మే 13వ తేదీన తెలంగాణలో ఎన్నికలు పూర్తయ్యాయి. అంటే.. ఎన్నికలు జరిగి పదిరోజులు పూర్తి కాగా, మరో 10 రోజుల పాటు ఎన్నికల కోడ్ ఇక్కడ అమలులో ఉండనుంది. ఇదే సమయంలో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. తెలంగాణలో కురిసిన అకాల వర్షాలతో రైతన్నలకు అపారం నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నీటి పాలైంది. మరోవైపు నగరాల్లో వర్షాకాలంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగం క్షేత్ర స్థాయిలో అనేక పెండింగ్ పనులు చేయాల్సి ఉంది. ఇక.. మరో రెండు వారాల్లో వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలలన్నీ తెరుచుకోనున్నాయి. కోడ్ కారణంగా టీచర్లు, విద్యార్థులకు సంబంధించిన ఏ రకమైన నిర్ణయాలూ తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒకవేళ, ఇక్కడి ముఖ్యమంత్రి పై అంశాల మీద ఏదైనా నిర్ణయాలు తీసుకుంటే, దానివల్ల ఆంధ్రప్రదేశ్, తదితర పొరుగు రాష్ట్రాల ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తాయని ప్రశ్న తలెత్తినా.. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ఐదో విడతలోనే ఎన్నికలు పూర్తయిపోయాయి కనుక ఆ ప్రశ్న కూడా ఉత్పన్నం అయ్యే అవకాశమే లేదుమరోవైపు, నియమావళిలో భాగంగా ఎన్నికల వేళ ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోని సిబ్బంది తనిఖీల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు ఫీజు రూపంలో చెల్లించేందుకు రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోతున్న వారికి ఈ తనిఖీలు తలనొప్పిగా మారుతున్నాయి. బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసినట్లుగా రసీదు వంటివి లేదని నగదును, ఏదైనా శుభకార్యాలకి బయలుదేరిన వారి వద్ద నగలను సీజ్ చేయటం జరగుతోంది. ఈ నగదును, బంగారాన్ని సీజ్ చేసి కోర్టుకు స్వాధీన పరచటంతో తిరిగి, వాటిని ఆధారాలు చూపి తీసుకోవాలసి రావటం సామాన్యులకు ఇబ్బందిగా మారింది. అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే, కొత్త ప్రభుత్వం ఇల్లు సర్దుకోకముందే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావటం, ఈ రెండు నెలల పాటు ఎన్నికల కోసం సమయం కేటాయించాల్సి రావటంతో నూతన ప్రభుత్వం తలపెట్టిన అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎన్నికల కోడ్ కారణంగా నేటికీ ప్రభుత్వం అమలుచేయలేని పరిస్థితి. ఒకవైపు ఖరీఫ్ సీజన్ రావటంతో వీలున్నంత త్వరగా రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా.. ముందడుగు వేయలేని దుస్థితి. మరోవైపు, రైతులకు కొత్తగా రుణాలు అందించేందుకు బ్యాంకర్లతో ప్రభుత్వం చర్చించాల్సి ఉంది. ఇన్నిపనులు పెండింగ్‌లో ఉన్నా, ప్రభుత్వం నేరుగా ఏ నిర్ణయమూ చేయలేని పరిస్థితి. చివరికి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా మంత్రిమండలి సమావేశం నిర్వహించుకోవటానికీ ఈ నియమావళి అడ్డంకిగా మారింది. దీంతో ప్రభుత్వం సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల విధినిర్వహణకు అడ్డంకిగా మారిన నియమావళి మీద పున:సమీక్ష చేయాలని, అదే సమయంలో కోడ్ కారణంగా ఆయా విభాగాల పనులు పెండింగ్‌లో పెట్టి ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా, సదరు విభాగాధిపతులు తమకున్న పరిమితుల మేరకు పాలనా సంబంధిత అంశాల అమలును తమ బాధ్యతను స్వీకరించాలని మేధావులు కోరుతున్నారు.

# పాలకురి అశోక్ గౌడ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించండి

**- బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షులు కొండమీద నరసింహా రావు**



గరిడేపల్లి, మే 25(తీన్మార్ న్యూస్): పాలకురి అశోక్ గౌడ్ ని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గ అధ్యక్షులు కొండమీది నరసింహారావు కోరారు. బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మంద ప్రభాకర్ ఆదేశానుసారం నిర్వహించిన సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నటువంటి వరంగల్ నల్లగొండ ఖమ్మం ఎమ్మెల్సీ అభ్యర్థి పాలకూరి అశోక్ కుమార్ గౌడ్ కి మద్దతుగా పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నటువంటి ఊసరవల్లి తీన్మార్ మల్లయ్య బహుజన వాదినంటూ బహుజనల పక్షాన చేరి బహుజనులను మోసం చేసి ఎన్నికల ఆపదవిటిలో 57 కేసులు చూపిస్తున్నటువంటి తీన్మార్ మల్లయ్యకు నిరుద్యోగుల పక్షాన కొట్లాడే అర్హత ఉన్నదా అని గత ప్రభుత్వంలో టిఆర్ఎస్ పార్టీని అడ్డుపెట్టుకొని రెండుసార్లు గెలిచిన పల్లా రాజేశ్వర్ రెడ్డి నిరుద్యోగుల్ని మోసం చేసి నిరుద్యోగ భృతి 3000 రూపాయలు ఇస్తానని చెప్పిన బిఆర్ఎస్ (టీ ఆర్ ఎస్)ప్రభుత్వం ఇప్పుడు ఏ మొహం పెట్టుకొని మళ్ళీ ఏనుగుల రాకేష్ రెడ్డిని నిలబెట్టి ఓట్లు అడుగుతుందని ధ్వజమెత్తారు. పట్టభద్రుల అమూల్యమైనటువంటి ఓటును స్వతంత్ర అభ్యర్థిగా బహుజన్ సమాజ్ పార్టీ కి మద్దతిస్తున్న పాలకూరి అశోక్ కుమార్ గౌడ్ సీరియల్ నెంబర్ 18 మీద అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి నిరుద్యోగులపక్షన ప్రశ్నించే గొంతుకను శాసనమండలికి పంపాలని ప్రభుత్వ ఉద్యోగులను నిరుద్యోగులను రిటైర్మెంట్ ఉద్యోగులను బహుజన్ సమాజ్ పార్టీ హుజూర్నగర్ నియోజకవర్గం కమిటీ తరపున విన్నవించడం జరుగుతుంద అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ ఉపాధ్యక్షులు అమరవరపు వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కోశాధికారి గా మట్టపల్లి హుజూర్నగర్ మండల అధ్యక్షులు సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# వెలిదండలో నక్సల్బరీ 57వ వార్షికోత్సవాలు




గరిడేపల్లి, మే 25(తీన్మార్ న్యూస్): వెలిదండలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో నక్సల్ బరి 57వ వార్షికోత్సవాల సందర్భంగా కార్యక్రమాలను నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి పోటు లక్ష్మయ్య పాల్గొని మాట్లాడుతూ 57 సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన నక్సల్ బరి పోరాటానికి మరణం లేదని అన్నారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోనే డార్జిలింగ్ ప్రాంతంలో నక్సల్బర్ అనే ఒక ఊరి పేరు ఒక ఉద్యమం పేరుగా రూపుదిద్దుకోవడం అరుదైన విషయం అని అన్నారు. కమ్యూనిస్టు పార్టీలో నయా రివిజనిస్టు విధానంతో విసికి రగులుతున్న విప్లవకారులకు నక్సల్ బరి ఉద్యమం ఊపందుకుంది. అక్కడనుండి గోదావరి లోయ, శ్రీకాకుళం గిరిజన ప్రజలకు అండగా నిలబడి లక్షలాది ఎకరాల భూములను ప్రజలకు పంచింది అని అన్నారు. భూమి, భుక్తి, విముక్తి కోసం తిరిగి ప్రారంభమై దోపిడీ భూస్వామ్య పాలకవర్గాల గుండెల్లో గుబులు రేకెత్తించిందని అన్నారు. సుదీర్ఘకాలంగా రాజ్యనిర్బంధాలను తట్టుకొని అనేక త్యాగాలతో నేటికీ ముందుకు పోతుందని అన్నారు. ఆనాటి నక్సల్ బరి పోరాటాలలో అమరులైన వారికి నివాళులు అర్పించారు. పోరాటం ద్వారానే ఈ వ్యవస్థ మారుతుంది అని తెలియజేసిన నక్సల్బరి పోరాటానికి జేజేలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రామ కార్యదర్శి మేకల కనకారావు, ఐ ఎఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కామల్ల నవీన్, ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు కామల్ల శ్రీను, అరుణోదయ జిల్లా నాయకులు గందు నాగేశ్వరరావు, చనగాని పెద్ద సాంబయ్య, మాజీ సర్పంచ్ మాశెట్టి అంజయ్య, పోటు మంగమ్మ, వల్లపుదాసు లచ్చయ్య, వల్లపుదాసు కుమరయ్య, చనగాని పర్వతాలు, జనగాని లక్ష్మయ్య, జిలకర ముత్తయ్య, కామల్ల చింటు, తుళ్లూరి ప్రవీణ్, వల్లపుదాసు వెంకటి, కుమరయ్య, పోటు శ్రీహరి, రామస్వామి, కార్తీక్, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక డంపింగ్ యార్డ్ సీజ్

**- అనుమతులు లేకుండా తరలిస్తే కఠిన చర్యలు**

**- రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాహత్ ఇషాన్**



దేవరకద్ర ప్రతినిధి, మే 25(తీన్మార్ న్యూస్): మహబూబ్ నగర్ జిల్లా అడ్డాకుల మండల పరిధిలోని కందూరు శివారులో అక్రమంగా ఇసుక తరలించి డంపింగ్ చేసిన స్థలాన్ని మండల తహసీల్దార్ దృష్టికి రావడంతో ఇసుకను గుర్తించి సీజ్ చేసిన మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ సాహత్ ఇషాన్ తెలిపిన వివరాల ప్రకారం కందూరు శివారు ప్రాంతంలో ఉన్న క్రషర్ వెనకాల అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా గుర్తు తెలియని వ్యక్తులు పక్కనే ఉన్న వాగు నుండి 12 ట్రాక్టర్ లు దాదాపు 36 క్యూసెక్కులతో ఇసుక డంపింగ్ ఉండడంతో గ్రామస్తులు తెలిపిన సమాచారం మేరకు శనివారం గుర్తించామన్నారు. ఇసుక తరలించేందుకు ఎలాంటి అనుమతులు ఎవరికీ ఇవ్వలేదని తెలిపారు. రాత్రి సమయంలో ఇసుకను తరలించి ఇక్కడ డంపింగ్ చేసి ఉంటారని తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇసుకను సీజ్ చేసి కందూరు గ్రామపంచాయతీ చూసుకునే విధంగా అధికారులకు అప్పగిస్తున్నామన్నారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ అనుమతితో ప్రభుత్వ వేలం ద్వారా వాహనాలను ఏర్పాటు చేసి ఇసుక తరలించేందుకు అనుమతి ఇచ్చే వరకు ఈ ఇసుక డంపింగ్ యార్డ్ ను ఎవరు తరలించిన ముట్టుకున్న కఠిన చర్యలు తప్పవని పంచనామతో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్ రత్నం, రికార్డు అసిస్టెంట్ రాజశేఖర్, కందూర్ కారోబార్ మల్లేష్, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఎన్నికల్లో కెసిఆర్ బలపర్చిన అభ్యర్థి

**- రాకేష్ రెడ్డికి 1వ ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి**

**- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేష్ రెడ్డి**




భువనగిరి, మే 25(తీన్మార్ న్యూస్): నల్లగొండ,ఖమ్మం వరంగల్ పట్టభద్రుల ఎన్నికల్లో బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి ని భారీ మెజారిటీ తో గెలిపించాలని, బిఆర్ఎస్ పార్టీ నాయకులు చింతల వెంకటేష్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చింతల మాట్లాడుతూ ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డి కావాలా ప్రభుత్వానికి డబ్బా కొట్టె వ్యక్తి కావాలా, విద్యావంతుడు ప్రభుత్వాన్ని, ప్రశ్నించే, గొంతుక కావాలా, ఒక్కసారి ఆలోచన చేయాల్సిన అవసరం పట్ట భద్రులకు ఎంతైనా ఉందని అన్నారు. కాంగ్రెస్ గవర్నమెంట్ ఫెల్యూర్ గవర్నమెంట్ అని, ఎద్దేవా చేసారు. ప్రభుత్వం ఏర్పడి 6నెలలు కావడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం లో కరెంట్ కోతలు రైతుల కన్నీళ్లు చూడడం తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసిందేమి లేదని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలు వడగానే రాష్ట్రం లో కీలక పరిణామాలు చోటు చేసు కుంటాయని అతి కొద్ది కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని రాష్ట్ర ప్రజలందరూ కెసిఆర్ నే కోరుకుంటున్నారని అన్నారు. అదే విధంగా ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేష్ రెడ్డి ప్రభుత్వం తో మాట్లాడి, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడం ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడం తో పాటు ప్రభుత్వం వద్ద పెండింగ్ లో ఉన్న, ప్రయివేట్, ఇంటర్, డిగ్రీ కళాశాల, స్కాలర్షిప్ ఫీజు రియాంబర్స్మెంట్ విడుదల చేయడం కానీ, నిరుద్యోగుల సమస్యలు పరిష్కారం చేయడం లో, రాకేష్ రెడ్డి ప్రధాన పాత్ర పోషిస్తాడని అన్నారు. ఇవన్నీ సాధ్యం కావాలంటే పట్టభద్రులు అలోచించి సీరియల్ నంబర్ 3,పై,1వ (మొదటి )ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగె ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జ్ ఇబ్రహీం మాట్లాడుతూ స్నేహశీలి, విద్య వంతుడు, ప్రశ్నించే గొంతుక, బిట్స్ పిలాని లో గోల్డ్ మెడల్ సాధించిన వ్యక్తి రాకేష్ రెడ్డి అని కొనియాడారు అదే విధంగా, ఆపదలో విద్యార్థులనుసామాన్య ప్రజలను, సైతం ఆదుకున్న ఆపద్బాంధవుడు అని అటువంటి మేధావి ని పట్ట భద్రులందరు గుర్తించి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ కార్య క్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, పట్టణ అధ్యక్ష కార్యదర్శిలు రచ్చ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ అమరేందర్, కొలుపుల అమరేందర్, రచ్చ శ్రీనివాస్ రెడ్డి, మైనారిటీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత రక్తదాన శిబిరం



గరిడేపల్లి, మే 25(తీన్మార్ న్యూస్): సూర్యాపేట జిల్లా, గరిడేపల్లి మండలం, సర్వారం గ్రామంలో శనివారం ఉచిత మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేశారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ ఖమ్మం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మెగా ఉచిత రక్తదాన శిబిరం లో గ్రామంలోని యువత ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. తలసేమియా వ్యాధిగ్రస్తుల కొరకు మేము సైతం రక్తదానం చేస్తామంటూ గ్రామంలోని 53మంది యువత ప్రజలు ముందుకు వచ్చి రక్తం అందజేశారు. ఈ రక్తదాన శిబిర కార్యక్రమంలో సర్వారం యూత్, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ గురుకుల జూనియర్ ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం





దేవరకద్ర ప్రతినిధి, మే 25(తీన్మార్ న్యూస్): ఎస్సీ గురుకుల సొసైటీ పరిధి లోని విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్ లో మిగిలిపోయిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వనపర్తి జిల్లా, కొత్తకోట మండల పరిధిలోని స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల కొత్తకోట ప్రిన్సిపాల్ పి.మాలతి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై న విద్యార్థులు ఈ నెల 24 నుండి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్ సైట్ ద్వారా ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని, దరఖాస్తు రుసుము కింద ఆన్లైన్ లో రూ.100/- చెల్లించాలని తెలియజేశారు.

# చీర్యాల అభయ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న కాంగ్రెస్ నాయకులు



కీసర, మే 25(తీన్మార్ న్యూస్): నియోజకవర్గం కీసర మండలం చీర్యాల్ గ్రామంలోని అతి పురాతణమైన అభయ ఆంజనేయ స్వామి వారిని ప్రముఖ సినీ నటుడు ఎల్వీసీ నర్సింహా రావు ఆహ్వానం మేరకు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి దర్శించుకున్నారు. మల్కాజ్ గిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డితో పాటు కలిసి ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ పునః నిర్మాణానికి కృషి చేస్తున్న సినీ నటుడు నర్సింహా రావును నాయకులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ పూజా కార్యక్రమంలో మండల ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీ నారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన భద్రకాళీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు



టేక్మాల్, మే 25(తీన్మార్ న్యూస్): ఈనెల 24వ తేది నుండి మే 31వ తేది వరకు మండల పరిధిలోని బొడ్మట్పల్లి గ్రామ శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు జరుపనున్నట్లు ఆయల కమిటీ చైర్మెన్ ఉప్పు బస్వరాజ్ పాటిల్ తెలిపారు. 24 తేది అగ్నిగుండాలు, 25 న శ్రీభద్రకాళీ సమేత వీరభద్ర స్వాముల కళ్యాణోత్సవం, 26వ తేదిన గ్రామ దేవతలకు బోనాలు, 27 వతేదిన బండ్లు, 28 తేదిన కుస్తీలు, 29 రథోత్సవం,30 తేదిన లంకదహనం, 31 వతేదిన పాచిబండ్లు తిరుగుట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై జాతర మహోత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

# టీ పాయింట్స్ పేరుతో స్మోకింగ్ అడ్డాలు.

**– మైనర్ల తో సహా గాడి తప్పుతున్న యువత**
**– ప్రతి టీ పాయింట్ దగ్గర నో – స్మోకింగ్ బోర్డు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి**



వనపర్తి ప్రతినిధి, మే 25(తీన్మార్ న్యూస్): వనపర్తి నియోజకవర్గ కాంటెస్టడ్ స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్ మాట్లాడుతూ వనపర్తి పట్టణం లో మరియు కాలనీలలో టీ పాయింట్స్ పేరుతో స్మోకింగ్ అడ్డా కేంద్రాలుగా మారాయి. పేరుకు టీ పాయింట్స్ ప్రక్కన షెడ్స్ వేసుకొని యువత కు మరియు మైనర్లు అని చూడకుండా ఇష్టారీతిలో ఎలాంటి నియమాలు పాటించకుండా బహిరంగ ప్రదేశాలలో దూమపానం నేరం మత్తు లో ఇష్టారాజ్యం గా వ్యవహరిస్తున్నారు. ప్రతి ఒక్క టీ పాయింట్స్ దగ్గర నో స్మోకింగ్ బోర్డు ఖచ్చితంగా ఉండే విధం గా అధికారులు చూడాలి. ఎవరి పిల్లలపై తల్లి దండ్రులు ఎప్పటికప్పుడు జాగ్రత్త వహించాలని కోరారు.

# సిలిండర్ పై అవగాహన సదస్సు




ఆత్మకూర్, మే 25(తీన్మార్ న్యూస్):బీఆత్మకూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఒకటవ వార్డు ఖానాపూర్ గ్రామంలో ఆత్మకూరు హెచ్పి గ్యాస్ ఏజెన్సీ వారి ఆధ్వర్యంలో సిలిండర్ వాడకంపై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెచ్.పీ గ్యాస్ మేనేజర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సిలిండర్ ఎలా వాడాలి, వంట అయిపోయిన తర్వాత దాని ఎలా ఆఫ్ చేయాలి, వంటగ్యాస్ ఎలా సేవ్ చేయాలి, అనే దానిపై అవగాహన కల్పించారు. సిలిండర్ పట్ల తీసుకోవలసిన పలు జాగ్రత్తలను అంశాలను తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో హెచ్.పీ గ్యాస్ స్టాఫ్ అర్షద్ వారి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం

హైదరాబాద్, మే 25: హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం సంభవించింది. రంగారెడ్డి జిల్లాలోని ఆమనగల్లు మండలం రామ్నుంతల శివారులోని హైవేపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొన్నా యి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడి కక్కడే ప్రాణాలు కోల్పోయారు. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జువగా మృతదేహా లను జేసీబీ సాయంతో వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతులు హైదరాబాద్ వాసులుగా గుర్తించారు. కల్వకుర్తి నుంచి హైదరాబాద్ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అతివేగం, నిద్రమత్తే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్థారణకు వచ్చారు.

# శానిటేషన్ అసిస్టెంట్ పై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, మే 25: హైదరాబాద్ జీహెచ్ఎంసీలో దారుణం వెలుగుచూసింది. కుత్బుల్లాపూర్ పరిధిలోని గాజులరామారం 25 సర్కిల్ పరిధిలో గాజులరామారం జీహెచ్ఎంసీ సర్కిల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్.. పారిశుద్ధ్య కార్మికురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. తన కింద పని చేసే మహిళా కార్మికురాలిని ఫీల్డ్ ఆఫీసర్ లైంగికంగా వేధించిన వీడియోలు బయటకు వచ్చాయి. ఉద్యోగిని బెదిరించి లైంగికంగా వేధిస్తూ.. తన మొబైల్‌లో వీడియోలు, ఫోటోలు తీశాడు. తాను చెప్పినట్లు వినకుంటే ఉద్యోగం నుంచి తొలగిస్తానని కిషన్ బెదిరించినట్లు బాధితురాలు తెలిపారు. రోజూ పనికి వచ్చిన ఆమెను లైంగికంగా వేధించిన అతను ఈ తతంగమంతా ఫోన్‌లో రికార్డు చేశాడు. ఈ వీడియోలు బయటకు రావడంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. ఇవి ఉన్నతాధికారులు సహా తోటి కార్మికుల చేతుల్లోకి సైతం వెళ్లాయి. వీటిని చూసిన తోటి కార్మికులు ఎస్ఎఫ్ఏ కిషన్ ను నిలదీయగా.. వారికి కిషన్ డబ్బు ఆశ చూపించినట్లు తెలుస్తోంది. దాదాపు 14 మంది తలా రూ.10 వేలు ముట్టచెప్పినట్లు సమాచారం. మరోవైపు, దీనిపై స్పందించిన జీహెచ్ఎంసీ అధికారులు కిషన్ పై చర్యలు చేపట్టారు. అతన్ని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అటు, మేయర్ గద్వాల విజయలక్ష్మి సైతం ఈ ఘటనపై స్పందించారు. మహిళా కార్మికురాలిని వేధించడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని.. దీనిపై పూర్తి స్థాయి నివేదిక అందించాలని జోనల్ కమిషనర్ అభిలాష అభినవ్ కు ఆమె ఆదేశాలు జారీ చేశారు. ఆ రిపోర్ట్ ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నారు.

# ఉపాధి హామీపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

**– తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం డిమాండ్**



ఆత్మకూర్, మే 25(తీన్మార్ న్యూస్): ఆత్మకూరు మండల కేంద్రంలోని స్థానిక మార్కెట్ యార్డ్ ఆవరణంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో ఉపాధి హామీ కూలీల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మేకల ఆంజనేయులు, రాజు లు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన పది సంవత్సరాలలో ఉపాధి హామీ చట్టంపై పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రతి సంవత్సరం ఈ పథకానికి తక్కువ నిధులు కేటాయిస్తూ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని అన్నారు. కూలీలకు కనీస సౌకర్యాలు అయినటువంటి టెంట్లు మెడికల్ కిట్లు పలుగు పార ఇవ్వలేని స్థితికి వెళ్లిందని మెట్లు వాచర్ల సమస్యలు పరిష్కరించాలని సంవత్సరానికి 200 రోజుల పని దినాలు కనిపించాలని రోజుకూలి 600 రూపాయలు ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఈ చట్టాన్ని వ్యవసాయ కూలీలు పేదలంతా రక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు అజయ్, కమిటీ అధ్యక్షులు దేవన్న, తదితరులు పాల్గొన్నారు.

# బలమైన ఈదురు గాలులు, విరిగిన కరంట్ స్తంభం

**– సకాలంలో స్పందించిన గ్రామ పంచాయతీ సిబ్బంది**





వనపర్తి ప్రతినిధి, మే 25(తీన్మార్ న్యూస్): పెద్దమందడి మండలం, వెలటూరు గ్రామంలో శుక్రవారం రోజు సాయంత్రం వీచిన బలమైన ఈదురు గాలుల వల్ల వెలటూరు ఎస్సీ కాలనీలో ఒక వేప చెట్టు కూలి విద్యుత్ వైర్లపై పడిపోయింది. వైర్లపై బలమైన చెట్టుకూలడంతో బరువు తాకిడికి, ఒక విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. ఎవరికి ఎలాంటి హాని జరగలేదు. ఇట్టి విషయాన్ని గ్రామ మాజీ సర్పంచ్ ఆర్.శ్రీనివాస్ రెడ్డి కి, ఫోన్ ద్వారా తెలుపగా, సకాలంలో స్పందించి గ్రామపంచాయతి సిబ్బందిని, విద్యుత్ అధికారులను అప్రమత్తం చేశారు. శుక్రవారం రోజు చీకటి పడటంతో శనివారం ఉదయం గ్రామపంచాయతి సిబ్బంది, విద్యుత్ అధికారులు, విరిగిన కరెంటు స్తంభం స్థానంలో ఇంకో స్తంభాన్ని అమర్చి వేగవంతంగా పునరుద్ధరణ చెయ్యడం తో విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా ఎస్సి కాలనీలో కరంట్ సరఫరా జరిగింది. సకాలంలో స్పందించిన ఆర్.శ్రీనివాసరెడ్డి కి న్యూ ఎస్సీ కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది రుక్మద్దీన్, కుమ్మరి రాజు, దయ్యాల అంజన్న, సంజపాగా అశోక్ కుమార్, బండి ప్రవీణ్ (ఆటో), ఎల్.రాజేష్, విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 27 నుంచి ఇంజనీరింగ్ కౌన్సెలింగ్

హైదరాబాద్, మే 25: తెలంగాణలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీఎస్ ఎప్‌సెట్ ఫలితాలను ఇటీవల విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు కౌన్సెలింగ్ షెడ్యూల్ ఎప్పుడా అని చూస్తున్న తరుణంలో తెలంగాణ ఇంజినీరింగ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేశారు. జూన్ 27వ తేదీ నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు అధికారులు తెలిపారు.జూన్ 27వ తేదీ నుంచి ఇంజనీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొదలవుతుండగా, జూన్ 30 నుంచి విద్యార్థులు మొదటి విడత వెబ్ ఆప్షన్లు ఇవ్వాల్సి ఉంటుంది. అనంతరం జులై 12వ తేదీన మొదటి విడత ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపు ఉండనుంది. ఇక ఈసారి ఇంజినీరింగ్ ప్రవేశాల ప్రక్రియ మొత్తం మూడు విడతల్లో జరగనుంది. జులై 19 నుంచి ఇంజినీరింగ్ రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇక రెండో విడత సీట్ల కేటాయింపు జులై 24వ తేదీన జరగనుంది. అలాగే తుది విడత కౌన్సెలింగ్‌ను జులై 30 వతేదీన నిర్వహించి, ఆగస్టు 5వ తేదీన చివరి విడత సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు.ఇదిలా ఉంటే ఇంటర్నల్ స్లైడింగ్ ఆన్‌లైన్‌లో కన్వీనర్ ద్వారా చేపట్టాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఆగస్టు 12 నుంచి ఇంటర్నల్ స్లైడింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. అలాగే ఆగస్టు 16న ఇంటర్నల్ స్లైడింగ్ సీట్ల కేటాయింపు ఉండనుంది. ఇక ఆగస్టు 17న స్పాట్ అడ్మిషన్లకు మార్గదర్శకాలు విడుదల చేయనున్నట్లు అధికారులు ప్రకటించారు.

# స్టాక్ మార్కెట్ కు ఇబ్బందులే

ముంబై, మే 25, దేశంలో ప్రస్తుతం అందరిచూపు ఎన్నికల ఫలితాలపైనే కొనసాగుతోంది. అసలు ఎన్నికలు ఇంకా పూర్తి కాకమునుపే స్టాక్ మార్కెట్లలో విన్నర్ గురించి భారీగా చర్చలు కొనసాగుతున్నాయి. ప్రధాని నుంచి ప్రశాంత్ కిషోర్ వరకు ఎవరి నోట్లో విన్నా ప్రస్తుతం స్టాక్ మార్కెట్ల గురించే వినిపిస్తోంది. అందరూ బీజేపీ గెలిస్తే లేదా గెలవకపోతే పరిస్థితుల గురించి అంచనా వేస్తుండగా.. ప్రశాంత్ కిషోర్ లెక్క మరోలా ఉంది. ఆయన కామెంట్స్ ప్రస్తుతం ఈక్విటీ మార్కెట్లలో అల్లకల్లోలం సృష్టిస్తున్నాయి.ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ తన సొంత టార్గెట్ అయిన 370 సీట్లలో గెలుపును సాధించడంలో విఫలమైతే అది ఖచ్చితంగా స్టాక్ మార్కెట్లోని పెట్టుబడిదారుల సెంటిమెంట్లను దెబ్బతీస్తుందని ప్రఖ్యాత పోల్ స్టాటజిస్ట్ ప్రశాంత్ కిషోర్ వెల్లడించారు. దీనిని కార్పొరేట్ కంపెనీల పనితీరుతో పోల్చుతూ.. ఏదైనా కంపెనీ తాను పేర్కొన్న లక్ష్యాలను అందుకోవటంలో విఫలమైతే స్టాక్ మార్కెట్లలో సదరు కంపెనీ షేర్లపై ఆ ప్రభావం ప్రతికూలంటూ ఉండే అవకాశం ఉందన్నారు. ఇదే విధంగా బీజేపీ తన టార్గెట్ 370 సీట్ల కంటే తక్కువ గెలిస్తే అది చర్చనీయాంశంగా మారి మార్కెట్ల పతనానికి దారితీయవచ్చని అన్నారు. ఎలక్షన్ ఫలితాలను మార్కెట్లు ప్రతిబింబిస్తాయని ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.ఏదేమైనా గత కొన్ని నెలలుగా అధికార పార్టీ 370 లేదా అంతకంటే ఎక్కువ సీట్లు సాధిస్తుందా అనే చర్చలు సాగుతున్నాయని, ఎన్నికల్లో మోదీ గెలుస్తాడా లేదా ఓడిపోతాడా అనే దానిపై కాదన్నారు ప్రశాంత్ కిషోర్. అయితే మరోపక్క ఇటీవల జరిగిన అన్ని బహిరంగ సమావేశాల్లోనూ దిగ్గజ బీజేపీ నేతలు తాము ఈ సారి ఎన్నికల్లో 400+ సీట్లు సాధిస్తామని ధీమా వ్యక్తం చేస్తున్నారు. మోదీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమి ఎన్నికల్లో ఈసారి తూర్పు, దక్షిణాది రాష్ట్రాల్లో తమ ఓట్ల శాతాన్ని పెంచుకునే అవకాశం ఉన్నప్పటికీ బీజేపీ 370 సీట్లు మాత్రం గెలిచే అవకాశాలు లేవని ప్రశాంత్ కిషోర్ తేల్చి చెప్పేశారు. చాలా కాలంగా మార్కెట్లోని అనలిస్టులు, రీసెర్చ్ సంస్థల అంచనాలు సైతం బీజేపీకి 300 కంటే తక్కువ స్థానాల్లో గెలుపొంద నున్నట్లు అంచనా వేస్తున్నాయి.దీంతో ముందస్తుగా విదేశీ ఇన్వెస్టర్లు తమ డబ్బును మార్కెట్ల నుంచి ఉపసంహరించుకున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. విపక్షాలకు బీజేపీ గెలుపును ఆపడానికి మూడు విభిన్నమైన, వాస్తవిక అవకాశాలు ఉన్నాయని.. అయితే వాటిని సోమరితనంతో పాటు తప్పుడు వ్యూహాలతో వదులుకున్నారని ఏప్రిల్‌లో ప్రశాంత్ కిషోర్ పేర్కొన్నారు. బీజేపీకి స్పష్టమైన ఆధిపత్యం ఉన్నప్పటికీ పార్టీ లేదా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వేవ్ లేదని పునరుద్ఘాటించారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని పోల్ పొజిషన్ సాధించకుండా ఆపడానికి ప్రతిపక్షాలు కోల్పోయిన అవకాశాలను ఎత్తి చూపారు. ఇప్పటి వరకు 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 379 స్థానాలకు ఇప్పటివరకు పోలింగ్ పూర్తయింది.

# బ్యాంకు మేనేజర్‌పై చర్యలు తీసుకోవాలి

**– ఆదివాసీ సేన జిల్లా నాయకులు సోడి శ్రీను**

ములకలపల్లి: ఆసరా పింఛను ఇవ్వకుండా ఆదివాసీ మహిళలను ఇబ్బందులకు గురిచేస్తూ, మహిళల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్న ములకలపల్లి ఏపీజీవీబీ మేనేజర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సేన జిల్లా నాయకుడు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండల పరిధిలోని వి.కె.రామవారం గ్రామానికి చెందిన సోడి వీర వెంకటమ్మ, భర్త నాలుగు సంవత్సరాల క్రితం మృతి చెందడంతో ఆమెకు ప్రభుత్వం ఆసరా పింఛను మంజూరు చేసినదని, బ్యాంకులో అప్పు ఉందని బ్యాంకు మేనేజర్ మూడు సంవత్సరాలు పింఛను ఇవ్వకుండా అప్పులో జమ చేసుకొని మీ అప్పు తీరిపోయిందని రెండు నెలలు ఇచ్చి మరల ఐదు నెలల నుంచి పింఛను ఇవ్వకుండా ఖాతాను హోల్డ్ చేశారని, ఐదు నెలల నుంచి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. బ్యాంకుకు వెళ్లిన మహిళలను మీకు ఎన్నిసార్లు చెప్పిన అర్థం కాదా, సిగ్గులేకుండా వస్తున్నారు అని ఇష్టం వచ్చినట్లు దుర్భాషలాడారని, బ్యాంకు ఖాతాను హోల్డ్ చేసి ఆసరా పింఛను అందకుండా చేస్తున్న బ్యాంకు మేనేజరుపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, తహసీల్దార్ పుల్లారావుకు వినతి పత్రం అందజేశారు.

# బంగాళాఖాతంలో వాయుగండం

హైదరాబాద్. మే 25: పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ఇవాళ వాయుగుండంగా మారుతుందని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 26 తేదీ సాయంత్రానికి అది మరింత బలపడి తుపానుగా మారుతుందని స్పష్టం చేసింది. ఈశాన్యంగా కదులుతూ మధ్య బంగాళాఖాతంలో తుపానుగా మారనున్నప్పటికీ.. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతానికి ముప్పేమీ లేదని వాతావరణశాఖ స్పష్టం చేసింది. అయితే.. తెలుగు రాష్ట్రాల్లో మోస్తారు నుండి భారీ వర్షంతోపాటు.. గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉన్నట్లు తెలిపింది.వాయుగుండంగా మారనున్న బలమైన అల్పపీడనం కారణంగా.. రెండు రోజుల్లో కోస్తాంధ్ర తీర ప్రాంతాల్లో చాలా చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించింది. ఇక.. వాయుగుండం ప్రభావంతో ఉత్తర కోస్తాంధ్రలోని పార్వతీపురం మన్యం, అల్లూరి జిల్లాలతోపాటు కాకినాడ, కోనసీమ, ఏలూరు, ఎన్టీఆర్, సత్యసాయి జిల్లాల్లో చాలా చోట్ల మోస్తరు వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. అలాగే.. శ్రీకాకుళం, అనకాపల్లి, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరుతోపాటు పలు జిల్లాల్లోనూ ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది.బంగాళాఖాతంలోని వాయుగుండం ప్రభావంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేసింది. మరోవైపు.. పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం.. వాయుగుండంగా మారునుండడంతో హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో వర్షం పడనున్నట్లు వాతావరణశాఖ చెప్పింది. తెలంగాణ వ్యాప్తంగా ఇవాళ పలు జిల్లాల్లో మోస్తరు నుండి కొన్ని చోట్ల భారీ వర్షాల పడే ఛాన్స్ ఉందంది. అటు.. బంగాళాఖాతంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

# వరంగల్- ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ బై ఎలక్షన్ సందర్భంగా నాలుగు మండలాల పరిధిలో 144 సెక్షన్ అమలు..

**– ఎమ్మెల్సీ బై ఎలక్షన్ కు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు పూర్తి**
**– జిల్లా అధికారులతో సమన్వయంతో కలసి ఎన్నికలు నిర్వహిస్తున్నాం**
**– పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

సిద్దిపేట: ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ బై ఎలక్షన్ సందర్భంగా సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమరవెల్లి, మద్దూర్, దూల్మిట్ట, మండలాల పరిధిలో 144 సెక్షన్ అమలు ఎన్నికల 27.05.2024 సోమవారం నాడు ఉన్నందున, సిద్దిపేట జిల్లా పరిధిలో నాలుగు మండలాలలో పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత మైన వాతావరణంలో, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు 25.05.2024 సాయంత్రం 4 గంటల నుండి 28.05.2024 ఉదయం 8 గంటల వరకు 144 సి.ఆర్ పి సి సెక్షన్ అమలు చేస్తున్నట్లుగా కమిషనర్ తెలిపారు.నాలుగు మండలాల పరిధిలో చేర్యాల పట్టణంలో మండల ప్రజా పరిషత్ స్కూల్ నందు రెండు పోలింగ్ కేంద్రాలు,కొమురవెల్లి జిల్లా పరిషత్ హై స్కూల్ ఒక పోలింగ్ కేంద్రం.మద్దూరు జిల్లా పరిషత్ హై స్కూల్ ఒక పోలింగ్ కేంద్రం. దూల్మిట్ట జిల్లా పరిషత్ హై స్కూల్ ఒక పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుం డా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రతి పోలింగ్ కేంద్రాలను జియో ట్యాగింగ్ పూర్తి చేయడం జరిగినది. ఎన్నికల నియమావళి ఎవరైనా ఉల్లంఘిస్తే, ఎన్నికల సమయంలో ఏ చిన్న సంఘటన జరిగినా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667100. స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712667306. మరియు సమాచారం డైల్ 100 కు ఫోన్ చేసి తెలపగలరు,వెంటనే సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ తెలిపినారు.

# గ్రామపంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలి

**రాష్ట్ర సర్పంచుల సంఘం డిమాండ్**

హైదరాబాద్: తెలంగాణ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, వీధిలైట్ల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షుడు గూడూరు లక్ష్మి నర్సింహా రెడ్డి మరియు తెలంగాణ సర్పంచ్ల సంఘం జేఏసీ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పదంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపులలో గత మరియు తాజా ప్రభుత్వాలు జాప్యం వహించి సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించిన కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు. ఈమేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచుల యొక్క పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ ఎన్నికల సంఘం కమిషనరు పార్థసారథికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ప్రనీల్ చందర్, ఉపాధ్యక్షుడు గుంటి మధుసూదన్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, సముద్రాల రమేష్, పంబ కరుణాకర్, రామకృష్ణ,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కొడుకు పుట్టాడని కుమ్మేశారు...

హైదరాబాద్, మే 25 : హైదరాబాద్‌లోని ఓ యువకుడు బాలికను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దీంతో జైలు పాలయ్యాడు. జైలు నుంచి వచ్చిన తర్వాత కొడుకు పుట్టాడని బాలిక కబురు పెట్టింది. అంతే క్షణాల్లో వాలిపోయాడు. దాన్ని గమనించిన బాలిక ఫ్యామిలీ అతన్ని ఇంట్లో వేసి చితక్కొట్టారు. హైదరాబాద్‌లోని పాతబస్తీకు చెందిన పాతికేళ్ల అబ్దుల్? సోహైల్‌కు అదే ప్రాంతానికి చెందిన ఓ బాలికతో పరిచయం ఏర్పడింది. ఇది కాస్త ప్రేమకు దారి తీసింది. పీకల్లోతు ప్రేమలో ఉన్న వీళ్లు పెద్దలను ఎదురించి పారిపోయి పెళ్లి చేసుకున్నారు. మైనర్‌ను పెళ్లి చేసుకున్నందుకు సోహైల్‌పై పోక్సో చట్టం కింద కేసు రిజిస్టర్ చేసిన పోలీసులు జైలుకు పంపించారు. 45 రోజుల పాటు జైల్లో గడిపిన సోహైల్ ఈ మధ్యే బెయిల్‌పై విడుదలయ్యాడు.సోహైల్ విడుదలైన సంగతి తెలుసుకున్న బాలిక కబురు పెట్టింది. మనకు బిడ్డ పుట్టాడని చూడటానికి రావా అంటూ ముద్దుగా పిలిచింది. ప్రియురాలు ముద్దుగా పిలిచిందని ఈ తెల్లవారు జామున ఆమె ఇంటికి వెళ్లాడు సోహైల్. ఈ విషయాన్ని సీసీ టీవీ కెమెరాల్లో చూసిన బాలిక తండ్రి ఇతర కుటుంబ సభ్యులు సోహైల్‌ను పట్టుకునే ప్రయత్నం చేశారు. వారి నుంచి తప్పించుకొని వేరే గదిలోకి వెళ్లి దాక్కున్నాడు. ఎవరూ అటు రాకుండా తలుపులు వేసేసాడు. తప్పించుకునే క్రమంలో బాలిక తండ్రికి చిక్కి తన్నులు కూడా తిన్నాడు. దొరికితే చంపేస్తారని భయపడి గదిలో దాక్కున్న సోహైల్ అక్కడే ఓ వీడియోను తీసి స్నేహితులకు పంపించాడు.తాను ప్రియురాలి ఇంట్లో ఇరుక్కుపోయానని తనను చంపేందుకు వారి బంధువులు కాచుకొని ఉన్నారని రక్షించాలని వేడుకున్నాడు. ఆ వీడియో కాస్త పోలీసులకు చేరింది. వెంటనే అలర్ట్ అయిన బండ్లగూడ పోలీసులు ఆ ప్రాంతానికి వచ్చారు. గదిలో దాక్కున్న సోహైల్‌ను విడిపించి తీసుకెళ్లారు. యువతితో ఆమె పేరెంట్సే బలవంతంగా ఫోన్ చేయించారని... జైలు నుంచి వచ్చినప్పటి నుంచి రోజూ ఫోన్ చేయిస్తున్నారని సోహైల్ బంధువులు ఆరోపిస్తున్నారు. తర్వాత ఇంకో సీన్ మొదలైంది.. తనకు న్యాయం చేయాలంటూ పోలీసులతో మొర పెట్టుకున్న యువకుడు.. ప్రియురాలితో మాట్లాడే అవకాశం తనకు కల్పించాలంటూ ప్రాధేయపడ్డాడు.. చివరకు పోలీసులు ఎలాగొలా అతన్ని సముదాయించారు.. తనపై దాడి చే?స గాయపరిచిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదుచేశాడు. బాధితుడు, అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాతబస్తీ బండ్లగూడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రస్తుతం కేసు విచారణలో ఉందిచంపేందుకే కుట్ర చేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు.

# అడగడుగునా... నిర్లక్ష్యం..!

వరంగల్: కాళేశ్వరం బ్యారేజీల కుంగి వేతలకు గల కారణాల అధ్యయనం కోసం ఎట్టకేలకు రాష్ట్రానికి కేంద్ర నిపుణుల బృందం వచ్చింది. సెంట్రల్ వాటర్ పవర్ రీసెర్చ్ స్టేషన్(సిడబ్ల్యూటిఆర్ ఎస్) టీమ్ పూణే నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు చేరుకుంది. అందులో భాగంగా మొదటగా మేడిగడ్డ,అన్నారం బ్యారేజ్ లను నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి నిపుణుల బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా మేడిగడ్డ వద్ద కుంగిన వంతెనను నిపుణుల బృందం తరువుగా చెక్ చేసింది. గత ఏడాది సెప్టెంబర్ లో కుంగిన పిల్లర్ల వద్దకు వెళ్లి అక్కడ జరిగిన పనుల తీరును పరిశీలించింది. అలాగే అంతకు ముందు డ్యామ్ సేఫ్టీ విషయంలో చేసిన పరీక్షల గురించి నీటిపారు దల శాఖ అధికారులను అడిగి తెలుసుకుంది.డ్యాం క్రస్ట్ గేట్లను కేంద్ర బృందం చెక్ చేసింది. వాటి క్వాలిటీ.. క్రస్ట్ గేట్ల చుట్టుపక్కల డ్యాంకు వాడిన మెటీరియల్ ప్రామాణికతను పరిశీలిం చింది. మేడిగడ్డ, అన్నారం బ్యాలెన్స్ సింగ్ రిజర్వాయర్ల పూర్తి కోసం గుత్తేదారులు ఎంత టైం తీసుకున్నారన్న విషయంపైన కూడా ఆరా తీసింది. మరోవైపు గత ఏడాది వర్షాకాలం సందర్భం గా రిజర్వాయర్ల వద్ద బుంగలు ఏర్పడడానికి గల కారణాలపై రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు ఏ రకమైన నివేదికలను అప్పటి ప్రభుత్వానికి అందజేశారు అనే అంశం గురించి కూడా అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన సమాచారాన్ని కూడా వారు రికార్డు చేశారు.ఈ నేపథ్యంలోనే రిజర్వాయర్ల వద్ద భారీ ఎత్తున ఇసుక మేటలు కూరుకపోవడంపై వారు కొంత ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి ఇసుక దిబ్బలు ఎక్కువైతే డ్యామ్లకు మరింత ప్రమాదం చేకూరవచ్చని నీటిపారుదల అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. అందువల్ల ఇసుక మేటలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశిం చారు. డ్యాములు భవిష్యత్తులో పనికొచ్చే అవకాశం ఉందా..? లేక ప్రత్యామ్నాయ మార్గాలను ఏమైనా చేసుకోవాల్సి ఉంటుందా..? అనే అంశాన్ని కూడా కేంద్ర నిపుణుల బృందం తరువుగా పరిశీలించింది. రిజర్వాయర్ల పరిసరాల్లో భూగర్భ పరీక్షలను నిర్వహించింది. సాయిల్ కు సంబంధించిన ఈ ల్యాండ్ ఎగ్జామి నేషన్ ను కూడా చేపట్టింది. తాత్కాలికంగానైనా ఈ ప్రాజెక్టులను వాడుకోవచ్చా..? లేదా..? అనే అంశంపై కేంద్ర బృందం ఇప్పటికే ఓ అంచనాకు వచ్చినట్లు తెలుస్తోంది. డ్యాముల వద్ద భారీగా బొగ్గు నిక్షేపాలున్నట్లు ఉన్నట్లు సెంట్రల్ టీం తేల్చింది. అయితే ఆ బొగ్గు నిక్షేపాల వల్ల కూడా రిజర్వాయర్లకు భవిష్యత్తులో ప్రమా దాలు జరగొచ్చని అంచనా వేస్తోంది. ఇక సుందిళ్ల బ్యారేజ్ ను కూడా సందర్శించిన తర్వాత కేంద్ర బృందం తన నివేదికలను అటు సెంట్రల్ గవర్నమెంట్ కు.. ఇటు రాష్ట్ర ప్రభుత్వానికి పంప నుంది. ఈ నివేదికలు అందిన తర్వాత మరో రెండు సంస్థల చేత డ్యాముల భద్రతపై చేయిం చిన పరిశీలన నివేదికలను కూడా ఎగ్జామినేషన్ చేసి ప్రభుత్వం ఓ అంచనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ నివేదికలు ఎలా ఉన్నా.. తాత్కాలికంగా మాత్రం రిజర్వాయర్ల మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. పూణే నుంచి వచ్చిన సెంట్రల్ టీం అనేక లోపాలను గుర్తించింది.అందువల్లవాటిని కూడాసీరియస్‌గాపరిగణలోకి తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది.

# రోహిణి కార్తె ప్రారంభం

## -రోహిణి కార్తె అంటే ఏంటీ ?

## -ఎండలు ఎందుకు ఎక్కువగా ఉంటాయి?

రోహిణి కార్తె వచ్చింది అంటే వామ్మో రోహిణి కార్తెలో ఎండలకు రోల్లు పగిలే ఎండలు ఉంటాయి అనే నానుడి మనలో మెదలాడుతూ ఉంటుంది. నిజమే మరి ఈ నాలుగు నెలల ఎండాకాలంలో ఎండలు తోలి రోజులలో కొద్ది కొద్దికగా ఉగాది నుండి తాపం పెరుగుతుంది. దిన దిన ప్రవర్ధనమానంగా సూర్య భగవానుడు తన ప్రతాపాన్ని మనకు చూపిస్తాడు. రోహిణి కార్తె సూర్యుడు రోహిణి నక్షత్రంలోకి ప్రవేశించడాన్ని సూచిస్తుంది మరియు సాంప్రదాయకంగా సంవత్సరంలో అత్యంత వేడిగా ఉండే పక్షం రోజులుగా పరిగణించబడుతుంది. రోహిణి కార్తీ సాధారణంగా మే 3వ లేదా చివరి వారంలో ప్రారంభమవుతుంది మరియు కాన్పుల రోజులు దాదాపు 15 రోజుల పాటు కొనసాగుతాయి. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. మరి ఈ సంవత్సరం రోహిణి కార్తె ఏలా ఉంటుందో గమనిద్దాం. తేదీ. ఈ సంవత్సరం రోహిణి కార్తే మే 25 న ప్రారంభమై జూన్ 8 వరకు రోహిణి కార్తె ఉంటుంది. మాములుగా ఉండే ఎండల వేడినే తట్టుకోలేమంటే ఎండాకాలంలో చివరి కార్తె అయిన రోహిణిలో ఎండలు దద్దరిల్లుతాయి. అన్ని కార్తెల కన్నా రోహిణి కార్తె అంటే బంబేలెత్తిపోతారు. ఈ కార్తెలో ఎండలు మండిపోతాయని చెప్పడానికి బదులు రోహిణి కార్తెలో ఎండలకు రోళ్లు పగులుతాయంటారు.

అంటే వేడి తీవ్రత ఏ రేంజ్ లో ఉంటుందో అని చెప్పడమే దీని ఉద్దేశం..రోహిణి కార్తె ఫలితంగా ఈ పక్షం రోజులు అధిక వేడి గాలులు , ఎండ తీవ్రతలు , అగ్ని ప్రమాదాలు , ఉక్కపోతలు ఉంటాయి. ఎండ తీవ్రతకు శరీరం అలసిపోతుంది. కావునా ఆరోగ్య రీత్య తగు శ్రద్దలు తీసుకోవాలి. ఎక్కువ మట్టికుండ నీళ్ళు త్రాగడం , మజ్జిగా , పండ్ల రసాలు , కొబ్బరినీళ్ళు , నిమ్మరసం , రాగి జావ , ఫలుదా లాంటివి ఎక్కువగా త్రాగడం వలన ఆరోగ్యానికి అనుకూలంగా ఉంటుంది కొంత ఉపశమనం లభిస్తుంది. మసాలాకు సంబంధించిన ఆహార పదార్థాలు , వేపుళ్ళు , పచ్చళ్ళు , ఎక్కువ ఆయిల్ ఫుడ్ కలిగిన ఆహార పదార్థాలు తినకూడదు. నీళ్ళ సౌకర్యం ఉన్నవారు తప్పకుండా రెండు పూటల స్నానం చేయండి. అన్నిరకాల వయస్సు వారు ఎక్కువ కాటన్ దుస్తులు వాడండి , తెల్లని రంగు కల్గినవి , తేలిక రంగులు గల కాటన్ బట్టలు ధరిస్తే ఉష్ణ తాపం నుండి ఉపశమనం లభిస్తుంది. శారీరక తాపం తగ్గుతుంది. చిన్నపిల్లలకు మీరు ఉండే ఇంటి ఉష్ణోగ్రత తీవ్రతను బట్టి తడి గుడ్డతో తుడిచి బట్టలు మార్చండి. ఎవరైనా సరే ముదురు రంగు దుస్తులు వేయకపోవడం ఉత్తమం. ముఖ్యంగా సాటి జీవులైన పశు , పక్ష్యాదులకు త్రాగడానికి మీరు నివసించే చోట వాటికి నీళ్ళను ఏర్పాటు చేయండి. బాటసారులు ఎవరైనా సరే వాళ్ళు అడగక పోయిన వాళ్ళ దాహాన్ని తీర్చేందుకు వారికి త్రాగడానికి చల్లటి నీళ్ళను అందివ్వండి. ఇలాంటి సంఘ సేవా కార్యక్రమాలు చేయడం వలన మీకున్న గ్రహభాదలు నివారణకు మార్గమై కొంత ఉపశమనం లభిస్తుంది.

# మూడు పార్టీలకు కొత్త బాస్ లు..?

హైదరాబాద్: తెలంగాణలో రాజకీయ పార్టీలు మార్పులు కూర్పుల దిశగా ముందుకు సాగుతున్నాయి. మూడు ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు సంస్థాగతంగా సంచలన మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాయి. రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పే పార్టీల రాష్ట్ర అధ్యక్షుల నియామకాలపై ఫోకస్ పెట్టాయి కాంగ్రెస్, బీజేపీ. ఇక మరో పార్టీ బీఆర్ఎస్ సైతం ఇదే దిశగా అడుగులు వేస్తోంది. పార్టీని ఏ రకంగా ముందుకు తీసుకెళ్లాలి? ఎలాగూ రాష్ట్ర అధ్యక్షుడిగా కేసీఆర్ ఉంటారు, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఆల్రెడీ ఉన్నారు. అడిషనల్ గా ఇంకేమేమి చేయాలి? ఈ దిశగా కేసీఆర్ కసరత్తు చేస్తున్నారు. తెలంగాణలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ముగిశాయి. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు జూన్ 4న విడుదల కాబోతున్నాయి. అప్పటివరకు రాజకీయ పార్టీల నేతలకు కొంత గ్యాప్ దొరికింది. ఈ గ్యాప్ లో.. ఆయా పార్టీల్లో ఎలాంటి సంస్థాగత మార్పులు చేయాలి? అనేదానిపై అన్ని పార్టీలు దృష్టి పెట్టాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ ని తొలగించిన ఆయన స్థానంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా కిషన్ రెడ్డిని నియమించారు.కాగా, అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల వరకు మాత్రమే కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా ఉంటారని ముందుగానే జాతీయ స్థాయి నాయకత్వం క్లారిటీ ఇచ్చింది. దాంతో దాదాపుగా జూన్ నెలలోనే కిషన్ రెడ్డి అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవడం ఖాయం. అదే నెలలోనే బీజేపీలో అధ్యక్ష మార్పు ఉండబోతోంది.ఇటు కాంగ్రెస్ పార్టీ విషయానికి వస్తే.. ఆ పార్టీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయతీ రాలకు చేర్చారు. ఆయన కృషికి ఫలితం దక్కింది. ముఖ్యమంత్రి కూడా అయ్యారు. దీంతో కాంగ్రెస్ కూడా కచ్చితంగా పీసీసీ అధ్యక్షుడిని మార్చబోతోంది. లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత కాంగ్రెస్ కి కొత్త అధ్యక్షుడు రానున్నారు.ఇక బీఆర్ఎస్ విషయానికి వస్తే.. రాష్ట్ర అధ్యక్షుడిగా మొదటి నుంచి కూడా కేసీఆర్ ఉన్నారు. 2019లో బీఆర్ఎస్ మరోసారి అధికారం చేపట్టింది. ఆ తర్వాత వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని కేటీఆర్ కి కట్టబెట్టారు. అధ్యక్షుడిగా కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా కేటీఆర్ ఇద్దరూ..ఈ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించారు. అయితే అనుకున్న ఫలితాలు రాలేదు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. మళ్లీ కార్యకర్తలను, పార్టీని పునరుత్తేజం చేసేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. అధికారంలో ఉన్న పదేళ్లు పార్టీని పట్టించుకోలేదు, సంస్థాగతంగా నిర్మించలేదనే ఒక విమర్శ ఉంది. ఎన్నికలకు ఒక ఏడాది ముందు మాత్రమే అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాలయాలను ప్రారంభించారు. జిల్లా అధ్యక్షులను మాత్రమే నియమించింది తప్పితే రాష్ట్ర కార్యవర్గం కానీ జిల్లా కార్యవర్గం కానీ ఎక్కడా లేదు. కాబట్టి కార్యవర్గ నిర్మాణాలతో పాటు, బీఆర్ఎస్ లో ఉన్న మరో కీలక నేత హరీశ్ రావుకి కొంత ప్రాధాన్యత ఇచ్చే దిశగా అడుగులు పడుతున్నట్లుగా తెలుస్తోంది. మొత్తంగా మూడు ప్రధాన పార్టీల్లో ఎలాంటి మార్పులు జరగబోతున్నాయి? ఆ పార్టీల్లో ఏం జరగబోతోంది? లోక్ సభ ఎన్నికల ఫలితాల తర్వాత ఎలాంటి మార్పులు ఉండనున్నాయి? ఉన్న నాయకత్వాన్ని ఎలా కూర్పు చేయబోతున్నారు? ఇలాంటి అంశాలపై స్పెషల్ అనాలసిస్.. "చక్రం తిప్పే రాష్ట్ర అధ్యక్షులు ఎవరు?"

# బాజాప్తా చెరువుల మట్టిని తోడేస్తున్నారు...

## జోరుగా అక్రమ మట్టి దందా

## అధిక లోడుతో రోడ్లు ధ్వంసం అనుమతులు లేని రవాణా...

## ప్రభుత్వ ఆదాయానికి గండి




పెద్దపల్లి : వేసవి కాలం మొదలు కాగానే అక్రమ మార్కుల కన్నులు చెరువు మట్టిపై పడుతాయి. ప్రభుత్వం అనుమతి ఇచ్చిందే తడువు ఇక దోపిడీకి తెర లేపడం తరువాయి. ఇక ఇక్కడి నుండి సినిమా మొదలవుతుంది. ఆ ఊరు గ్రామ పంచాయితీ పర్మిషన్ నుండి మొదలు కొని వే బిల్లులు, ఆ పర్మిషన్ ఈ పర్మిషన్ అంటూ ఇటు అధికారుల తిరకాసులతో సదరు కాంట్రాక్టర్ల పరుగులు. ఇక అంతా అయిందనుకునే సమయంలోనే చిన్నా చితిక పెద్ద పత్రికలు, మీడియా చానళ్ళు. మళ్ళీ ఊపిరి పీల్చుకునే సమయంలో పలు సంఘాలు, ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, నాయకులు గద్దల్లా వాలుతారు. అన్ని దులిపేసుకుని మట్టి దందా మొదలు కావడం కొద్ది రోజులు సజావుగా సాగుతుంది. సదరు కాంట్రాక్టర్ ఇక అడ్డు అదుపు లేకుండా 24/7 తన పని తాను కానిస్తుంటాడు. అందరికి సర్దుబాటు జరిగితే అటు వైపు ఏ ఒక్కరు కన్నెత్తి చూడరు. ఎవరికీ తక్కువైనా కాంట్రాక్టర్ కథ మళ్ళీ మొదటికే వస్తుంది. ఈలోగా కాంట్రాక్టర్ తన పని పూర్తి చేసుకొని దుకాణం మూసుకుంటాడు. కానీ ఇక్కడ తనిఖీ చేయాల్సిన అధికారులు ఎందుకు విధులు సరిగా నిర్వహించడం లేదు. అనుమతి ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోతుందా. నిత్యం వందలాది టిప్పర్లు, లారీలు ఆయా మండలాల నుండి పెద్దపల్లి జిల్లా కేంద్రం నుండి ఇటుక బట్టీలకు మట్టి రవాణా జరుగుతున్నా చోద్యం చూస్తున్నారు. ప్రజా ధనం లూటి అవుతున్నా, వేల వేలకు జీతాలు తీసుకొని విధులు సక్రమంగా నిర్వహించని ఇలాంటి అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కాంట్రాక్టర్ నుండి ముడుపులు ముడితే ఒకలా లేకపోతే మరోలా ఉండే అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కమాన్ పూర్, రామగిరి మండలాల నుండి ఆయా గ్రామాల మీదుగా చెరువు మట్టిని రాఘవాపూర్ ఇటుక బట్టీలకు టిప్పర్ల ద్వారా బాజాప్తా మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ సరైన పత్రాలు లేకుండా నిర్భయంగా తరలించడంలోని ఆంతర్యం ఏమిటి. ఆయా మండలాల అధికారులు ఏమి చేస్తున్నట్లు. గత పదిహేను రోజులుగా ఈ తతంగం సాగుతున్నదని పలువురు ప్రజలు పేర్కొంటున్నారు. నిత్యం మంథని – పెద్దపల్లి జిల్లా కేంద్రానికి తనిఖీల పేరుతో తిరిగే జిల్లా స్థాయి అధికారులకు కూడా కనిపించడం లేదా అంటూ పలువురు ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పుతో హడావుడి చేస్తున్న అధికారులు తమ భాద్యతలు ఇప్పటి వరకు ఎందుకు మరిచినట్లు. కోర్టు చెపితే గానీ భాద్యతలు గుర్తుకు రావా అంటున్నారు ఆయా స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు. ఇది కూడా ప్రజల పిర్యాదు చేస్తే కానీ అధికారులు స్పందించాల్సి రావడం దురదృష్టకరం. నిత్యం జరుగుతున్న ఇలాంటి దోపిడీని అరికట్టేందుకు అధికారులు చిత్తశుద్ధితో పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# ఛెమటోడుస్తున్న బావ, బామర్దులు

హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తేదీ దగ్గర పడుతున్న కొద్ది అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఈ నెల 27 వ తేదీన వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల స్థానానికి ఉప ఎన్నిక జరగనుండడంతో భారత రాష్ట్ర సమితి ప్రచార స్పీడ్ పెంచింది. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జిల్లాలో తిరుగుతూ ఎమ్మెల్సీ ప్రచార కార్యక్రమాలలో పాల్గొంటున్నారు.వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఉపఎన్నిక అనివార్యమైంది. కాంగ్రెస్ పార్టీ నుంచి తీన్మార్ మల్లన్న, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్ రెడ్డి. బిజెపి నుండి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. 2021 వ సంవత్సరంలో వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుండి పల్లా రాజేశ్వర్ రెడ్డి విజయం సాధించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సిట్టింగ్ స్థానాన్ని వదులుకోవద్దని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు.బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా తీన్మార్ మల్లన్న బిజెపి అభ్యర్థిగా గుజ్జులా ప్రేమేందర్ రెడ్డి తోపాటు 52 మంది అభ్యర్థులు పోటీలో ఉన్న బీ అర్ ఎస్, కాంగ్రెస్ మధ్య పోటీ ఉండనుంది. పోలింగ్ కు మరో నాలుగు రోజులు సమయం ఉండడంతో బీ అర్ ఎస్ ప్రచారాన్ని ముమ్మరం చేసింది. బీ అర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఉమ్మడి వరంగల్ జిల్లాలో తిష్టవేయగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అధికార కాంగ్రెస్, ఆ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న పై తీవ్ర స్థాయిలో విమర్శల దాడి చేస్తున్నారు. మరో వైపు మాజీ మంత్రి హరీష్ రావు సైతం రాకేష్ రెడ్డి గెలుపుకోసం వర్ధన్నపేట, భూపాలపల్లి, డోర్నకల్, మహబూబాబాద్ నియోజకవర్గాల్లో రేపు ప్రచారం చేయనున్నారు. మరో వైపు నల్గొండ, ఖమ్మం జిల్లాలో పల్లా రాజేశ్వర్ రెడ్డి రాకేష్ రెడ్డి గెలుపు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి పట్టుబట్టి మరీ రాకేష్ రెడ్డికి టిక్కెట్ ఇప్పించుకోవడంతో ఈ ఎన్నికను ఆయన సవాలుగా తీసుకున్నారు. పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యా సంస్థల అధినేత కావడంతో ఆయన స్టూడెంట్స్‌ను టీం లుగా రంగంలోకి దింపారు. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న, మాజీ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి లు పోటీపడి పట్టభద్రుల ఓట్లను నమోదు చేశారు. అయితే ఈ సారి పట్టభద్రులు ఓటు హక్కు నమోదుకు ఆసక్తి చూపలేదు. దీంతో ఇద్దరు నేతలు నమోదు చేయించిన ఓట్లు గెలుపు ఓటములు కీలకం కానున్నాయి. ఎట్టి పరిస్థితుల్లో పట్టభద్రుల స్థానాన్ని వదులుకోవద్దని రెండు పార్టీలు చూస్తున్నాయి.

# ప్రత్యక్ష పరిశీలన మంచి అనుభవం

## పథకాల అమలపై సంపూర్ణ అవగాహన..

## జిల్లా పర్యటనకు వచ్చిన ఏఎస్ఓ శిక్షణ అధికారులతో కలెక్టర్ అనురాగ్ జయంతి

రాజన్న : ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై పథకాల అమలును ప్రత్యక్షంగా పరిశీలించడంతో మంచి పని అనుభవం వస్తుందని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ కు చెందిన ఏఎస్ఓలు అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ , శిక్షణలో భాగంగా జిల్లాకు 27 మంది ఈ నెల 20 వ తేదీన రాగా, వారి పర్యటన ముగింపు సందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి వారితో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర రక్షణ, పట్టణ గృహ నిర్మాణ, హైవే రహదారుల, కార్మిక, ఉపాధి కల్పన తదితర శాఖలకు ఎంపికైన ఏఎస్ఓలు ఐదు రోజుల్లో గ్రామాల్లో ఏమి పరిశీలించారో అడిగి తెలుసుకున్నారు.



అనంతరం కలెక్టర్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలును పరిశీలించడంతో సంపూర్ణ అవగాహన వస్తుందని వివరించారు. విధి నిర్వహణలో ఈ అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి, సంప్రదాయాలలో ఇక్కడి పండుగలు, పూజలు, జీవన శైలి శిక్షణకు వచ్చిన వారందరికీ ఒక మధురానుభూతిగా నిలిచిపోతుందని కలెక్టర్ వివరించారు. శిక్షణకు వచ్చిన వారు తంగళ్లపల్లి మండలం రామన్నపల్లి, ముస్తాబాద్ మండలం నామాపూర్, ఎల్లారెడ్డి పేట మండలం బొప్పాపూర్, చందుర్తి మండలం సనుగుల, గంభిరావుపేట మండలం నర్మాలలో గ్రామాల్లో ఉపాధి హామీ పనులు, వైకుంఠ దామాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, అంగన్ వాడీలు, ఎగువ మానేరు, వివిధ పంటల సాగు తీరును నేరుగా పరిశీలించారని జడ్పీ సీఈవో ఉమారాణి తెలిపారు. ఇక్కడ రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# ఎండ వేడిలో చల్లగా కొనసాగిన మండల సమావేశం

కమాన్ పూర్, ఎండ తీవ్రంగా ఉన్న మండల సమావేశం మాత్రం సాదాసీదాగా చల్లగా కొనసాగింది.కమాన్ పూర్ మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం లోని సమావేశం మందిరంలో ఎంపిపి రాచకొండ లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో విద్యుత్, వైద్య, ఆరోగ్య, మిషన్ భగీరథ, విద్యా, సమగ్ర స్త్రీ, శిశు సంక్షేమం, పశు పోషణ, ఆర్. టి.సి, పౌర సరఫరాలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ, సెర్ఫ్ కార్యక్రమాలు, గ్రామీణ అభివృద్ధి శాఖలకు సంబంధించిన అంశాల పై సమీక్ష నిర్వహించడం జరిగింది. ఇంకా పలు శాఖలకు సంబంధించిన అధికారులు గైర్హాజర్ కావడం వల్ల ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై సమీక్ష జరగలేదు. వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలను సభ్యులు సభలో ప్రస్తావించి వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇటీవల ప్రధాన చర్చంశనీయంగా మారిన చెరువులో మట్టి తవ్వకాలు, ఇటుక బట్టీలకు తరలింపు వ్యవహారం పై వైస్ ఎంపిపి ఉప్పరి శ్రీనివాస్ యాదవ్ ప్రస్తావించారు. నిర్ణిత సమయ పాలనను, నిబంధనలు పాటించకుండా మట్టి తరలింపులు జరిగియని అనుమతికి మించి మట్టి తరలస్తే విచారణ జరిపి అందుకు సంబందించి జరిమానా వేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ ఆరిపోద్దీన్ మాట్లాడుతూ.. మట్టి తవ్వకాలకు సంబంధించి ఇరిగేషన్ శాఖ నుండి ఓ బ్రిక్స్ కంపెనీ అనుమతి తీసుకుందాన్నారు. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అక్రమ మట్టి రవాణా జరగకుండా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రెవెన్యూ అధికారులు రహదారులపై తనిఖీ లు చేపడుతున్నారని వెల్లడించారు. ఇది ఇలా ఉండగా పి. ఏ. సీ. ఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు మాట్లాడుతూ..రైతులు తమ పంట భూములను సారవం తం చేసుకోవడం కోసం,చెరువుల్లోని మట్టిని పంట భూముల్లో పోసు కోవడం కోసం అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ ను కోరారు. ఈ నేపథ్యంలో మనుష్యులతో మట్టి తరలించేందుకు అనుమతులు ఇవ్వడం జరుగుతుందని, మిషన్ వినియోగించడం పై కలెక్టర్ అనుమతి తప్పని సరిగా ఉండాలని సూచించారు. మండల ప్రజా పరిషత్ పాలక వర్గం పదవికాలం ముగిసే సమయంలో జరిగిన దాదాపు చివరి సమావేశం సాధాసీదాగా జరిగింది. ఈ మండల సర్వ సభ్య సమావేశం లో ఎంపిపి రాచకొండ లక్ష్మి, పి. ఏ. సి. ఎస్ చైర్మన్ ఇన గంటి భాస్కర్ రావు, ఇంచార్జి ఎంపిడివో శేషయ్య సూరి, తహసీల్దార్ ఆరిపోద్దీన్, వైస్ ఎంపిపి ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, ఎంపిటిసి సభ్యులు కోలేటి చంద్రశేఖర్, శేవ్వా శంకరయ్య, వివిధ శాఖల అధికారులు ఎన్పీడీసీఎల్ ఏ ఈ రాజేంద్ర కుమార్ ఇన్చార్జి పశువైద్యాధికారి డాక్టర్ దుర్గా ప్రసాద్ రెడ్డి ఏపిఎం శైలజ శాంతి సీనియర్ అసిస్టెంట్ వంశీ పాల్గొన్నారు.

# 35 లక్షల విలువైన చక్కెరను కోతులు తినేసాయట...!

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇక్కడ కోతులు ఒక్క నెల రోజుల్లోనే రూ.35 లక్షల విలువైన చక్కెరను మాయం చేశాయి. ఈ మేరకు ఓ మిల్లు అధికారులు ఆడిట్ రిపోర్టు తయారు చేశారు. అలీఘర్‌లో ఉన్న బందర్ సాథ షుగర్ మిల్లులో 30 రోజుల్లోనే రూ.35 లక్షల విలువైన 11 వందల క్వింటాళ్లకు పైగా చక్కెర కనపించకుండా పోయింది. దీంతో కోతులు ఆ చక్కెర మొత్తం తినేశాయని ది కిసాన్ సహకరి షుగర్ మిల్స్ లిమిటెడ్ ఆడిట్ నివేదికలో అధికారులు పేర్కొన్నారు. ఈ ఘరనా మోసంలో మేనేజర్, అకౌంట్స్ అధికారి సహా ఆరుగురిని దోషులుగా నిర్ధారించారు. ఇంత పెద్ద మొత్తంలో చక్కెరను కోతులు తినడం, వర్షం కారణంగా చెడిపోవడం అనే సాకులతో పెద్ద మొత్తంలో చక్కెర కుంభకోణాన్ని తెరలేపారు. డబ్బును రికవరీ చేస్తామని దర్యాప్తు అధికారులు తెలిపారు. ఇటీవల ది కిసాన్ కోఆపరేటివ్ షుగర్ మిల్ లిమిటెడ్‌ను జిల్లా ఆడిట్ అధికారి, సహకార సంఘాలు, పంచాయతీ ఆడిట్ అధికారులు ఆడిట్ చేశారు. ఆడిట్ సందర్భంగా మార్చి 31 2024 వరకు సాథా షుగర్ మిల్లు క్లోజింగ్ స్టాక్‌ను పరిశీలించారు. నివేదిక ప్రకారం, చక్కెర నిల్వలు ఏప్రిల్ 1 నుంచి అక్టోబర్ 2023 వరకు లెక్కలు సరిపోయాయి. దీని తర్వాత 2024 ఫిబ్రవరిలో చక్కెర నిల్వ 1538.37 క్వింటాళ్లు కాగా, ఆ తర్వాత నెలలో కేవలం 401.37 క్వింటాళ్లు మాత్రమే ఉన్నట్లు లెక్కల్లో చూపారు. కోతులు, అధిక వర్షం కారణంగా 1137 క్వింటాళ్ల పంచదార పాడైందని ఆడిట్ నివేదికలో పేర్కొన్నారు. పైగా మార్చి నెల స్టాక్ అసలు లెక్కల్లో చూపలేదు. దీంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది.క్వింటా షుగర్ ప్రస్తుత మార్కెట్ ధర రూ.3100. ఆ ప్రకారం మొత్తం 1137 క్వింటాళ్ల చక్కెరపై సంస్థకు రూ.35 లక్షల 24 వేల 700 నష్టం వాటిల్లిందని సహకార సంఘాల అసిస్టెంట్ ఆడిట్ అధికారి వినోద్ కుమార్ సింగ్ నివేదికలో తెలిపారు. దీనికి ప్రిన్సిపల్ మేనేజర్ రాహుల్ యాదవ్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ ఓంప్రకాష్ ఓంప్రకాష్, కెమికల్స్ మేనేజర్ వినోద్ ఎంకే శర్మ, అకౌంటెంట్ మహిపాల్ సింగ్, ఇన్‌ఛార్జ్ సెక్యూరిటీ ఆఫీసర్ దల్వీర్ సింగ్, వేర్‌హౌస్ కీపర్ గులాబ్ సింగ్ బాధ్యులుగా తేల్చారు. వీరి నుంచి డబ్బు రికవరీ చేసి, ఆడిట్ నివేదికను లక్నోలోని చెరకు కమిషనర్, డిప్యూటీ డైరెక్టర్ షుగర్ మిల్స్ అసోసియేషన్‌కు దర్యాప్తు అధికారులు పంపనున్నారు.

# త్వరలో తలనే మార్చేసిన ప్రక్రియ..

న్యూయార్క్: వైద్య పరిజ్ఞానం రోజు రోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తూ వైద్యరంగంలో అనేక వ్యాధులకు చికిత్స చేస్తున్నారు. మరోవైపు అవయవాలను మార్పిడి చేస్తున్నారు. కళ్లు, చేతులు, కిడ్నీలు, గుండె, లివర్ ట్రాన్స్ ప్లాంటేషన్లు ఇప్పటికే జరుగుతున్నాయి. ఇటీవల జంతువుల అవయవాలను కూడా మనుషులకు అమర్చే ప్రయత్నం జరుగుతోంది. తాజాగా ఓ మెడికల్ స్టార్టప్ కంపెనీ ఏకంగా తలనే మార్చే శస్త్ర చికిత్సను అభివృద్ధి చేస్తోంది. ఇది సఫలమైతే చికిత్స లేని వ్యాధులతో పోరాడుతున్న రోగులకు కొత్త జీవితం అందించవచ్చని వైద్యులు పేర్కొంటున్నారు.అమెరికాలోని బ్రెయిన్ బ్రిడ్జ్, న్యూరోసైన్స్, బయో మెడికల్ ఇంజనీరింగ్ స్టార్టప్ ప్రపంచంలోనే తొలిసారిగా తల మార్పిడి వ్యవస్థను అభివృద్ధి చేసే ప్రక్రియ చేపడుతున్నట్లు ప్రకటించింది. అయితే ఈ కంపెనీ ఇప్పటికే రహస్యంగా ఈ ప్రయోగాలు చేస్తోంది. తాము చేస్తున్న ఈ సరికొత్త వైద్యం గురించి ప్రపంచం తెలుసుకోవాలన్న ఉద్దేశంతో అధికారికంగా ప్రకటించారు.చికిత్స లేని, చేయలేని స్టేజ్ 4లో ఉన్న కేన్సర్, పక్షవాతం, అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి న్యూరోడిజనరేటివ్ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు కొత్త జీవితం అందించడమే లక్ష్యంగా ఈ ప్రయోగానికి నాంది పలికినట్లు బ్రెయిన్ బ్రిడ్జ్ స్టార్టప్ పేర్కొంది. చిత్త వైకల్యంతో బాధపడుతున్న రోగి తలను ఆరోగ్యకరమైన బ్రెయిన్డ్ డోనర్ బాడీతో మార్పిడి చేయడం ఈ సరికొత్త వైద్య విధాన ప్రక్రియలో ఉంటుంది.తల మార్పిడి శస్త్రచికిత్సకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో సంచలనం రేకెత్తించింది. ఇందులో రెండు రోబోటిక్ బాడీలకు ఏకకాలంలో శస్త్ర చికిత్స చేస్తున్న రెండు స్వయం ప్రతిపత్త రోబోలు కనిపిస్తాయి. ఇక్కడ ఒకరి నుంచి తలను తీసి మరో రోబోటిక్ శరీరంలోకి మార్పిడి చేస్తారు. ఇది చూడడానికి హాలీవుడ్ రేంజ్ సన్నివేశంలా కనిపిస్తుంది. ఇలాంటి అత్యాధునిక శస్త్రచికిత్స పైనే న్యూరబుల్, ఎమోటివ్, కెర్నల్ అండ్ నెక్స్ట్ మైండ్, బ్రెయిన్ కంప్యూటర్ ఇంటర్ ఫేస్ వంటి కంపెనీలు వర్క్ చేస్తున్నాయి.శస్త్ర చికిత్స విధానంపై బ్రెయిన్ బ్రిడ్జ్‌లోని ప్రాజెక్ట్ లీడ్ హషేమ్ అల్-మైలీ ప్రాజెక్టు గురించిన కీలక విషయాలు వెల్లడించారు. తాము మెదడు కణాల క్షీణతను నివారించేలా అతుకులు లేకుండా తల మార్పిడి చేసేందుకు హైస్పీడ్ రోబోటిక్ సిస్టం వినియోగించేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఉన్న అధునాతన ఏఐ అల్గారిథమ్‌లు శస్త్ర చికిత్సలో నరాలు, రక్తనాళాలతోపాటు వెన్నుపాముని కచ్చితంగా తిరిగి కనెక్ట్ చేయడంలో రోబోలకు మార్గ నిర్దేశం చేస్తాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును విస్తృతమైన శాస్త్రీయ పరిశోధనల ఆధారంగా రూపొందించమని చెప్పారు. ఇది సక్సెస్ అయితే వైద్య సరిహద్దులను చెరిపేస్తుంద న్నారు. ప్రాణాంతక వ్యాధులతో పోరాడుతున్న వారి ప్రాణాలను రక్షించడంతోపాటు వినూత్న పరిష్కారాలు అందిస్తుందని తెలిపారు.

# ఆగని రేవ్ పార్టీ ప్రకంపనలు...

హైదరాబాద్, మే 25: బెంగళూరులో రేవ్ పార్టీ వ్యవహారం ఏపీ రాజకీయాల్లోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఫామ్ హౌస్‌లో దొరికిన కార్లలో ఒక దానికి మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి చెందిన ఎమ్మెల్యే స్టిక్కర్ ఉంది. అదే సమయంలో ఆ కారులో ఆయన పాస్ పోర్టు దొరికిందన్న ప్రచారమూ సాగింది. కానీ పోలీసులు ఆ కారు కాకాణి గోవర్ధన్ రెడ్డిదని కానీ.. అందులో పాస్ పోర్టు దొరికిందని కానీ చెప్పలేదు. కాకాణి గోవర్ధన్ రెడ్డి బంధువులు కూడా ఎవరూ దొరికినట్లుగా సమాచారం లేదు. అయితే నెల్లూరులో ఆయన ప్రత్యర్థి, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కాకాణిపై తీవ్ర విమర్శలు చేశారు. ఆ ఫామ్ హౌస్ రేవ్ పార్టీ దందాలో ఆయనకూ వాటా ఉందని ఆరోపించారు. ఈ ఆరోపణలపై మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి మరోసారి స్పందించారు. సోమిరెడ్డి తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేశారని బెంగళూరు రేవ్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ప్రకటించారు. డ్రగ్స్ ఆరోపణలు చేస్తున్నందున శాంపిల్స్ ఇవ్వడానికి నేను రెడీ. సోమిరెడ్డికి దమ్ముంటే నా ఛాలెంజ్‌ను స్వీకరించాలన్నారు. నెల్లూరులో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. నా పాస్ పోర్ట్ నా దగ్గరేదే ఉంది. ఇదివరకే మీడియా సమావేశం పెట్టి ఈ విషయాన్ని చెప్పా. అయినా ఆయన పదే పదే అదే ఆరోపణ చేస్తున్నారు. రేవ్ పార్టీతోగానీ, ఆ కేసు నిందితులకి నాకు ఎలాంటి సంబంధాలు లేవన్నారు. తన కారు స్టిక్కర్ వాడకంపై ఇదివరకే పోలీసులకు ఫిర్యాదు చేశాం అని కాకాణి మరోసారి స్పష్టత ఇచ్చారు. . రిసార్ట్ ఓనర్ గోపాల్‌రెడ్డితో నాకు సంబంధాలు ఉన్నాయని సోమిరెడ్డి అంటున్నారు. దానికి ఒక్క ఆధారమైనా చూపించాలన్నారు బెంగళూరు రేవ్ పార్టీ కేసులో అరెస్ట్ అయి రిమాండ్లో ఉన్న వారిలో విజయవాడకు చెందిన వ్యక్తి ఉన్నట్లు వెల్లడైంది. ఎఫ్ఐఆర్? (ఈఎఫ్) బయటకు రావడంతో ఈ విషయం వెలుగుచూసింది. దీంతో ఈ పార్టీలో పాల్గొని అరెస్టు అయిన నగరవాసుల సంఖ్య రెండుకు చేరింది. విజయవాడ వన్ టౌన్ ప్రాంతానికి చెందిన డి.నాగబాబును బెంగళూరు పోలీసులు ఏ3గా ఎఫ్ఐఆర్(ఈఎఫ్) లో పేర్కొన్నారు. ఈ వేడుకను నిర్వహించిన విజయవాడకు చెందిన బుకీ వాసును ఏ1గా చేర్చారు. తన జన్మదినం సందర్భంగా బెంగళూరు శివారులోని ఓ పామ్ హౌస్ లో వాసు భారీ ఎత్తున రేవ్ పార్టీ నిర్వహించాడు. దీనికి నాగబాబును కూడా ఆహ్వానించాడు. చివరకు నాగబాబు పార్టీకి వెళ్లి అక్కడ పోలీసులకు చిక్కారు.సినీ నటి హేమ పార్టీలో పాల్గొన్నారు. మొదట బుకాయిం చాలని చూసినా చివరికి ఆమెకు టెస్టుల్లో పాజిటివ్ గా తేలింది. శ్రీకాంత్ మేక అనే వ్యక్తి కూడా దొరికారు. ఆయన తెలుగు నటుడు శ్రీకాంత్ అనుకుని పలువురు ఆయనపై ప్రచారం చేస్తున్నారు. కానీ తాను కాదని..తన పేరుతో రాస్తే తానే నోటీసులు పంపుతానని హెచ్చరించారు. నెల్లూరు రాజకీయ నేతలు మాత్రం..ఈ కేసులో నేరుగా లేకపోయినప్పటికీ ఓ కారుపై ఉన్న స్టిక్కర్ తో మంత్రి కాకాణికి చిక్కులు వచ్చి పడుతున్నాయి.

# ప్రభాకరరావుకు బ్లూ కార్నర్ నోటీసులు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. మాజీ చీఫ్ ప్రభాకర్ అరెస్టుకు రంగం సిద్ధమయింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ాఎః మాజీ చీఫ్ ప్రభాకర్ కోసం పోలీసులు బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేశారు. తెలంగాణ అఎఆ ద్వారా బ్లూ కార్నర్ నోటీసులు ఇష్యూ అయ్యాయి. నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొం టున్న వ్యక్తి పారిపోయిన సందర్భంలో అతడికి సంబంధించిన సమాచారం. అతడు ఏ ప్రదేశంలో ఉన్నాడనే వివరాలను తెలుసుకోవ డానికి విచారణలో భాగంగా బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేస్తారు. ఈ నేపథ్యంలోనే ఇంటర్ నేషనల్ ఎయిర్ పోర్టులను అలెర్ట్ చేస్తారు. దీని ద్వారా అతడు ఏ ఎయిర్ పోర్టుకు వచ్చిన అదుపులోకి తీసుకునే అవకాశం ఉంటుంది.ఈ బ్లూ కార్నర్ నోటీసు నుంచి వచ్చే సమాచారం ఆధారంగా..తర్వాత రెడ్ కార్నర్ నోటీసు జారీ అవుతుంది. రెడ్ కార్నర్ నోటీసు సీబీఐ లేదా ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టర్ ద్వారా జారీ చేస్తారు. అమెరికాకు సంబంధించిన ఇంటర్ పోల్ ద్వారా పోలీసులకు సమాచారం అందించి ఆ వ్యక్తిని నేరుగా ఎయిర్ పోర్టు నుంచి ఇండియాకు తీసుకు రావడానికి రెడ్ కార్నర్ నోటీసు ఉపయోగపడుతుంది. మొదటి దశగా మాజీ చీఫ్ ప్రభాకర్ కోసం బ్లూ కార్నర్ నోటీసు జారీ అయింది. బ్లూ కార్నర్ నోటీసులతో ఆయన అరెస్ట్ కు రంగం సిద్ధమయింది.జూన్ 2 తర్వాత ఇండియాకు వస్తానని మాజీ చీఫ్ ప్రభాకర్ పోలీసులకు తెలిపినా పోలీసులు ఆయనను విశ్వసించడం లేదు. కేవలం ప్రభుత్వం మారిపోతే ఫోన్ ట్యాపింగ్ కేసు బయట పడుతుందనే ఉద్దేశంతోనే అమెరికా వెళ్లిపోయారని పోలీసులు చెబుతున్నారు. వారు హైదరాబాద్ కు వస్తేనే కీలక విషయాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. అందులో భాగంగానే బ్లూ కార్నర్ నోటీసులు జారీ చేశారు.తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును ప్రధాన నిందితుడిగా పోలీసులు తేల్చేశారు. అందులో భాగంగానే ప్రభాకర్ రావులను ప్రధాన నిందితుడిగా చేర్చుతూ కోర్టులో మెమో కూడా దాఖలు చేశారు. ప్రభాకర్ రావుతో పాటు ప్రయివేటు వ్యక్తిని కూడా నిందితుడిగా చేర్చారు. ప్రభాకర్ కనుసన్నల్లోనే ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.ఎస్ఐబీలోని హార్డ్ డిస్క్ ధ్వంసంలో ప్రధాన సూత్రదారి ప్రభాకర్ రావు అని, అతడి ఆదేశాలతోనే హార్ట్ డిస్క్ ప్రణీత్ రావు ధ్వంసం చేసినట్లు విచారణలో బయటపడింది. ఫోన్ ట్యాపింగ్ కేసు తర్వాత ప్రభాకర్ రావు అమెరికా వెళ్లి పోయాడు. దీంతో పోలీసులు ప్రభాకర్ రావు కోసం లుక్ అవుట్ నోటీసు జారీ చేసిన విషయం తెలిసిందే .

# ట్రాయ్ పేరుతో వచ్చే ఫేక్ కాల్స్ తో జాగ్రత్త ఉండాలి..



**సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి..**
**ఎట్టి పరిస్థితుల్లో ఓటీపీ నెంబర్ బ్యాంకు వివరాలు ఆధార్ కార్డు వివరాలు ఇతరులకు తెలియపరచకూడదు..**
**అప్రమత్తంగా ఉంటే సైబర్ నేరాల బారి నుండి తప్పించుకోవచ్చు.**
**పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ**

సిద్దిపేట: తెలంగాణ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా టి ఆర్ఏఐ, పేరుతో ఫేక్ కాల్స్ మెసేజ్ లు వస్తున్నాయి ఫోన్స్ సిమ్ కార్డు బ్లాక్ అవుతున్నాయంటూ కాల్ చేసి సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు ఎట్టి పరిస్థితుల్లో కూడా వాటిని నమ్మవద్దు.
గుర్తు తెలియని వ్యక్తి మరియు గుర్తుతెలియని నెంబర్ ద్వారా ఫోన్ చేస్తే ఎవరూ కూడా రెస్పాండ్ కావొద్దు. అత్యవసరం అయితే తప్ప పిల్లలకు ఫోన్ కొనివ్వవద్దు. పిల్లలు యువకులు ఫోన్లలో ఏం చేస్తున్నారు.? ఏం డౌన్లోడ్ చేస్తున్నారో తప్పకుండా గమనిస్తూ ఉండాలి. ఆన్లైన్ గేమ్స్ రమ్మీ ఇతర తదితర గేమ్స్ డౌన్లోడ్ చేసి బెట్టింగ్ పాల్పడి తల్లిదండ్రులకు తల్లిదండ్రులను లేనిపోని ఆర్థిక ఆర్థికంగా దిగజారుస్తున్నారు. ఏమీ చేయలేని పరిస్థితుల్లో జీవితంపై విరక్తి చెంది ఒత్తిడికి లోనై బ్యాలెన్స్ తప్పి ఆత్మహత్య చేసుకుంటున్నారు. టెక్నాలజీ చాలా ముఖ్యం టెక్నాలజీలో మంచి చెడు రెండు ఉన్నాయి. యువత చాలామంది చెడుకు బానిసలు అవుతున్నారు తల్లిదండ్రులు తప్పక పిల్లల యొక్క ప్రవర్తనను గమనిస్తూ ఉండాలి వారి ప్రవర్తనలో ఎలాంటి మార్పు వచ్చినా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో తెలియపరచాలి వారిని పిలిచి ఎస్సైలు సీఐలు కౌన్సిలింగ్ ఇవ్వడం జరుగుతుంది. ఎన్నో జన్మల తర్వాత మానవ జన్మ వస్తుంది యువత చెడుకు బానిన అయ్యి మద్యాంతరంగా ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరం. అధికారుల ఫోటోలు డిపి పంపించి ఆపదలో ఉన్నాము ఆసుపత్రులలో ఉన్నాము రోడ్డు యాక్సిడెంట్లు అయ్యాయి అత్యవసరంగా డబ్బులు పంపించమని ఎవరైనా మెసేజ్లు పంపిస్తే వాటిపై నిర్ధారణకు వచ్చేంతవరకు డబ్బులు పంపించవద్దు. సైబర్ నేరగాళ్ళు చేసే మోసాల పట్ల తస్మాత్ జాగ్రత్త. సైబర్ నేరాలకు గురైతే చేయవలసిన టోల్ ఫ్రీ నెంబర్లు 1930. డయల్ 100.లకు తక్షణమే కాల్ చేయండి. ఆశ,భయము అనే పేరుతో సైబర్ నేరాలు జరుగుతున్నాయి. మానవ తప్పిదం వల్లే సైబర్ నేరాలు ఎక్కువగా నమోదవుతున్నాయి ఫ్రీగా డబ్బులు ఎప్పుడూ ఎక్కడా ఎవ్వరూ ఇవ్వరు ఇది ప్రతి ఒక్కరూ గమనించాలి. సైబర్ నేరాలకు గురికాకుండా ఉండాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. లోన్ యాప్ లకు దూరంగా ఉండాలి.కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్ లో అస్సలు వెతకవద్దు. ఆయా సంస్థల అధికారిక వెబ్ సైట్ నుంచి మాత్రమే కస్టమర్ కేర్ నంబర్లను పొందాలి. అపరిచిత నంబర్ల నుంచి ఫేస్ బుక్, వాట్సాప్ ద్వారా వచ్చే వీడియో కాల్స్ కు స్పందించవద్దు. లాటరీ ఆఫర్లంటూ వచ్చే మెసేజ్ లను నమ్మవద్దు.అన్ వెరిఫైడ్ యాప్స్, వెబ్ సైట్స్ అందించే ప్రకటనలు నమ్మవద్దు. వారిచ్చే మోసపూరిత ఆఫర్లకు స్పందించి మోసపోవద్దు. యాప్స్ లలో ఆర్మీ సోల్జర్లం, ఆఫీసర్లం అంటూ ఎవరైన సంప్రదిస్తే నమ్మి మోసపోవద్దు.ఈజీ రిటర్న్స్, కమిషన్ బేస్డ్ సైట్లలో పెట్టుబడి పెట్టవద్దు.పాస్వర్డ్, ఓటీపీ, పిన్ లాంటి వివరాలను ఎట్టిపరిస్థితుల్లో ఎవరికీ షేర్ చేయవద్దు.మీకు లాటరీ తగిలిందంటూ ఎవరైనా మెసేజ్ చేసినా, మెయిల్ పంపించినా స్పందించవద్దు. సైబర్ నేరాలకు గురి అయితే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేయాలి. లేదా లిలిలి.ఇఎవతీఇతీతిఎవ.ణనీల.తిని వెబ్ సైట్లో రిపోర్ట్ చేయాలి. సైబర్ నేరాలలో దురదృష్టవశాస్తూ ఎవరైనా లక్ష రూపాయలు అంతకంటే ఎక్కువ పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వివరాలు చెప్పి తదుపరి సిద్దిపేట సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఫోన్ నెంబర్ 8712665862 సమాచారం అందించాలని సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ఎసిపి, ఇన్స్పెక్టర్ కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభిస్తారు.
లక్ష రూపాయల కంటే తక్కువ పోగొట్టుకున్న వారు కేంద్ర సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి వివరాలు పొందుపరిచి తదుపరి సంబంధిత పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇవ్వాలి.

# బోనస్ రగడ...

నిజామాబాద్: వరి పంటకు బోనస్ అంశం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశం తర్వాత మంత్రులు మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించారు. దీంతో అసలు రాజకీయ రగడ మొదలైంది.అసెంబ్లీ ఎన్నిక వేళ కాంగ్రెస్ మేనిఫెస్టోలో పంట బోనస్ పై హామీనిచ్చింది. రైతు ఏ రకం వరి పండించినా, ఎన్ని క్వింటాలు పండించినా? క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న విషయాన్ని ప్రతిపక్ష పార్టీలు గుర్తుచేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ మాట మార్చి?. కేవలం సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇవ్వడమేంటని ప్రశ్నిస్తున్నాయి.ఇచ్చిన హామీ మేరకు దొడ్డు వడ్లకు కూడా రూ.500 బోనస్ ఇవ్వాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ బోనస్ అంశపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ బలంగా తెరపైకి తీసుకువస్తోంది. మరోవైపు బీజేపీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోంది. అప్పుడు మాట ఇచ్చి? ఇప్పుడు ఇవ్వమని చెప్పడమేంటని నిలదీస్తోంది. సన్న వడ్ల పేరుతో సర్కార్ తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపిస్తోంది. మరోవైపు ప్రతిపక్ష పార్టీల ఆరోపణలపై ప్రభుత్వంలోని మంత్రులు, పెద్దలు గట్టిగా కౌంటర్ ఇస్తున్నారు.మరోవైపు మార్కెట్ లో సన్న వడ్లకు రోజురోజుకూ డిమాండ్ పెరుగుతుంది.దొడ్డు రకాలను తినేందుకు ప్రజలు పెద్దగా ఆసక్తి చూపటం లేదు. దొడ్డు వడ్లను కేవలం తెల్ల రేషన్ కార్డు వినియోగదారుల కోసమే కొనుగోలు చేసి ప్రజలకు సరఫరా చేస్తుంది. అందులోనూ మెజారిటీ శాతం బియ్యం?. అడ్డదారిలో రేషన్ డీలర్లు,మిల్లర్ల వద్దకే చేరుతుందన్న ఆరోపణలు కూడా ఉన్నాయి.దొడ్డు వడ్లను రీసైక్లింక్ చేస్తూ దందాకు నడుపుతున్న ఘటనలు వెలుగు చూస్తూనే ఉన్నాయి. దీని ద్వారా?. ప్రభుత్వ సొమ్ముకు భారీగానే గండి పడుతోంది. ఈ తరహా దందాకు అడ్డుకట్ట వేయడానికే సన్నవడ్లను ప్రోత్సహించే ఆలోచనలో సర్కార్ ఉందన్న అభిప్రాయాలు అధికారికవర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం యాసంగి ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంది. అకాల వర్షాల కారణంగా అనేక ప్రాంతాల్లో ఐకేపీ కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. మరోవైపు తరుగు,తూకం పేరిట కోతలు విధిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఈసారి వర్షాలు ముందుగానే పడొచ్చు అని వాతావరణ శాఖ అంచనాలు ఉండటంతో?. రైతులు విత్తనాల కోసం కేంద్రాల వద్ద క్యూలు కడుతున్నారు.రైతులకు రెండు లక్షల రుణమాఫీపై కసరత్తు చేయాల్సి ఉంది. ఇలాంటి కీలక సమస్యలు ఓవైపు ఉన్న నేపథ్యంలో?. తొందరపడి పంట బోనస్ పై ప్రకటన చేశారా అన్న చర్చ కూడా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో పంట బోనస్ పై అధికార పార్టీ నుంచి ఎలాంటి ప్రకటనలు వస్తాయనేది చూడాలి?.!

# ప్రభుత్వ రేషన్ బియ్యం పిడిస్ రైస్ డంపు పట్టుకున్న సిద్దిపేట టాస్కోర్స్ - కోహెడ పోలీసులు..

కోహెడ: కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోహెడ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీలో, గంట ఎల్లవ్వ, గంటఎల్లమ్మ, గంట బుచ్చమ్మ,ముగ్గురు కలసి కోహెడ మండల పరిధిలోని వివిధ గ్రామాలలో తక్కువ రేటుకు కొనుగోలు చేసుకుని, ఎక్కువ రేటుకు అమ్ముదామని అక్రమంగా ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రభుత్వ రేషన్ బియ్యం డంపు చేసి పెట్టినారని నమ్మదగిన సమాచారంపై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు సిబ్బంది కోహెడ ఎస్ఐ తిరుపతి, సిబ్బందితో వెళ్లి పట్టుకున్నారు. కోహెడ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ పోలీస్ అధికారులు, మాట్లాడుతూ.. పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన నిల్వ ఉంచిన, చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జూదం, గ్యాంబ్లింగ్ చట్ట వ్యతిరేక కార్యక్రమాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో,పట్టణాలలో ఇసుక అక్రమ రవాణా చేసిన, పిడిఎస్ రైస్ అక్రమంగా దాచిపెట్టిన రవాణా గ్యాంబ్లింగ్, పేకాట, మరిఏదైనా చట్ట వ్యతిరేకమైన కార్యక్రమాలు ఎవరైనా నిర్వహిస్తున్నట్లు తెలిస్తే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ అధికారుల నెంబర్లు 8712667445. 8712667446. 8712667447. లకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు.

# రాకేష్ రెడ్డిని గెలిపించాలి

**మాజీ మంత్రి జగదీష్ రెడ్డి**

సూర్యాపేట: సూర్యాపేట జిల్లా కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు మాజీ మంత్రి సూర్యపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అభ్యర్ధించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన గొంతు ప్రశంసించే గొంతుగా మారింది. 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నిక మేధావులు విద్యావంతులు పట్టబద్రులు ఆలోచించి టిఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి గత ప్రభుత్వ పథకాలను కూడా కొనసాగించడం లేదు. తొమ్మిదేళ్ల పాలనలో ప్రతి ఒక్క రోజు ప్రతి ఒక్కరిని ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ ది . రాష్ట్రంలో ఐదు నెలల్లో అధికారంలో ఉండే విద్యుత్ నిర్వహణను ఆగం చేశారు. ఆసుపత్రుల్లో సెల్ ఫోన్ లైట్ వేసుకొని ఆపరేషన్లు చేసే దుస్థితికి తీసుకువచ్చారు. డూప్లికేట్ మందులు మార్కెట్లోకి వస్తున్న ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుంది. రాష్ట్రంలో 1000 గురుకులాలను ఏర్పాటు చేసి ఆదర్శవంతంగా నిర్వహించి అద్భుతమైన మెనూ 10 లక్షల రూపాయలు తీసుకొనే కళాశాలలో కూడా అమలు చేయని మేనును ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేశాడని అన్నారు.ప్రస్తుత ప్రభుత్వం విశ్వా ఆహారం అందిస్తూ వందలాదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురై తిన్న పట్టించుకోవడం లేదు. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని దాటవేస్తున్నారు... రైతు పండించిన పంటకు బోనస్ కూడా ఇవ్వడం లేదు. టిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి మంచి వాక్చాతుర్యం ప్రశ్నించే తత్వం పోరాట పట్టిమ ఉన్న వ్యక్తి . కాంగ్రెస్ అభ్యర్థిని ఆయన అనుచరులే తిట్టిపోసుకుంటున్నారని ఆయనపై 56 కేసులు నమోదు అయితే టిఆర్ఎస్ ప్రభుత్వం పెట్టింది ఒకటి లేదు. బిజెపి అభ్యర్థి 32 గా పోటీ చేస్తున్నాడని పోలింగ్ రోజు కనపడి తర్వాత కనిపించకుండా పోతాడు ఆయన మాట్లాడినట్టు నేనెప్పుడూ చూడలేదు ఆయన పట్ట బద్రుల పక్షాన ఎలా ప్రశ్నిస్తాడు. ఓటు వేస్తున్నామంటే మన గొంతును అభ్యర్థికి ఇస్తున్నట్లేనని ప్రశ్నించే గొంతు ప్రశంసించే గొంతు గా మారిందని అందుకే ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని అన్నారు.

# అంబానీ పెళ్లికి కరీంనగర్ రిటర్న్ గిఫ్ట్స్





కరీంనగర్, మే 25 : కరీంనగర్ ఫిలిగ్రీ కళాఖండాలు మరోసారి ఖండాంతరాలను దాటనున్నాయి. అంబానీ ఇంట్లో జూలైలో జరగబోయే పెండ్లికి వచ్చే గెస్టులకు కరీంనగర్ ఫిలిగ్రీ జ్ఞాపికలను రిటర్న్ గిఫ్ట్ గా ఇవ్వబోతున్నారు. గత మార్చిలో దిగ్గజ పారిశ్రామిక వేత్త, రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత ముకేశ్ అంబానీ చిన్నకుమారుడు అనంత్ అంబానీ–రాధికా ప్రీ వెడ్డింగ్ సెలబ్రేషన్స్ జరిగాయి. కాగా జులైలో వివాహం జరగనుంది. ఈ పెళ్లి వేడుకల్లో అతిథులకు కరీంనగర్ ఫిలిగ్రీ బహుమతులు ఇచ్చేందుకు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు భౌగోళిక గుర్తింపు పొందిన ఫిలిగ్రీ తయారీదారులకు ఆర్డర్లు ఇవ్వడంతో కరీంనగర్ కళకు అరుదైన గుర్తింపు లభించినట్లైంది. ముకేష్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ పెళ్లి వేడుకలు సమీపిస్తున్నాయి. పెండ్లికి వచ్చే గెస్టులకు వెండితో చేసిన జ్యువెల్లరీ బాక్సులు, పర్సులు, ట్రేలు, ఫ్రూట్ బౌల్స్ ఇతర బహుమతులు ఇవ్వనున్నారు. ఇప్పటికే 400 ఫిలిగ్రీ కళాఖండాల కోసం అంబానీ ఫ్యామిలీ నుంచి ఆర్డర్ వచ్చినట్టు కరీంనగర్ సిఫ్కా అధ్యక్షుడు అశోక్ తెలిపారు. ఈ కళాఖండాల ద్వారా అంబానీ ఇంట పెండ్లికి వచ్చే ప్రముఖులకు 400 ఏళ్ల నాటి ఫిలిగ్రీ ప్రాచీన కళ పరిచయమవుతుందని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత సంపన్నుల ఇండ్లకు తమ కళాఖండాలు చేరుతాయని ఆనందం వ్యక్తం చేశారు. గతేడాది జరిగిన జీ–20 సదస్సులో వివిధ దేశాల అధ్యక్షులు కోటుకు అలంకరించు కునేందుకు అశోక చక్రంతో కూడిన బ్యాడ్జీలను ఇక్కడి కళాకారులే తయారు చేసి పంపించారు. అంతేకాకుండా ఇతర కార్యక్రమాలకు నుంచి ఆభరణాల పెట్టెలు, పర్సులు, ట్రేలు, పండ్ల గిన్నెలు, ఇతరత్రా కళాఖండాల కోసం ఆర్డర్లు లభించాయి. తాజాగా అపరకుబేరుడి ఇంట పెళ్లి కోసం అద్భుతమైన బహుమతుల జాబితాలో ఫిలిగ్రీ చేర్చడం అదనంగా ఉందని కళాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 2023 నవంబర్ లో హైదరాబాద్ అరంగేట్రం చేసిన రిలయన్స్ రిటైల్ స్వదేశ్ స్టోర్‌కు సిఫ్కా వస్తువులను సరఫరా చేస్తోంది. అంతేకాకుండా జాతీయ మరియు అంతర్జాతీయ అవార్డులను అందుకున్న సిఫ్కా సొసైటీ, ముంబైలోని ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ ప్రదర్శించిన ఫిలిగ్రీ కళాఖండాలు అంబానీని ఆకట్టుకున్నాయి. సున్నితమైన వెండితో రకరకాల కళాఖండాలను చేయడంలో కరీంనగర్ కళాకారులు సిద్ధహస్తులు. తరతరాలుగా వస్తున్న ఈ పురాతన హస్తకళతో కరీంనగర్‌లోని దాదాపు 150 కుటుంబాలకు చెందిన 300 మంది జీవనోపాధి పొందుతున్నారు. 400 ఏళ్లుగా వస్తున్న ఈ పురాతన కళను ఇంకా కొనసాగిస్తున్నారు. ప్రపంచంలోనే అరుదైన కళగా గుర్తింపు పొందిన సిల్వర్ ఫిలిగ్రీ తరువాత కాలంలో కరీంనగర్ నుంచి లండన్ వరకు వ్యాపించింది. మిషన్ భగీరథ ప్రారంభోత్సవానికి రాష్ట్రానికి వచ్చిన ప్రధాని మోదీకి రాష్ట్ర ప్రభుత్వం 5 కిలోల భారీ ఫిలిగ్రీ నెమలిని బహూకరించింది. ఉప రాష్ట్రపతిగా ఎన్నికై మొదటిసారిగా హైదరాబాద్ వచ్చిన వెంకయ్య నాయుడికి రెండున్నర కిలోల కాకతీయ కళాతోరణాన్ని కానుకగా అందించింది. పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కుమార్తె ఇవాంకాకు ఫిలిగ్రీ నెమలిని బహూకరించారు. కరీంనగర్‌లో తయారైన డ్రెస్సింగ్ సెట్‌ను నిజాం రాజు బ్రిటర్ రాణి ఎలిజిబెత్‌కు బహూకరించినట్లుగా చరిత్ర ఆధారాలు చెప్తున్నాయి. ఇక జీ 20 దేశాల సమావేశం భారత్ లో నిర్వహించినప్పుడు వివిధ దేశాల నుంచి ఈ సమావేశాలకు హాజరైన ప్రతినిధుల కోటుపైనా కరీంనగర్ ఫిలిగ్రీ కళ మెరిసిపోయింది. వివిధ దేశాల అధ్యక్షులు కోటుకు అలంకరించుకునేందుకు అశోక చక్రంతో కూడిన బ్యాడ్జీలను ఇక్కడి కళాకారులే తయారు చేసి పంపించారు. ముఖేష్ అంబానీ ఫ్యామిలీ ఎంచుకున్న కళాకృతులను తయారు చేసి వారికి పంపిస్తున్నారు. ప్రస్తుతం 400వస్తువులకు అంబానీ నుంచి ఆర్డర్లు వచ్చాయని నిర్వాహకులు చెప్తున్నారు. ఆర్డర్లు తయారు చేసి అందిస్తున్నామని తెలిపారు.

# ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకోవాలి...

### అధిక దిగుబడులు తెచ్చుకోవాలి.
### బండి ప్రమోద్ కుమార్..
### కమాన్ పూర్ మండల వ్యవసాయ

కమాన్ పూర్ : ప్రతి రైతు తమ భూమి యొక్క భూసార పరీక్షలు తప్పకుండా చేసుకోవాలని కమాన్ పూర్ మండల వ్యవసాయ అధికారి బండి ప్రమోద్ కుమార్ తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా సాగులో యాజ మాన్య చర్యలు చేపడితే తక్కువ పెట్టుబడితో నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయి. భూసారమనేది ఎప్పుడూ ఒకలా ఉండదు. వేసే పంటలు, వాడే క్రిమిసంహారకాలు, ఎరువులను బట్టి మార్పు చెందుతూ ఉంటుంది . ఆయా మార్పు లను ఎప్పటికప్పుడు కనిపెట్టి సాగు చేస్తేనే ఆశించిన ఫలితాలు, అధిక దిగుబడులు వస్తాయి అని తెలిపారు. రైతులు అనువైన సమయంలో భూసార పరీక్షలు చేయించు కోవడం ఎంతో అవసరం. వేసవికాలం ప్రారంభమైన వాటి నుంచే మట్టి నమూనాలు సేకరించడం ప్రారంభమయింది. మట్టిన మూనాలు సేకరించి రామగిరి మండలం లో ఉన్న కె వి కె వ్యవసాయ పరిశోధన (భూసార పరీక్షల కేంద్రం) కేంద్రానికి పంపించాలి అని పేర్కొన్నారు. 8 పారామీటర్లలో భూసార పరీక్షలు.. ఎకరా విస్తీర్ణంలో రైతుల పొలాల నుంచి సేకరించిన మట్టిని 8 పారామీటర్లలో పరీక్షిస్తారు. నేల స్వభావం, ఉదజని సూచిక, లవణ సూచిక, సేంద్రీయ కర్బనం, స్థూల పోషకాలైన నత్రజని, భాస్వరం, పొటాసియం, సి ఈ సి (క్యాట్ అయాన్ ఎక్స్ఛేన్జ్ కెపాసిటీ) పరీక్షలు నిర్వహిస్తారు. ఇవన్నీ సమతుల్యంగా ఉంటేనే వంటలు అధిక దిగుబడిని ఇస్తాయని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రామాణిక మట్టి నమూనా సేకరణమట్టి నమూనా భూమి విస్తీర్ణం మట్టి వాళ్ల ను మట్టి రంగును బట్టి సేకరించాల్సి ఉంటుంది. ఒకటి నుండి ఐదు ఎకరాల భూమిని ప్రామాణికంగా తీసుకొని 10 నుండి 15 చోట్ల మట్టి నమూనాలు సేకరించాలి. పొలంలో త్రిభుజాకారంలో 15 నుండి 20 సెంటీమీటర్ల వరకు తీసి పై నుండి కింది వరకు ఒక ఒక ఒక పక్కగా సేకరించాలి. ఆ విధంగా 10 నుండి 15చోట్ల నుండి సేకరించిన మట్టిని చతుర్ భాగా పద్ధతిలో ఒక కిలో వచ్చే వరకు చేయాలి. మట్టి నమూనాలను సేకరించడం లో మెళుకువలు: మట్టి నమూనా సేకరించ కూడని ప్రదేశాలు: –పొలం యొక్క వరాల దగ్గర సేకరించకూడదు. –చెట్టు నీడ దగ్గర సేకరించకూడదు– బోరు బావులు, నీరు పారే చోట సేకరించకూడదు. – బండరాళ్లు ఉన్న చోట సేకరించకూడదు. అతి ముఖ్యంగా మందులు కలుపుకునే చోట సేకరించకూడదు. మట్టి నమూనా సేకరించే విధానం: –భూసార పరీక్ష ఫలితాలు మనం సేకరించే మట్టి నమూనాల మీద ఆధారపడి ఉంటాయి. కనుక మట్టి నమూనాలను ఒక ఎకరం విస్తీర్ణంలో ఒక చోటు నుంచే కాకుండా 10 నుంచి 15 ప్రదేశాల నుంచి తీయాలి. ఎంపిక చేసిన పొలంలో జిగ్ జాగ్ (ఎగురు దిగుడు) పద్ధతిలో 10 నుండి 15 చోట్ల గుర్తులు పెట్టాలి. – తర్వాత గుర్తులు పెట్టిన చోట నుంచి చెత్త చెదారం తొలగించి శుభ్రపరచాలి. శుభ్రపరిచినచోట పైన చూపించిన విధంగా “ఎక%” ఆకారంలో గుంతలు తీయాలి. ఆ గోతులలో ఒక అంగుళం (2.5 సి.మీ) మట్టిని సేకరించాలి. – మీ పొలంలో 10 నుంచి 15 చోట్ల సేకరించిన మట్టిని ఒక కుప్పగా పోసి బాగా కలపాలి. 1. ఈ విధంగా బాగా కలిపినా మట్టిని గుండ్రంగాచేసి నాలుగు భాగాలుగా విభజించాలి. పై రెండు భాగాలను ం,అలు గా.. కింద రెండు భాగాలనువీటిలో రెండు ఎదురు ఎదురుగా ఉన్నభాగాలను (బిడి) కలిపి మిగిలిన రెండు భాగాలను (ఏ. సి) ను తొలిగించాలి. ఇప్పుడు మిగిలిన ( బి డి) భాగాలను బాగా కలిపి మళ్లీ గుండ్రంగా చేసుకోవాలి. ఈ విధంగా గుండ్రంగా చేసుకున్న మట్టినిమరల ముందుగా విభజించినట్టుగా నాలుగు భాగాలుగా చేసి ఎదురు ఎదురుగా ఉన్న (ఏ సి) భాగాలను (బి డి) ను తొలిగించాలి అని పేర్కొన్నారు. ఈ విధంగా 10–16 చోట్ల నుంచి సేకరించిన మట్టిని అర కిలో మట్టి నమూనా వచ్చే వరకు పరీక్షలు నిర్వహించాలి. – తరువాత ఈ మట్టి నమూనాను నీడలో అరబెట్టి సెంట పరిశుభ్రమైన, గుడ్డ సంచిలో నింపి మీ దగ్గరలో ఉన్న కృషి విజ్ఞాన కేంద్రం కు పంపించాలి. భూసార పరీక్షా కేంద్రం ద్వారా నేల రంగు స్వభావం వంటి భౌతిక లక్షణాలు కాక ఉదజని సూచిక,లవణ పరిమాణం, సేంద్రియ కర్బనం, లభ్యం నిర్ధారిస్తారు. సమస్యాత్మక భూముల్లో సున్నం, కప్పం వేయాలినన పరిమాణాన్ని నిర్ణయిస్తారు. అవసరానికి అనుగుణంగా కూడా తెలుపుతారు. నమూనాలతోపాటు రైతు వివరాలు.. నమూనా సేకరించిన పొలానికి సంబంధించి రైతుపేరు, గ్రామం, మండలం, సర్వే నంబర్, కావాల్సిన వంట, ఇంతకు ముందు వేసిన వంట, వాడిన ఎరువులు, వేయబోయే వంట వంటి వివరాలు కాగితంపై రాసి నమూనా మట్టితో కలిపి పరీక్ష కేంద్రాలకు పంపించాలి. భూములకు హెల్త్ కార్డులు మట్టి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించిన అనంతరం భూసార పరీక్షల ఆధారంగానే రైతులకు ఎరువుల సిఫార్సు కలిగిన సాయిల్ హెల్త్ కార్డులు అందజేస్తారు. రైతుల పొలాల్లో సేకరించిన మట్టి నమూనాలను అగ్రిల్యాబ్లో పరీక్షించి వచ్చిన నివేదిక ఆధారంగా ఏయే ఎరువులు ఎంత మోతాదులో వాడాలి,యాజమాన్య పద్ధతులు పాటించాలనే వివరాలు లక్ష్మి నమోదు చేసిన కార్డులు అందిస్తారు. భూసార పరీక్ష తో అధిక దిగుబడి... ఆధునిక వ్యవసాయంలో భూసార పరిరక్షణ దృశ్య తొలకరిలో వేసవి దు క్కులు, నేల స్వభావం, లక్షణాలు కనుగొనేందుకు భూసారపరీక్షల ఆవశ్యకత ఎంతైనా ఉంది. తద్వారా సరైన ఎరువులు యాజమాన్యం పాటించి నాణ్యమైన అధిక దిగుబడిని సాధించేందుకు అవకాశం ఉంటుంది.

# ఆశల పల్లకీలో ఆది శ్రీనివాస్..

కరీంనగర్, మే 25 : ఎంపీ ఎన్నికలు ముగిశాయి. కాంగ్రెస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. దీంతో క్యాబినెట్ విస్తరణ చేస్తారన్న ప్రచారం జోరందుకుంది. సీఎం రేవంత్ టీమ్ లో స్థానం దక్కేదెవరికి? ఏయే సామాజికవర్గాలకు ఛాన్స్ దక్కనుంది? సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తారా? కొత్త వాళ్లను మంత్రి వర్గంలోకి తీసుకుంటారా? సీఎం రేవంత్ రెడ్డి మనసులో ఉన్న ఆ ఆరుగురు అదృష్టవంతులు ఎవరు?తెలంగాణ మంత్రివర్గ విస్తరణకు వేళైంది. సీఎం రేవంత్ రెడ్డి టీమ్ లో త్వరలో ఆరుగురు కొత్త వాళ్లు చేరబోతున్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో 11మంది ఉన్నారు. 119 అసెంబ్లీ నియోజకవర్గాల ప్రకారం 15శాతం మందిని మంత్రివర్గంలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఆ లెక్కన సీఎంతో పాటు 17మంది మంత్రులు ఉండాలి. ప్రస్తుతం కేబినెట్ లో ముఖ్యమంత్రితో పాటు 11మంది మంత్రులే ఉన్నారు. దీంతో మరో ఆరు బెర్తులు ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో మంత్రివర్గ విస్తరణ చేయాలని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. మంత్రివర్గ విస్తరణ వార్తల నేపథ్యంలో కాంగ్రెస్ నేతల్లో ఆశలు మొదలయ్యాయి. కేబినెట్ లో చోటు కోసం సీనియర్లు, కొత్త వాళ్లు తెగ ఆరాట పడుతున్నారు. అయితే, సామాజిక సమీకరణాల్లో భాగంగా ఎవరికి వారే తమకు బెర్తు కన్ ఫర్మ్ అని ధీమాగా ఉన్నారు. అయితే ఎన్నికల ప్రచారంలో భాగంగా ముదిరాజ్ లకు మంత్రి పదవి ఇస్తానని బహిరంగంగా ప్రకటించారు. దీంతో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి మంత్రి పదవి ఖాయం అన్న వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ముదిరాజ్ సామాజికవర్గాన్ని లీడ్ చేయగల వ్యక్తికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇస్తే బాగుంటుందని ప్రభుత్వ పెద్దలు ఆలోచిస్తున్నట్లు సమాచారం. అటు ఎమ్మెల్సీ వెంకట్ బల్మూర్ ను క్యాబినెట్ లోకి తీసుకుంటారనే చర్చ బలంగా వినిపిస్తోంది. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ వాయిస్ ను వెంకట్ జనంలోకి బలంగా తీసుకెళ్లారు. దీంతో పాటు వెంకట్ కు సీఎం రేవంత్ రెడ్డితో, పార్టీ అధిష్టానం దగ్గర గుడ్ విల్ ఉంది. ఈ క్రమంలో ఆయనకు మినిస్టర్ పోస్ట్ పక్కా అంటున్నారు. మున్నూరు కాపుల్లో బలమైన నాయకుడిగా ఉన్న ఆది శ్రీనివాస్ కు కూడా మినిస్టర్ హోదా దక్కే అవకాశం ఉన్నట్లుగా తెలుస్తోంది. తెలంగాణలో కురుమ సామాజికవర్గం ఓట్లు భారీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో కురుమ సామాజికవర్గానికి చెందిన బీర్ల ఐలయ్యకు మంత్రిపదవి ఇస్తారని జోరుగా చర్చ జరుగుతోంది. మంత్రివర్గ విస్తరణలో భాగంగా ఎస్టీ సామాజికవర్గానికి మినిస్టర్ పోస్ట్ ఇచ్చే ఆలోచనలో కాంగ్రెస్ సర్కార్ ఉంది. ముఖ్యంగా లంబాడ ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారట. అదే జరిగితే దేవరకొండ ఎమ్మెల్యే భాను నాయక్ ని మినిస్టర్ పదవి వరించొచ్చు. లేదా ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాకు చెందిన లంబాడ ఎమ్మెల్యేకు మంత్రివర్గంలో చోటు దక్కొచ్చు. మరోవైపు మంత్రివర్గంలో ఉమ్మడి ఆదిలాబాద్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలకు ప్రాతినిధ్యం లేదు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు మినిస్టర్ పోస్ట్ దక్కే ఛాన్స్ ఉంది. సీఎం రేవంత్ దృష్టిలో వెడ్మ బొజ్జుకు మంచి గుడ్ విల్ ఉండటంతో ఆయనకు మినిస్టర్ పోస్ట్ పక్కా అన్న ప్రచారం జరుగుతోంది. అటు ఉమ్మడి నిజామాబాద్ నుంచి బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి లేదా ముస్లిం మైనారిటీ కోణంలో షబ్బీర్ అలీకి ఛాన్స్ దక్కే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. అలాగే భువనగిరి పార్లమెంట్ కాంగ్రెస్ గెలిస్తే.. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మినిస్టర్ అయ్యే ఛాన్స్ ఉంటుందని ఆయన సన్నిహితులు ప్రచారం చేస్తున్నారు. ఇదిలా ఉంటే కేబినెట్ విస్తరణకు సీఎం రేవంత్ ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్లు తెలుస్తోంది. ఆరు మంత్రి పదవులు ఎవరికి ఇవ్వాలి అనే విషయంపై ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి ఓ అభిప్రాయానికి వచ్చినట్లుగా సమా చారం. ఈ ఆరుగురిని తన కిచెన్ కేబినెట్ గా మార్చుకునేందుకు



రేవంత్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న మంత్రుల్లో నలుగురు ఐదుగురు మినహా మిగతా వారు పార్టీ లైన్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కానీ ప్రభుత్వ నిర్ణయాలను, కార్యక్రమాలను ప్రజలకు వివరించడంలో పెద్దగా చొరవ చూపడం లేదనే నిర్ణయానికి రేవంత్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే కొత్త మంత్రులతో ఈ అంశాలన్నింటిని భర్తీ చేయాలని రేవంత్ ఆలోచిస్తున్నట్లు సమాచారం. మొత్తానికి క్యాబినెట్ బెర్తుల అంశం ప్రస్తుతం తెలంగాణలో హాట్ టాపిక్ గా మారింది. మంత్రివర్గంలో ఏ సామాజిక వర్గానికి ఏ వ్యక్తికి స్థానం దక్కుతుందో అనేది ఆసక్తికరంగా మారింది.

# పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే మా ధ్యేయం

### –తమకున్న తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తాం
### –మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి

మంథని : మంథని పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడమే మా ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ పెండ్రి రమా సురేష్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మంథని మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులకు సంబంధించిన పలు సమస్యలను మున్సిపల్ చైర్మన్ రమా సురేష్ రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. తమ సిబ్బందితో కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. మంథని మున్సిపల్ పరిధిలోని బోయినిపేట , గొల్లగూడెం కు సంబంధించిన ప్రాంతాల్లో బలవీర హనుమాన్ టెంపుల్ దగ్గర నుండి ఎకో పార్క్ వరకు గల రోడ్డుకు ఇరువైపులా ముళ్ళ పొదలతో కూడిన చెట్లు ఉండి ఆ ప్రాంత వాసులకు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ ఈరోజు ఉదయం ఆ ప్రాంతాలను పరిశీలించి వెంటనే జె సి బి సహాయంతో రోడ్లకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలను దగ్గరుండి తొలగించారు. అదేవిధంగా మున్సిపల్ ఏరియాకు సమీపంలో డ్రైనేజీలు పూర్తి అస్తవ్యస్తంగా ఉండడంతో తమ సిబ్బందిని ఉపయోగించి గత కొద్ది రోజులుగా పేరుకుపోయిన చెత్తా చెదారాలను శుభ్రం చేయించారు. వెనువెంటనే స్పందించిన మున్సిపల్ చైర్మన్ కు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పెండ్రు రమ మాట్లాడుతూ తమకున్న తక్కువ సమయంలో వీలైనన్ని ఎక్కువ అభివృద్ధి కార్యక్రమాలను మంథని ప్రజలకు అందించడం కోసం తాము తమ పాలకవర్గం మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు పనిచేస్తున్నామని నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు.

# ఉపాధి హామీ కూలీలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటన వేతనాలు ఇవ్వాలి

### – రోజు కూలి 300 ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి డిమాండ్

పరవాడ: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కొలతలతో సంబంధం లేకుండా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన రోజు కూలి 300 రూపాయలు ఇవ్వాలని పరవాడ మండలం ఈ బోణింగి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి . సత్యనారాయణ డిమాండ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ,ఏ రోజు ఎంత వేతనం పడుతుందో తెలుసుకునే విధంగా పే స్లిప్పులు ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి అన్నారు. మండుటెండలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వం రోజుకు 300 రూపాయలు కూలి ఇస్తున్నామని చెప్పినా పెరిగిన ధరలకు అనుగుణంగా లేకుండా కూలి తక్కువ పని ఎక్కువ గా ఉందని అందువలన ఎవరకి ఎంత కూలి పడుతుందో తెలుసుకునే విధంగా గతంలో పేస్లిప్ప ఇచ్చేవారని ఇప్పుడు ఇవ్వడం లేదని ఎండవేడికి ప్రభుత్వం ఉపాధి కూలీలకు మజ్జిగ, మంచినీరు సౌకర్యం కల్పించాలని 30 శాతం వేసవి అలవెన్సు ఇచ్చి ఆదుకోవాలని, ప్రతి 15 రోజులకి ఒకసారి పని చేసిన కూలి డబ్బులు ఇవ్వాలని సంవత్సరానికి ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించి రోజు వేతనం 600 ఇవ్వాలని కోరారు. మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు,ఈ కార్యక్రమంలో ఈ బోనింగి గ్రామ ఉపాధి హామీ కూలీలు శేషమ్మ, అప్పారావు, రమణ, లక్ష్మి, అప్పల నరసింహ, పార్వతితదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాదేశ్ ఎంపీ అజీం అనార్ కేసులో వెలుగులోకి షాకింగ్ వివరాలు

కోల్ కతా మే 25 : ఇండియాలో ఇటీవల హత్యకు గురైన బంగ్లాదేశ్ ఎంపీ అన్వరుల్ అజీం అనార్ కేసులో షాకింగ్ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే పశ్చిమ బెంగాల్ సిఐడి పోలీసులు ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వారిలో ఒకడు హత్య ఎలా చేసింది పోలీసులకు తెలిపాడు. బంగ్లాదేశ్ సంతతికి చెందిన అమెరికా పౌరుడు అఖ్తరుజ్జామన్ ఆదేశాలతోనే తనతో పాటు మరి నలుగురు బంగ్లా జాతీయులు ఈ హత్యలో పాల్గొన్నట్లు తెలిపాడు. ఎంపీని గొంతు నులిమి చంపామని అతడు పేర్కొన్నాడు. మృతదేహాన్ని గుర్తుపట్టకుండా ఉండేందుకు చర్మం ఒలిచామని, ముక్కముక్కలు చేసినట్టు చెప్పాడు. ఆ ముక్కలను ప్లాస్టిక్ కవర్లలో పెట్టి నలువైపులా పడేసినట్లు వివరించాడు. ఇదిలా వుండగా ఆ బంగ్లాదేశ్ ఎంపీని హనీ ట్రాప్ చేసి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. టౌన్ హాల్ ప్రాంతంలోని అపార్ట్మెంట్లోకి ఇద్దరు పురుషులు, ఓ మహిళ వెళ్లిన సిసిటివి దృశ్యాలను పోలీసులు పరిశీలించారు. బంగ్లాదేశ్ ఎంపీ హత్య ఎందుకు జరిగిందన్నది ఇంకా తేలాల్సి ఉంది. పోలీసులు అనేక కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# కొండచరియలు విరిగిపడి వంద మంది మృతి

న్యూ గినియా : కొండచరియలు విరిగిపడడంతో వంద మంది మృతి చెందిన సంఘటన పపువా న్యూ గినియా దేశం ఎన్గా ప్రావిన్స్‌లో జరిగింది. కావోకలం గ్రామంలో కొండచరియలు విరిగిపడడంతో 100 మందికి పైగా గ్రామస్థులు దుర్మరణం చెందారు. సంఘటన పపువా న్యూ గినియా రాజధాని పోర్ట్ మోర్స్‌కు వాయువ్య దిశకు 600 కిలో మీటర్ల దూరంలో జరిగింది. భారీగా కొండ చరియలు విరిగిపడడంతో వందల ఇండ్లు కూలిపోయాయి. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని స్థానిక మీడియా వెల్లడించింది. రెస్క్యూ సిబ్బంది, ప్రభుత్వ అధికారులు అక్కడికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. ఆ గ్రామంలో బంగారు గనులు ఉన్నాయి. అధికారికంగా ప్రభుత్వం ఇంకా ప్రకటించలేదు.

## ఆరేళ్ల తర్వాత ఐపీఎల్ ఫైనల్స్‌కు చేరిన హైదరాబాద్ జట్టు..




ఐపీఎల్-17వ సీజన్‌లో ప్రముఖంగా వినిపించిన పేరు సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఓనర్ కావ్య మారన్ .

ఆటలో ఆరెంజ్ ఆర్మీ ఓటమి, గెలుపు సందర్భంగా ఆమె ఎక్స్‌ప్రెసెన్సే ఇందుకు కారణం. అయితే, తాజాగా మరోసారి కావ్య హెడ్‌లైన్స్‌లో నిలిచారు. హైదరాబాద్ జట్టు ఫైనల్స్‌కు (%ూ=ు జుత్‌వతీ ఖూూ ఖీఱఖుశ్రీ%) చేరడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబైపోయారు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం నెట్టింట తెగ ఆకట్టుకుంటోంది.

ఐపీఎల్-17లో అందరి అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన విజయాలతో ప్లేఆఫ్స్‌కు చేరిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. కీలకమైన 'క్వాలిఫయర్-2'లో భాగంగా చెపాక్ వేదికగా శుక్రవారం రాజస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో 36 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. దీంతో ఐపీఎల్ చరిత్రలో ఆరేళ్ల తర్వాత ఆరెంజ్ ఆర్మీ ఫైనల్స్‌కు చేరింది. దీంతో అభిమానుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. నెట్టింట పండగ చేసుకుంటున్నారు. సోషల్ మీడియాని మొత్తం ఆరెంజ్ ఆర్మీతో నింపేశారు.

ఇక మ్యాచ్‌ను స్టాండ్స్‌లో కూర్చొని వీక్షించిన జట్టు ఫ్రాంచైజీ ఓనర్ కావ్య మారన్ ఆనందంతో గంతులేశారు. తన జట్టు ఆటతీరు చూసి సంతోషంలో మునిగి తేలిపోయారు. అక్కడున్న సభ్యులతో కరచాలనం చేస్తూ జట్టు విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. ఇక మ్యాచ్ విజయం సాధించాక ఆమె ఎగ్జైట్ అవుతూ పలికించిన హావభావాలు ఇంటర్నెట్‌లో తెగ వైరల్ అవుతున్నాయి. మరోవైపు కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో ఎస్ఆర్‌హెచ్ ఆదివారం అమీతుమీకి సిద్ధమైంది.

## ఫైనల్ వేళ.. కేకేఆర్‌ను విడిచిన గంభీర్.. ఎందుకంటే?



ఐపీఎల్-2024లో మెగా సమరానికి వేళైంది. చెపాక్ వేదికగా ఆదివారం జరగనున్న ఫైనల్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ తలపడనున్నాయి. టాప్-2లో నిలిచిన ఈ ఇరు జట్లు బలాబలాల్లో సమవుజ్జీలు. భీకర హిట్టర్లు, టాలెంటెడ్ బౌలర్లు రెండు జట్లలో ఉన్నారు. దీంతో రేపటి పోరు హెూరాహెూరీగా సాగడం ఖాయమే. ఈ సీజన్‌లో కేకేఆర్, ఎస్ఆర్‌హెచ్ రెండు సార్లు తలపడ్డాయి. రెండింట్లోనూ కోల్‌కతానే పైచేయి సాధించింది. సన్‌రైజర్స్‌పై లీగ్ మ్యాచ్‌లో నాలుగు పరుగుల తేడాతో, క్వాలిఫయిర్-1లో ఎనిమిది వికెట్ల తేడాతో కేకేఆర్ నెగ్గింది. ఐపీఎల్‌లో ఓవరాల్‌గా ఇరు జట్లు 27 మ్యాచ్‌లు ఆడగా మూడింట రెండో వంతు కోల్‌కతానే విజయం సాధించింది. సన్‌రైజర్స్ తొమ్మిదింట్లోనే గెలిస్తే, కేకేఆర్ 18 మ్యాచ్‌ల్లో విజయఢంకా మోగించింది. గణాంకాల పరంగా సన్‌రైజర్స్‌పై కోల్‌కతానే పైచేయి. దీంతో రేపటి ఫైనల్‌లోనూ శ్రేయస్ సేన విజృంభించే అవకాశాలు ఎక్కువ అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఫైనల్ ముంగిట ఆ జట్టు మెంటార్ గౌతమ్ గంభీర్ జట్టుకు దూరమవ్వడం కేకేఆర్‌ను కలవరపెడుతోంది. కోల్‌కతా సాధించిన విజయాల్లో గంభీర్‌ది కీలకపాత్ర.లక్నో సూపర్ జెయింట్స్‌ను విడిచి ఈ సీజన్‌లో కోల్‌కతా జట్టుకు మెంటార్‌గా గంభీర్ బాధ్యతలు అందుకున్న విషయం తెలిసిందే. గంభీర్ రాకతో కేకేఆర్ దూకుడు పెంచింది. సునీల్ నరైన్ తిరిగి ఓపెనర్ అవతారమెత్తి సత్తాచాటుతున్నాడు. యువ ఆటగాళ్లు బెదురులేని ఆట ఆడుతున్నారు. జట్టు విజయాల్లో గంభీర్‌ది ప్రధాన పాత్ర అని కేకేఆర్ ఆటగాళ్లు సైతం పేర్కొంటున్నారు. అయితే కీలక సమయంలో కేకేఆర్ జట్టుకు గంభీర్ దూరమయ్యాడు. సార్వత్రిక ఎన్నికల ఆరో విడత పోలింగ్ నేపథ్యంలో గంభీర్ జట్టును వీడాడు. ఈస్ట్ ఢిల్లీలోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకోవడం కోసం చెన్నై నుంచి గంభీర్ ఢిల్లీకి వెళ్లాడు. ఓటు వేశాడు. గత ఎన్నికల్లో గంభీర్ ఈస్ట్ ఢిల్లీ తరఫున లోక్‌సభకు ఎన్నికైన విషయం తెలిసిందే. కాగా, ఇవాళ సాయంత్రం గంభీర్ కేకేఆర్ జట్టుతో చేరే అవకాశం ఉంది. అయితే ఐపీఎల్ ఫైనల్‌కు ఎక్కువ సమయం లేకపోయినా, జట్టును విడిచిపెట్టి ఓటు వేయాలనుకున్న గంభీర్ నిర్ణయాన్ని నెటిజన్లు మెచ్చుకుంటున్నారు. గంభీర్‌లా అందరూ బాధ్యతాయుతంగా ఉండాలని అంటున్నారు.

## ఓవరాక్షన్.. మూల్యం చెల్లించకతప్పలేదు!



ఐపీఎల్-2024లో రాజస్తాన్ రాయల్స్ ప్రయాణం ముగిసిపోయింది. క్వాలిఫయర్-2లో సన్‌రైజర్స్ హైదరాబాద్ చేతిలో ఓటమి పాలైన సంజూ శాంసన్ సేన టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ఫలితంగా ఈసారి టైటిల్ పోరుకు అర్హత సాధించాలన్న కల కలగానే మిగిలిపోయింది.

ఇదిలా ఉంటే.. ఓటమి బాధలో ఉన్న రాజస్తాన్ ఆటగాడు షిమ్రన్ హెట్‌మెయిర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఐపీఎల్ నిర్వాహకులు అతడికి జరిమానా విధించారు. ఇంతకీ ఏం జరిగిందంటే?!..

**వాళ్లిద్దరు మినహా అంతా విఫలం**

చెన్నైలోని చెపాక్ వేదికగా సన్‌రైజర్స్‌తో తలపడ్డ రాజస్తాన్ 36 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఎస్ఆర్‌హెచ్ విధించిన 176 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక చతికిలపడింది. ఓపెనర్ యశస్వి జైస్వాల్(42), ఐదో నంబర్ బ్యాటర్(56- నాటౌట్) మినహా మిగతా బ్యాటర్లంతా పూర్తిగా విఫలమయ్యారు.

**ఆశలన్నీ వమ్ముచేసి.. వికెట్ పారేసుకుని**

సన్‌రైజర్స్ బౌలర్ల ట్రాప్‌లో చిక్కుకుని పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఇక పవర్‌ఫుల్ హిట్టర్‌గా పేరొందిన షిమ్రన్ హెట్‌మెయిర్ 10 బంతులు ఎదుర్కొని కేవలం 4 పరుగులే చేసి ఘోరంగా విఫలమయ్యాడు. పద్నాలుగవ ఓవర్లో రైజర్స్ లెఫ్టార్మ్ స్పిన్ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మ బౌలింగ్‌లో ఊహించని రీతిలో బౌల్డ్ అయి వికెట్ పారేసుకున్నాడు. జట్టు తనపై పెట్టుకున్న ఆశలు వమ్ము చేశాడు.

ఈ క్రమంలో.. అప్పటికే పరాజయం దిశగా జట్టు పయనించడం.. పార్ట్‌టైమ్ బౌలర్ చేతిలో తనకు భంగపాటు ఎదురుకావడంతో హెట్‌మెయిర్ తీవ్ర అసహనానికి లోనయ్యాడు.

**పనిష్మెంట్ ఇచ్చిన బీసీసీఐ**

క్రీజును వీడే సమయంలో బ్యాట్‌తో వికెట్లను కొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ నేపథ్యంలో బీసీసీఐ అతడికి జరిమానా విధించడం గమనార్హం. "షిమ్రన్ హెట్‌మెయిర్.. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం.. లెవల్ 1 తప్పిదానికి పాల్పడ్డాడని మ్యాచ్ రిఫరీ తేల్చారు. అతడు కూడా తన తప్పును అంగీకరించాడు" అని ప్రకటన విడుదల చేసింది. హెట్‌మెయిర్ మ్యాచ్ ఫీజులో 10 శాతం మేర కోత విధిస్తున్నట్లు తెలిపింది.

## దటీజ్ కావ్య.. సరైన నిర్ణయాలు!.. తండ్రిని హత్తుకుని చిన్నపిల్లలా!



సన్‌రైజర్స్... ఈ ఏడాది టీ20 లీగ్‌లలో ఈ ఫ్రాంఛైజీకి బాగా కలిసి వస్తోంది. సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో వరుసగా రెండోసారి చాంపియన్‌గా నిలిచిన సన్‌రైజర్స్.. క్యాష్ రిచ్ లీగ్ ఐపీఎల్‌లోనూ దుమ్మురేపుతోంది. గత మూడేళ్ల వైఫల్యాలను మరిపించేలా సంచలన ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకువెళ్లింది. ప్యాట్ కమిన్స్ సారథ్యంలో.. విధ్వంసకర బ్యాటింగ్‌తో సరికొత్త రికార్డులు సృష్టిస్తూ అనూహ్య రీతిలో ఆరేళ్ల తర్వాత టైటిల్ రేసులో నిలిచింది.

క్వాలిఫయర్-2లో రాజస్తాన్ రాయల్స్‌ను 36 పరుగులతో ఓడించి కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఢీకొట్టేందుకు సిద్ధమైంది. కేకేఆర్ రూపంలో ఇంకొక్క గండం దాటేస్తే ట్రోఫీని ముద్దాడే అవకాశం ముంగిట నిలిచింది. ఈ నేపథ్యంలో సన్‌రైజర్స్ యజమాని కావ్యా మారన్ సంబరాలు అంబరాన్నంటాయి. కీలక మ్యాచ్‌లో ఆద్యంతం తన హావభావాలతో హైలైట్‌గా నిలిచారామె. ముఖ్యంగా రాజస్తాన్ కెప్టెన్, స్టార్ బ్యాటర్ సంజూ శాంసన్‌ను అభిషేక్ శర్మ అవుట్ చేయగానే జట్టు గెలిచినంతగా సెలబ్రేట్ చేసుకున్నారు.

**తండ్రిని ఆలింగనం చేసుకుని**

ఇక రాజస్తాన్‌పై తమ విజయం ఖరారు కాగానే ఆమె ఎగిరి గంతేశారు. తన తండ్రి కళానిధి మారన్‌ను ఆలింగనం చేసుకుని ఆనందం పంచుకున్నారు. వేలంలో తాను అనుసరించిన వ్యూహాలు ఫలితాలు ఇస్తున్న తీరుకు మురిసిపోతూ చిరునవ్వులు చిందించారు. కరతాళ ధ్వనులతో ఎస్ఆర్‌హెచ్ ఆటగాళ్లను అభినందిస్తూ పట్టరాని సంతోషంతో ఉద్వేగానికి లోనయ్యారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాగా ఐపీఎల్-2024 ఆరంభానికి ముందు సన్‌రైజర్స్ యాజమాన్యం కీలక మార్పులు చేసింది. బ్రియన్ లారా స్థానంలో న్యూజిలాండ్ స్పిన్ దిగ్గజం డానియల్ వెటోరిని ప్రధాన కోచ్‌గా నియమించింది.

**ఆటతోనే సమాధానం**


అదే విధంగా వన్డే ప్రపంచకప్-2023 విజేత, ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కోసం ఏకంగా రూ. 20.50 కోట్లు ఖర్చు పెట్టింది. అతడికి సారథ్య బాధ్యతలు అప్పగించి పూర్తి నమ్మకం ఉంచింది.

అందుకు తగ్గట్లుగానే ఈ ఆసీస్ పేసర్ జట్టును విజయపథంలో నిలిపాడు. వేలం నాటి నుంచే సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ వ్యూహాలను, కావ్య మారన్ నిర్ణయాలను విమర్శించిన వాళ్లకు అద్భుత ప్రదర్శనతో జట్టును ఫైనల్‌కు చేర్చి సమాధానమిచ్చాడు.

**సౌతాఫ్రికాలో వరుసగా రెండుసార్లు**

ఇదిలా ఉంటే.. 2023లో మొదలైన సౌతాఫ్రికా టీ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్‌కేప్ పేరిట అడుగుపెట్టింది సన్‌గ్రూప్. ఐడెన్ మార్క్రమ్‌ను కెప్టెన్‌గా నియమించగా.. అరంగేట్రంలోనే జట్టును టైటిల్ విజేతగా నిలిపాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ముగిసిన ఫైనల్లోనూ సన్‌రైజర్స్‌ను గెలిపించి ట్రోఫీ అందించాడు.

## హెడ్ కోచ్ పదవిపై ఏబీ డివిలియర్స్ కీలక వ్యాఖ్యలు



టీ20 వరల్డ్ కప్ ముగిసిన తర్వాత టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ పదవి కాలం ముగుస్తుండడంతో బీసీసీఐ గత నెల నుండే కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే ఆశావహుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తుంది. ఈ నేపథ్యంలో టీమిండియా హెడ్ కోచ్ పదవిపై సౌతాఫ్రికా మాజీ స్టార్ క్రికెటర్ ఏబీ డివిలియర్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ ఇంటర్వ్యూలో ఏబీడీ మాట్లాడుతుండగా.. టీమిండియా హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ స్థానాన్ని భర్తీ చేస్తారా అన్న ప్రశ్నకు డివిలియర్స్ మనసులో మాట బయటపెట్టాడు. తనకు కోచింగ్ అంటే ఇష్టమేనని.. కానీ ఇప్పుడే ఆ పదవి చేపట్టలేనని అన్నారు. తాను నేర్చుకోవాల్సింది ఇంకా చాలా ఉందని, అందుకే ఇప్పటి వరకు కోచ్ పదవి గురించి ఆలోచించ లేదని స్పష్టం చేశారు. కానీ కోచింగ్‌ను తాను ఎంజాయ్ చేస్తానని.. ఫ్యూచర్‌లో కోచ్‌గా వ్యవహరించే అవకాశం ఉన్నట్లు తెలిపారు.కొన్ని జట్లు, కొందరు ఆటగాళ్లతో నేనెప్పుడూ కలిసి పని చేయుటకు ఇష్టపడుతానన్నాడు. టీమిండియా హెడ్ కోచ్ పదవి అంటే చాలా ఒత్తిడితో కూడికుని ఉంటుందని.. ఆ జట్టుపై భారీ అంచనాలు ఉంటాయని చెప్పారు.

## కోచ్ రేసులో లేము!

### - పాంటింగ్,లాంగర్ వెల్లడి



న్యూఢిల్లీ: ఐపీఎల్ 17వ సీజన్ మే 26న ముగియనుంది. మే 27న భారత జట్టు చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తులు చేసుకునేందుకు తుది గడువు. కోల్‌కత నైట్‌రైడర్స్ మెంటార్ గౌతం గంభీర్‌ను బీసీసీఐ సంప్రదించినట్టు వార్తలు వచ్చినట్టే.. రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్, స్టీఫెన్ ఫ్లెమింగ్‌లను సైతం బోర్డు వర్గాలు కలిసినట్టు సమాచారం. భారత క్రికెట్ చీఫ్ కోచ్ పదవి రేసులో ప్రస్తుతానికి లేమని రికీ పాంటింగ్, జస్టిన్ లాంగర్ తెలిపారు. 'ఇలాంటి వార్తలు ముందుగా సోషల్ మీడియాలోనే ముందుగా చూస్తాం. ఐపీఎల్ సందర్భంగా చిట్‌చాట్‌లో ఆసక్తి ఉందా అని అడిగిన మాట వాస్తవమే. ఓ జాతీయ జట్టుకు చీఫ్ కోచ్‌గా పని చేయడానికి ఇష్టపడతాను. కానీ ఇప్పుడు నా లైఫ్‌స్టయిల్‌కు చీఫ్ కోచ్ పదవి సరిపడదు. ఐపీఎల్, ఆసీస్‌లో టెలివిజన్ బాధ్యతలు ఉన్నాయి. ఏడాదికి 9-10 నెలలు కుటుంబానికి దూరంగా ఉండే పరిస్థితులు లేవు' అని పాంటింగ్ అన్నాడు. జస్టిన్ లాంగర్ సైతం భారత మెన్స్ జట్టుకు శిక్షణ సారథ్యం వహించేందుకు సిద్ధంగా లేనట్టు తెలిపాడు. ఈ విషయంపై కెఎల్ రాహుల్‌తో ఓసారి మాట్లాడాడు. 'ఐపీఎల్ జట్టులో ఒత్తిడి, పాలిటిక్స్ ఎలా ఉంటాయో మీకు తెలుసు. భారత జట్టు చీఫ్ కోచ్‌గా అందుకు వెయ్యి రెట్లు ఎక్కువ ఒత్తిడి, పాలిటిక్స్ ఉంటాయి' అని రాహుల్ నాతో చెప్పాడు. ఇక స్టీఫెన్ ఫ్లెమింగ్ సైతం చీఫ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయలేదని చెన్నై సూపర్‌కింగ్స్ సీఈవో కాశీ విశ్వనాథ్ తెలిపారు. సాధారణ సంభాషణలో అడుగగా.. ఆసక్తి లేదని ఫ్లెమింగ్ తెలిపినట్టు కాశీ విశ్వనాథన్ ఓ ఇంటర్వ్యూలో వెల్లడించాడు.

## ఐపీఎల్ ఫైనల్ వేళ సన్ రైజర్స్ షాకింగ్ నిర్ణయం..!



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2024) ఫైనల్ దశకు చేరుకుంది. రేపు చెన్నైలోని చేపాక్ స్టేడియంలో జరిగే ఫైనల్లో కోల్ కతా నైట్ రైడర్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ అమీతుమీ తేల్చుకోబోతున్నాయి. ఈ మ్యాచ్ పై అభిమానుల్లో భారీ ఉత్కంఠ నెలకొంది. ఈ మధ్య కాలంలో సన్ రైజర్స్ జట్టు ఫైనల్ కు చేరుకోకపోవడం, అందివచ్చిన అవకాశాన్ని ఏ మేరకు ఉపయోగించుకుని టైటిల్ కైవసం చేసుకుంటుందన్న చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో సన్ రైజర్స్ కీలక నిర్ణయం తీసుకుంది. రేపు జరిగే ఫైనల్ కు వేదికైన చేపాక్ స్టేడియంలో ఇప్పటికే నిన్న రాజస్థాన్ రాయల్స్ తో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు క్వాలిఫయర్ 2 మ్యాచ్ ఆడింది. అయితే ఈ మ్యాచ్ లో ఆటగాళ్లు వాతావరణంతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. సముద్ర తీరంలో ఉన్న చేపాక్ స్టేడియంలో ఉక్కపోత భరించలేక చెమటతో తడిసి ముద్దయ్యారు. దీంతో ఆటపై మనసు పెట్టలేక వారు పడిన ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. ఈ నేపథ్యంలో ఇవాళ సాయంత్రం జరగాల్సిన ప్రాక్టీస్ సెషన్ ను అనూహ్యంగా రద్దు చేసుకుంది. వాస్తవానికి రేపు కీలకమైన ఫైనల్ మ్యాచ్ ఆడబోతున్న వేళ ఇవాళ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ చేపాక్ స్టేడియంలో సన్ రైజర్స్ జట్టుకు ప్రాక్టీస్ సెషన్ ఏర్పాటు చేశారు. అయితే చెన్నైలో భారీ ఉక్కపోత, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆటగాళ్లు డీహైడ్రేషన్ కు గురైతే రేపటి ఫైనల్ పై ప్రభావం పడుతుందని జట్టు ఫ్రాంచైజీ భావించినట్లు తెలుస్తోంది. దీంతో కోచ్, ఇతర మేనేజ్ మెంట్ ప్రతినిధులతో మాట్లాడి ఈ సెషన్ క్యాన్సిల్ చేసుకుంది. అంటే రాజస్థాన్ రాయల్స్ తో మ్యాచ్ తర్వాత నేరుగా రేపు కోల్ కతా నైటరైడర్స్ తో ఫైనల్ ఆడేందుకు సన్ రైజర్స్ సిద్ధమైంది.

## 'భారత్‌లో ధోనీ క్రేజ్‌ని చూసి ఆశ్చర్యపోయా.. మా స్టేడియంలోనూ 98 శాతం ఆ జెర్సీలే'



ఇంటర్నెట్ డెస్క్: ఈసారి చెన్నై సూపర్‌కింగ్స్ ఎక్కడ మ్యాచ్‌లు ఆడినా ఆ స్టేడియాలు సింహభాగం సీఎస్కే అభిమానులతో నిండిపోయాయి. ఇందుకు ప్రధాన కారణం మహేంద్రసింగ్ ధోనీ .అతడి ఆట చూడటానికే ఎంతోమంది స్టేడియాలకు వస్తారనడంలో సందేహం లేదు. ధోనీ కూడా ఈసారి బ్యాటింగ్‌లో మునపటిలా మెరుపులు మెరిపించాడు. దీంతో ఫ్యాన్స్ ఎంతో ఎంజాయ్ చేశారు. అయితే, కీలక దశలో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ ఓడిపోయి త్రుటిలో ప్లేఆఫ్స్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఇక.. భారత్‌లో ధోనీకి ఉన్న క్రేజ్ చూసి ఆశ్చర్యపోయానని లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కోచ్ జస్టిన్ లాంగర్ అన్నాడు. ఐపీఎల్ కోసం గత రెండు, మూడు నెలలు భారత్‌లోనే ఉన్న లాంగర్ దేశవ్యాప్తంగా ధోనీకి అభిమానులు బ్రహ్మరథం పట్టిన తీరు చూసి ఆశ్చర్యపోయినట్లు ఓ క్రీడా ఛానల్ పాడ్‌కాస్ట్‌లో పేర్కొన్నాడు."ధోనీకి ఉన్న క్రేజ్ గురించి ఇంతవరకు విన్నాను. ఈ సీజన్‌లో మేం చెన్నై సూపర్‌కింగ్స్‌తో రెండుసార్లు ఆడాం. సీఎస్కే లఖ్‌నవూకు వచ్చినప్పుడు మా స్టేడియానికి (ఎకానా స్టేడియం) దాదాపు 50,000 మంది అభిమానులు వచ్చారు. నిజాయతీగా చెప్పాలంటే అందులో 48,000 మంది ధోనీ జెర్సీ నంబర్ 7 ధరించినవారే ఉన్నారు. దీన్ని నేను నమ్మలేకపోయాను. ఆపై మేము చెన్నైకి వెళ్లాము. అక్కడ 98 శాతం కాదు మొత్తం 100 శాతం ధోనీ అభిమానులే. భారత్‌లో ధోనీకి ఉన్న క్రేజ్ అసాధారణమైనది. ఇది నమ్మశక్యంగా లేదు" అని లఖ్‌నవూ కోచ్ వివరించాడు.

## సన్‌రైజర్స్‌కు మూడో ఫైనల్.. 'ఆల్‌టైమ్ రికార్డు' ఆ జట్టుదే..!

ఐపీఎల్ పదిహేడో సీజన్ ఆఖరి అంకానికి చేరింది. టోర్నీ ఆసాంతం అదరగొట్టిన రెండు జట్లు టైటిల్ పోరులో తాడోపేడో తేల్చుకోనున్నాయి. ఈ ఏడాది రికార్డు స్కోర్లతో ఐపీఎల్ చరిత్రనే తిరగరాసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ మూడో ఫైనల్లో అడుగుపెట్టింది. ఉత్కంఠ రేపిన క్వాలిఫయర్ 2లో రాజస్థాన్ రాయల్స్ పై సంచలన విజయంతో రెండో టైటిల్ వేటకు సిద్ధమైంది. తొలిసారి 2016లో టైటిల్ పోరుకు దూసుకెళ్లిన ఆరెంజ్ ఆర్మీ చాంపియన్‌గా అవతరించింది. అనంతరం 2018లోనూ ఫైనల్ చేరినా చెన్నై సూపర్ కింగ్స్ ధాటికి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక సార్లు ఫైనల్ ఆడిన ఆల్‌టైమ్ రికార్డు మాత్రం సీఎస్కేదే. ఆ జట్టు ఏకంగా పది పర్యాయాలు టైటిల్ వేటలో నిలవడమే కాకుండా ఐదు ట్రోఫీలు కొల్లగొట్టింది.సీఎస్కే తర్వాత ఎక్కువ ఫైనల్స్ ఆడిన రికార్డు ముంబై ఇండియన్స్ పేరిట ఉంది. ఆరుసార్లు టైటిల్ ఫైట్‌లో తలపడిన ముంబై ఏకంగా ఐదు ట్రోఫీలు ఎగరేసుకుపోయింది. ఇక ప్రస్తుత ఫైనలిస్ట్ కోల్‌కతా నైట్ రైడర్స్ విషయానికొస్తే.. ఇది ఆ జట్టుకు నాలుగో ఫైనల్. గతంలో గౌతం గంభీర్ సారథ్యంలో కోల్‌కతా రెండు సార్లు (2012, 2014) చాంపియన్‌గా నిలిచింది.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI NO:- TELTEL 02048/2021, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**